RNI NO.TELTEL / 2013 /50370
తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం 16.06.2026 | సంపుటి : 12 సంచిక : 327 | పేజీలు : 12 వెల : రూ. 4/-
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698






# అమెరికా-ఇరాన్ శాంతి ఒప్పందం

## పశ్చిమాసియా ఉద్రిక్తతలకు తెర
## ట్రూత్ వేదికగా ప్రకటించిన ట్రంప్
## ఒప్పందాన్ని స్వాగతించిన ప్రపంచ దేశాలు

"ఇరాన్‌తో శాంతి ఒప్పందం ప్రక్రియ ఇప్పుడు పూర్తిగా పూర్తయింది. ఈ ప్రయాణంలో భాగస్వాములైన అందరికీ నా హృదయపూర్వక అభినందనలు! వ్యూహాత్మక ప్రాంతమైన హార్ముజ్‌ను ఇకపై ఎలాంటి టోల్ లేదా రుసుము లేకుండా అంతర్జాతీయ రవాణా కోసం ఉచితంగా తెరవడానికి అనుమతించాను. అలాగే, అమెరికా విధించిన నౌకాదళ దిగ్బంధనాన్ని తక్షణమే ఎత్తివేస్తున్నా. ప్రపంచ దేశాలు ఇక తమ నౌకల ఇంజన్లను స్టార్ట్ చేయండి. అంతర్జాతీయ మార్కెట్‌లోకి చమురు ప్రవాహాన్ని యథావిధిగా కొనసాగించండి - ట్రంప్


వాషింగ్టన్(జనంసాక్షి):

పశ్చిమాసియా ఉద్రిక్తతలకు తెర పడింది. అమెరికా-ఇరాన్ మధ్య చారిత్రక శాంతి ఒప్పందం కుదిరింది. ఈ వారం చివర్లో దీనిపై సంతకాలు జరగనున్నాయి. మూడు నెలలకు పైగా సాగిన యుద్ధం ముగిసిపోవడంతో భారత్ సహా ప్రపంచదేశాలు హర్షం వ్యక్తంచేశాయి. ఈ ఒప్పందాన్ని స్వాగతిస్తూ.. పశ్చిమాసియాలో సుస్థిర శాంతి నెలకొనాలని ఆకాంక్షించాయి. నెలల తరబడి ఉత్కంఠ రేపిన పశ్చిమాసియా ఉద్రిక్తతలకు తెరదించుతూ అమెరికా, ఇరాన్ దేశాల మధ్య కుదిరిన చరిత్రాత్మక శాంతి ఒప్పందాన్ని ప్రపంచ దేశాలు ఏకగ్రీవంగా స్వాగతించాయి. ప్రాంతీయ స్థిరత్వాన్ని పునరుద్ధరించడానికి, వ్యూహాత్మక హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికి, అంతర్జాతీయ ఆర్థిక రంగానికి ఊరటనిచ్చేందుకు ఈ ఒప్పందం ఒక అద్భుతమైన దౌత్యపరమైన మలుపు అని ప్రపంచ దేశాల నేతలు అభివర్ణించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన ఈ చారిత్రాత్మక ఒప్పందానికి పాకిస్థాన్ ప్రధానంగా మధ్యవర్తిత్వం వహించగా.. ఖతార్, టర్కీ, యునైటెడ్ మిగతా 2లో..

## శాంతి ఒప్పందం
# అంగీకరించం

### సైన్యాన్ని వెనక్కి రప్పించం : ఇజ్రాయెల్
### లెబనాన్‌పై కొనసాగుతున్న టెహ్రాన్ దాడులు
### ఇరాన్ మళ్లీ ప్రతీకార దాడులకు తెగబడితే యుద్ధ పరిస్థితులు పునరావృతమవుతాయి : ఇజ్రాయెల్ రక్షణమంత్రి కాట్జ్

టెల్‌అవీవ్(జనంసాక్షి):
డీల్ కుదుర్చుకోవడానికి ఇరాన్-అమెరికా సిద్ధంగా ఉన్న సమయంలో ఈ శాంతి ఒప్పందానికి ఇజ్రాయెల్ అడ్డం పడుతోంది. లెబనాన్‌పై దాడులు ఆపితేనే ఒప్పందం కుదురుతుందని టెహ్రాన్ స్పష్టం చేసినా.. క్షిపణులతో విరుచుకుపడుతోంది. ఒప్పందం ఇంకా కుదరనందున గాజా, సిరియా, లెబనాన్‌లలో స్వాధీనం చేసుకున్న భూభాగాల నుంచి



మిగతా 2లో..

# మెట్రో విస్తరణను అడ్డుకుంటున్న కిషన్‌రెడ్డి

## మోడీ హామీలపై అమలు నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం

- కేసీఆర్, కేటీఆర్ కలిసి కిషన్‌రెడ్డి రెండోదశను ముందుకు సాగకుండా కుట్రపన్నుతున్నారు
- హైదరాబాద్ అభివృద్ధిని విస్మరించిన కేంద్రమంత్రి
- మహారాష్ట్ర నుంచి ఎన్‌వోసి ఇప్పించడంలో కూడా విఫలం
- ఎల్ అండ్ టికి రుణ బదలాయంపును అడ్డుకున్న పెద్దమనిషి
- అభివృద్ధి జరిగితే పుట్టగతులు ఉండవనే భయంలో బిజెపి
- మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శలు



హైదరాబాద్,జూన్15(జనంసాక్షి):
మెట్రో విస్తరణను బీఆర్ఎస్, బీజేపీ అడ్డుకుంటున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మెట్రో విస్తరణ జరిగేచోట బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలే ఉన్నారని తెలిపారు. సమస్యలపై మాట్లాడదామంటే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సమయం ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. సోమవారం సచివాలయంలో సిఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కిషన్‌రెడ్డి బాధ్యత తీసుకుని మాట్లాడాలని సూచించారు. మెట్రో విస్తరణకు మిగతా 2లో..

"తెలంగాణ నుంచి కేంద్ర క్యాబినెట్‌లో ఉన్న కిషన్‌రెడ్డికి నగరాన్ని అభివృద్ధి చేసే బాధ్యత లేదా? కేసీఆర్, కేటీఆర్ కలిసి ఆయన మెట్రో ఫేజ్-2ను అడ్డుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భాజపాకు కేసీఆర్ సహకరించినందుకు కిషన్‌రెడ్డి గురుదక్షిణ చెల్లిస్తున్నారు. అహ్మదాబాద్, విశాఖ మెట్రోలకు అనుమతు లిచ్చి హైదరాబాద్‌కు ఆపారు. తెలంగాణపై కేంద్రం వివక్ష కొనసాగిస్తోంది. కచ్చితంగా కేంద్ర ప్రభుత్వం వద్దే మెట్రో ఫేజ్-2 ఆగింది. హైదరాబాద్‌కు 2023లోనే ట్రిపుల్ ఆర్‌ను కేంద్రం ప్రకటించింది. అది ఇంకా సాకారం కాలేదు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోదీ హామీ ఇచ్చి నెరవేర్చలేదు. ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని అన్నారు. అన్నింటికీ బాధ్యత వహిస్తూ మోదీ రాజీనామా చేస్తే.. మేమూ చేస్తాం" - సీఎం రేవంత్‌రెడ్డి

## 'ఎస్ఐఆర్'పై అందరూ అప్రమత్తంగా ఉండాలి

కాంగ్రెస్ పార్టీ నేతలతో సీఎం రేవంత్‌రెడ్డి

2లో..

## క్షేత్రస్థాయిలో వెళ్లని అధికారులపై చర్యలు తప్పవు

- ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికతో ప్రజలకు చేరువయ్యాం
- కొన్ని విభాగాలు ఇంకా ప్రజల్లోకి వెళ్లలేక పోయాయి
- అన్ని శాఖలు చేపట్టిన కార్యక్రమాలకు ప్రచారం కల్పించాలి
- గ్రామాల్లో వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- మీడియా ద్వారా చేసిన పనులకు ప్రాచుర్యం కల్పించాలి
- ప్రగతి ప్రణాళికపై సచివాలయంలో సీఎం రేవంత్ సమీక్ష



2లో..

## శాంతి ఒప్పందం..శుభపరిణామం

### సుస్థిరమైన తుది ఒప్పందానికి దిశగా సానుకూల చర్చలు జరుగుతాయని విశ్వసిస్తున్నాం : మోడీ



న్యూఢిల్లీ(జనంసాక్షి):అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందంపై భారత ప్రధాని నరేంద్రమోదీ స్వాగతించారు. ఉద్రిక్తతలను ముగించేందుకు ఇరుదేశాలు ఓ అంగీకారానికి రావడాన్ని స్వాగతిస్తున్నట్లు మిగతా 2లో..

## డిజిటల్ సంతకాలూ పూర్తయ్యాయి

### ఆంక్షల సడలింపు మాత్రం ఇరాన్ ఒప్పంద నిబంధనల అమలు తర్వాతే ఉంటుంది: వాన్స్



వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికా- ఇరాన్ మధ్య చారిత్రక శాంతి ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన వేళ వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ కీలక విషయాలు మిగతా 2లో..

## బీజేపీ కుట్రలో పావుగా పవన్

### తెలంగాణపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకోం: మహేష్ గౌడ్

హైదరాబాద్(జనంసాక్షి):

పవన్ కళ్యాణ్ పదే పదే తెలంగాణను కించపరిచేలా మాట్లాడుతున్నారని, ఆయన వ్యాఖ్యల వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. రాజకీయాల్లో విచ్చలవిడిగా మాట్లాడటానికి ఇదేమీ సినిమా కాదని మహేష్ కుమార్ గౌడ్ హితవు పలికారు. ఈ మేరకు ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తెలంగాణ రాష్ట్రంపై, కాంగ్రెస్ పార్టీపై చేసిన వ్యాఖ్యలపై కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పవన్ కళ్యాణ్ స్వతహాగా మాట్లాడడం లేదన్నారు. కేంద్రంలోని మోడీ, ఇతర బీజేపీ నేతలు కించపరిచేలా స్క్రిప్ట్ ఇస్తే, దాని



ప్రకారం పవన్ మాట్లాడుతున్నారు. ఆయన పూర్తిగా బీజేపీ ఆడించే తోలుబొమ్మలా మారిపోయారని దుయ్యబట్టారు. తెలంగాణ ఆవిర్భావాన్ని, రాష్ట్ర విభజనను పవన్ కళ్యాణ్ వ్యతిరేకిస్తూ మాట్లాడటం కొత్తేమీ కాదని, గతంలోనూ మోడీతో సహా బీజేపీ నేతలు ఇదే తరహాలో తెలంగాణను మిగతా 2లో..

## మోగిన బడిగంటలు

- రాష్ట్రవ్యాప్తంగా తెరుచుకున్న స్కూళ్లు
- మళ్లీ రోడ్డెక్కిన బస్సులు, ఆటోలు

హైదరాబాద్(జనంసాక్షి):
వేసవి సెలవులు ముగియడంతో సోమవారం స్కూళు పునఃప్రారంభం అయ్యాయి. ఇన్నాళ్లూ ఇంటికే పరిమితం అయిన విద్యార్థులు మళ్లీ బడిబాట పట్టారు. ఉదయమే మళ్లీ ఆటోలు, బస్సులు రయ్‌మంటూ మిగతా 2లో..





## తెలంగాణ వరి ఉత్పత్తులకు
# విదేశాల్లో డిమాండ్

### ప్రాధాన్యమున్న వరి వంగడాలకే ప్రోత్సాహం • రైతులు వాటినే పండించేలా దిశా నిర్దేశం

- రైతులు మిల్లర్లు కొనుగోలు చేసే రకాలను పండిస్తే మేలు
- కేబినేట్ సబ్‌కమిటీలో డిప్యూటి సిఎం భట్టి

హైదరాబాద్(జనంసాక్షి):రాష్ట్రంలో 8 మేలురకం వరి వంగడాల సాగును పెద్దఎత్తున ప్రోత్సహించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. విదేశాల్లో తెలంగాణ బియ్యానికి బాగా డిమాండ్ ఉందని భట్టి విక్రమార్క ప్రస్తావించారు. మద్దతు ధర కంటే ఎక్కువ ధర పలికే అవకాశం ఉందని వెల్లడించారు. తెలంగాణ సోనామసూరి సహా ఎగుమతులకు అనుకూలమైన వరి రకాలపై రైతన్నలు దృష్టిపెట్టాలని సూచించారు. ఇందుకోసం రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సోమవారం ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ సమావేశమైంది. ఈ సమావేశానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. ఎగుమతి రకాల సాగుపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని అన్నారు. కేబినెట్ సబ్ కమిటీకి వ్యవసాయ నిపుణుల కీలక సూచనలు చేశారని తెలిపారు. ఆ 8 రకాల వంగడాలతోనే రైతులకు లాభాలు వస్తాయని వివరించారు. మార్కెట్ డిమాండ్ ఉన్న వరి రకాల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో మిగతా 2లో..

# మళ్లీ నిఫా కలకలం



### కేరళలో ఒక వ్యక్తికి వైరస్ నిర్ధారణ • మెడికల్ కాలేజీ ఐసియూలో చికిత్స • వైద్యశాఖను అప్రమత్తం చేసిన ప్రభుత్వం • అప్రమత్తమైన తమిళనాడు

తిరువనంతపురం(జనంసాక్షి):దక్షిణ భారత రాష్ట్రాల్లో మరోసారి నిఫా వైరస్ భయం నెలకొంది. కేరళలోని కోజికోడ్ జిల్లాలో ఒక వ్యక్తికి నిఫా వైరస్ సోకినట్లు నిర్ధారణ కావడంతో రాష్ట్ర యంత్రాంగం అత్యవసర చర్యలు చేపట్టింది. కోజికోడ్ లోని రమణట్టుకర మున్సిపాలిటీ పరిధికి చెందిన 43 ఏళ్ల వ్యక్తి ప్రస్తుతం కోజికోడ్ మెడికల్ కాలేజ్ ఆసుపత్రిలోని ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడు. పూణెలిలోని జాతీయ వైరాలజీ సంస్థ నుంచి వైరస్ నిర్ధారణ నివేదిక అందిన వెంటనే కేరళ ప్రభుత్వం వైద్య, ఆరోగ్య శాఖలను అప్రమత్తం చేసింది. వైద్య నిపుణుల సూచనల మేరకు బాధితుడికి మోనోక్లోనల్ యాంటీబాడీ చికిత్సను కూడా ప్రారంభించారు. బాధితుడితో ఇటీవల సన్నిహితంగా మెలిగిన వారిని గుర్తించేందుకు అధికారులు విస్తృత స్థాయిలో కాంటాక్ట్ ట్రేసింగ్ నిర్వహించారు. మొత్తం 87 మందిని పర్యవేక్షణ జాబితాలో చేర్చారు. వీరిలో 58 మంది ఆరోగ్య సిబ్బంది, 14 మంది కుటుంబ సభ్యులు, ఐదుగురు స్నేహితులు ఉన్నారు. అధిక ప్రమాదంలో ఉన్న వ్యక్తులను ముందస్తు మిగతా 9లో..




## అమెరికా మిస్సోరిలో కుప్పకూలిన విమానం

### అందులో ప్రయాణిస్తున్న 12 మంది మృతి

వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికాలోని మిస్సోరీ రాష్ట్రంలో ఓ విమానం కుప్పకూలింది. ఈ ఘటనలో అందులో ప్రయాణిస్తున్న 12 మంది చనిపోయారు. స్కైడైవింగ్ చేసే వారిని తీసుకెళ్తుండగా బట్లర్ మెమోరియల్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో ఈదుర్ఘటన జరిగింది. ప్లేన్ టేకాఫ్ అయిన తర్వాత రన్‌వేకు సుమారు 300 గజాల దూరంలో క్రాష్ అయింది. చనిపోయిన వారిలో 11 మంది స్కైడైవర్లు, ఒక పైలట్ ఉన్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. మిగతా 2లో..

## సింగరేణిని ప్రైవేట్ పరం చేసే కుట్రలు

### కార్మికుల హక్కుల కోసం హెచ్‌ఎంఎస్‌తో కలసి పోరాటం : టిఆర్ఎస్ చీఫ్ కవిత



మంచిర్యాల(జనంసాక్షి):సింగరేణిని ప్రైవేట్ పరం చేసే కుట్రలు జరుగుతున్నాయని టీఆర్ఎస్ చీఫ్ కవిత ఆరోపించారు. కొత్త బొగ్గు బావులు తెచ్చుకుంటే లక్షలాది మందికి ఉద్యోగాలు వస్తాయని, మన హక్కైన మిగతా 2లో..

## ధాన్యం సేకరణలో కేంద్రం ప్రేక్షకపాత్ర

- కేవలం మద్దతు ధరలు ప్రకటించి మిన్నకుంటోంది
- జొన్న,మొక్కజొన్నలను ఎంఎస్‌పి పరిధిలోకి తేవాలి
- కేంద్రం తీరుపై మండిపడ్డ మంత్రి తుమ్మల

హైదరాబాద్(జనంసాక్షి):
తెలంగాణ రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర వివక్ష చూపుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. మద్దతు ధర, ధాన్యం కొనుగోళ్ల విషయంలో కేంద్రం వ్యవహరిస్తున్న తీరును ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. రాష్ట్ర మిగతా 2లో..





9లో..

## ఎన్‌టీఏ తీరుతో నీట్ అభ్యర్థులకు అవస్థలు

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
16.06.2026

## 'ఎస్ఐఆర్'పై అందరూ అప్రమత్తంగా ఉండాలి

### కాంగ్రెస్ పార్టీ నేతలతో సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలతో ఆయన సమావేశమయ్యారు. వివిధ అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. అనుమానాస్పదం పేరుతో ఓట్లు తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. "ఓట్లు తొలగిస్తే రాజకీయంగా ప్రమాదకర పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తుంది. వచ్చే ఎన్నికలకు ఈ అక్టోబర్‌లోనే ఓటర్ల జాబితా ఖరారవుతుంది. ఓట్లు తొలగిపోతే తర్వాత చేసేదేం ఉండదు. ప్రతి గ్రామంలో బీఎల్‌వోలతో నాయకులు అనుసంధానమవ్వాలి. బీఎల్‌వోలు వెళ్లినప్పుడు వలస వెళ్లిన ఓటర్లు అందుబాటులో ఉండరు. అలాంటి ఓట్లు తొలగించకుండా జాగ్రత్త వహించాలి. ఈనెల 20లోపు ఇన్‌ఛార్జ్ మంత్రులు స్థానికంగా సమీక్షించాలి. జిల్లా స్థాయిలో మానిటరింగ్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలి. 17 ఎంపీ స్థానాల్లో ఎక్కడైనా సమస్య వస్తే పార్లమెంట్ ఇన్‌ఛార్జ్, అసెంబ్లీ పరిధిలో అసెంబ్లీ ఇన్‌ఛార్జ్ బాధ్యత వహించాలి. గాంధీభవన్ వార్‌రూమ్ ద్వారా బూత్ లెవెల్ మానిటరింగ్ చేయాలి. ఏరోజుకు ఆరోజు నివేదికలు తెప్పించుకోవాలి. ఎవరు నిర్లక్ష్యంగా ఉన్నా నష్టం జరుగుతుంది" అని అన్నారు.

## బీజేపీ కుట్రలో పావుగా పవన్

అవమానించారని గుర్తుచేశారు. ఎంతో మంది యువకులు ప్రాణత్యాగం చేస్తే, తెలంగాణ ప్రజల ఆకాంక్షను గుర్తించి సోనియా గాంధీ ప్రత్యేక రాష్ట్రాన్ని సాకారం చేశారని టీపీసీసీ చీఫ్ స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమం జరుగుతున్నప్పుడు పవన్ కళ్యాణ్ ఎక్కడున్నారు? ఏ సినిమాలో నటిస్తున్నారు? అని ఆయన నిలదీశారు. కాంగ్రెస్ పార్టీని విమర్శించడమంటే సినిమాల్లో డైలాగులు చెప్పినంత సులువు కాదని.. నెహ్రూ, గాంధీ కుటుంబాల త్యాగాల చరిత్రను పవన్ శ్రద్ధగా చదువుకుంటే మంచిదని హితవు పలికారు. ప్రధాని మోడీ ఇవాళ రాకెట్ల ముందు నిలబడి ఫోటోలు దిగుతున్నారంటే, ఆ అంతరిక్ష రంగానికి పునాది వేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తుంచుకోవాలన్నారు. పవన్ కళ్యాణ్ చాలా పెద్ద హీరో కావడానికి తెలంగాణ ప్రజలు కూడా కారణమని, ఇక్కడి ప్రేక్షకులు చూడబట్టే ఆయన సినిమాలు ఆడాయనే విషయాన్ని మరువరాదని మహేష్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఏపీ డిప్యూటీ సీఎంగా పవన్‌కు అక్కడ చేయాల్సిన పనులు చాలా ఉన్నాయని, వాటిపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. పవన్ కళ్యాణ్ రాజకీయాల్లో ఇంకా చాలా నేర్చుకోవాల్సి ఉంది. కాంగ్రెస్ గురించి మాట్లాడే అర్హత ఆయనకు లేదు, ఆ విషయంలో ఆయన చాలా చిన్నవాడు. అధికారం ఉందని తెలంగాణ గురించి ఎలా పడితే అలా మాట్లాడితే చూస్తూ ఊరుకోం' అని హెచ్చరించారు. రెండు రాష్ట్రాలు విడిపోయినా అన్నదమ్ములుగా కలిసి ఉండాలని తాము కోరుకుంటున్నామని, కానీ తెలంగాణలో రాజకీయ లబ్ది కోసం ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడటం సరికాదని మహేష్ గౌడ్ అన్నారు. ప్రస్తుతం తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ పాలన సాగుతోందని.. ఏపీ సైతం మన వైపు చూసేలా ఇక్కడ పరిపాలన ఉందన్నారు. అయితే, తెలంగాణను కించపరుస్తూ పవన్ కళ్యాణ్ ఇంతలా మాట్లాడుతున్నా.. బీఆర్ఎస్ నేతలు ఎందుకు స్పందించడం లేదని ఆయన ప్రశ్నించారు. వీరి మౌనం వెనుక బీజేపీ, బీఆర్ఎస్, పవన్ కళ్యాణ్ మధ్య ఉన్న లోపాయికారీ ఒప్పందం స్పష్టంగా అర్థమవుతోందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు.

## మోగిన బడిగంటలు

రోడ్లపైకి వచ్చాయి. స్కూళ్లను ముస్తాబు చేయడంతో విద్యార్థులు కేరింతలు కొడుతూ స్కూళ్లకు చేరారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు తెరుచుకున్నాయి. దీంతో విద్యార్థులు బడిబాట పట్టారు. పాఠశాలలకు తొలిరోజు వస్తున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు ఘనంగా స్వాగతం పలికారు. అల్పాహారం ఏర్పాటు చేశారు. ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. వేసవి సెలవులతో బోసిపోయిన పాఠశాలలు సందడిగా మారాయి. తెలంగాణలో పాఠశాలలు తెరచుకోవడంతో తల్లిదండ్రులు మళ్లీ బిజీ అయ్యారు. కొత్త పుస్తకాలు.. ఏకరూప దుస్తులతో బడులకు వెళ్లే చిన్నారులతో సందడి నెలకొంది. ఈసారి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కొత్తగా అల్పాహారాన్ని అందించనున్నారు. తొలి రోజే పాఠశాలల్లో పుస్తకాలు, నోట్ పుస్తకాల పంపిణీకి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే అమావాస్య రోజు పాఠశాలలు రీఓపెన్ కావడంతో మొదటి రోజు హాజరు శాతం భారీగా తగ్గింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్కూళ్లలో చాలా తక్కువ మంది విద్యార్థులపై హాజరయ్యారు. కొన్ని చోట్ల పదుల సంఖ్యలోనే విద్యార్థులు హాజరవ్వగా.. ఇక రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం గీతానగర్‌లోని బాలికల పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని ఒక్కతే పాఠశాలకు వచ్చింది. తోటి క్లాస్‌మేట్స్ ఎవరూ లేకపోవడంతో ఆ విద్యార్థిని ఒంటరిగానే క్లాస్ రూంలో కూర్చుంది. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ పునఃప్రారంభ తేదీ అమావాస్య రోజు రావడంతో కొందరు అశుభంగా భావిస్తున్నారు. ఈ రోజున కొత్త పనులు, చదువులు ప్రారంభించడం మంచిది కాదని తల్లిదండ్రులు భావిస్తున్నారు. తెల్లవారి పంపుదామంటే మంగళవారం అవుతుండడంతో ఈ రెండు రోజులు పిల్లలను ఇంటి వద్దే ఉంచాలని వారు ఆలోచిస్తున్నారు. దీంతో ఈ రోజుల్లో విద్యార్థుల హాజరు తగ్గే అవకాశం ఉంది. కొన్ని ప్రైవేట్ స్కూళ్లు ముందుగానే అమావాస్యను ఆలోచించి ఈ నెల 17న బుధవారం, 19న శుక్రవారం ప్రారంభించేందుకు నిర్ణయించాయి.

## ప్రభుత్వ బడుల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకం..

### ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకం ప్రారంభమైంది. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ బడిలో బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది.. అక్కడి విద్యార్థులకు అల్పాహారం వడ్డించారు. ఈ పథకంతో రాష్ట్రంలో 1.44 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. మరోవైపు.. పాఠశాల ప్రారంభమైన తొలిరోజే పాఠశాలల్లో పుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీకి ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.

## సింగరేణిని ప్రైవేట్ పరం చేసే కుట్రలు

డిపెండెంట్ ఉద్యోగాల కోసం రాజీలేని పోరాటం చేయాల్సి ఉందన్నారు. సింగరేణిని కాపాడాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఉంటే.. వెంటనే సింగరేణికి బకాయి ఉన్న 50 వేల కోట్ల రూపాయలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అండర్ గ్రౌండ్ మైనింగ్‌ను రద్దు చేసి, ఓపెన్ కాస్ట్ మైనింగ్‌ను పెంచుతూ సింగరేణి ఉనికిని దెబ్బతీసే కుట్రలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. మంచిర్యాల జిల్లాలో చేపట్టిన బొగ్గుబాయి కార్యక్రమంలో భాగంగా.. కాసిపేట మైన్-1ను ఆమె సందర్శించారు. నేరుగా గనిలోకి వెళ్లి కార్మికులతో మాట్లాడి, క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న కష్టాలను, సమస్యలను అడిగి తెలుసు కున్నారు. కాసిపేట నుంచే వారం రోజుల పాటు సాగనున్న ఈ 'బాయి బాట' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కవిత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణలో కొత్త రాజకీయ శక్తిగా అవతరించిన టిఆర్ఎస్ కు సింగరేణి బిడ్డల ఆశీర్వాదం కావాలని ఆమె కోరారు. వారసత్వ ఉద్యోగాల్లో సింగరేణి కార్మికులకు ప్రభుత్వం అన్యాయం చేస్తోందని తెలంగాణ రక్షణసేన అధ్యక్షురాలు కవిత మండిపడ్డారు. సింగరేణి సంస్థ పరిరక్షణ కోసమే.. టీఆర్ఎస్, హింద్ మజ్దూర్ సభ (హెచ్ఎంఎస్) కలిసి పని చేస్తున్నాయని చెప్పారు. పాలసీలు రూపొందించాల్సిన సీఎం, డిప్యూటీ సీఎంలే అధికారులకు వినతిపత్రాలు ఇస్తూ.. కార్మిక రంగాన్ని మభ్యపెడుతున్నారని విమర్శించారు. సింగరేణి సంస్థను ప్రైవేటీకరించడానికి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. అండర్ గ్రౌండ్ మైన్లను కాపాడుకోవడానికి హెచ్ఎంఎస్‌తో కలిసి పోరాటం చేస్తామని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో, ఆ తర్వాత బిఆర్ఎస్ ప్రభుత్వంలోనూ మనం కలిసి పనిచేశాం. నేను ఎక్కడున్నా అనునిత్యం మీ పక్కనే ఉండి పోరాడానని తెలిపారు.

# అమెరికా-ఇరాన్ శాంతి ఒప్పందం

కింగ్‌డమ్, జర్మనీ, ఫ్రాన్స్ దేశాలు దీనిపై హర్షం వ్యక్తం చేశాయి. ఈ ఒప్పందం పూర్తయినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' వేదికగా అధికారికంగా ప్రకటించారు. 'ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌తో ఒప్పందం ఇప్పుడు పూర్తయింది. అందరికీ అభినందనలు! ప్రపంచ నౌకలారా, మీ ఇంజన్లు స్టార్ట్ చేయండి. ఆయిల్ ప్రవహించనివ్వండి!' అని ట్రంప్ ఉత్సాహంగా ట్వీట్ చేశారు. అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన ఒప్పందాన్ని స్వాగతిస్తున్నాం. ఈ డీల్‌తో హర్మూజ్ జలసంధిలో ఇకపై నౌకల రవాణా నిరాటంకంగా, స్వేచ్ఛగా జరుగుతుందని ఆశిస్తున్నాం. శాంతి, ప్రాంతీయ స్థిరత్వం కోసం చేపట్టే అన్ని చర్యలకు భారత్ ఎల్లప్పుడూ మద్దతిస్తుంది. ఈ పరిణామాలను స్ఫూర్తిగా తీసుకుని ఉక్రెయిన్-రష్యా కూడా శాంతి ప్రయత్నాలు చేయాలని ఆకాంక్షిస్తున్నాం అని మంత్రిత్వ శాఖల అంతర్గత సమావేశంలో భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్ వెల్లడించారు. అమెరికా-ఇరాన్ మధ్య దౌత్యపరంగా చారిత్రక డీల్ జరగడం అభినందనీయం. ఈ పరిణామాలు ప్రపంచ ఆర్థికవ్యవస్థ పునరుజ్జీవనానికి మార్గం సుగమం చేశాయి. పశ్చిమాసియా మరింత సురక్షితంగా ఉంటుంది. ఈ ఒప్పందాన్ని కృతనిశ్చయంతో అమలుచేయడం అత్యావశ్యకం అని జర్మనీ ఛాన్స్‌లర్ ఫ్రెడ్రిక్ మెర్జ్ అభిప్రాయపడ్డారు. ఇరాన్-అమెరికా డీల్ శుభపరిణామం. ఈ ఒప్పందాన్ని వీలైనంత వేగంగా అమల్లోకి తీసుకురావాలి. హర్మూజ్ జలసంధిని త్వరగా, భేషరతుగా తెరవాలి. ఎలాంటి ఆంక్షలు, టోల్స్ లేకుండా నౌకల రవాణాను పునరుద్ధరించాలి. అప్పుడే ప్రాంతీయ స్థిరత్వం సాధించగలం. ఇరాన్ అణు, బాలిస్టిక్ క్షిపణులకు సంబంధించిన ఆందోళనలను కూడా ఈ డీల్ పరిష్కరించాలని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ అన్నారు. ఇరాన్-అమెరికా ఒప్పందాన్ని స్వాగతిస్తున్నాం. అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్‌తో పాటు డీల్ కోసం మధ్యవర్తిత్వం చేసిన దేశాలకు అభినందనలు. ఇప్పుడు అందరి దృష్టి ఈ ఒప్పందం అమలుపైనే ఉంది. హర్మూజ్‌ను శాశ్వతంగా తెరవడంతో పాటు నౌకల భద్రతకు సంబంధించిన సాంకేతిక అంశాల్లో మద్దతిచ్చేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. సుస్థిరశాంతికే మా ప్రథమ ప్రాధాన్యం. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండొద్దన్న మా వైఖరి ఇప్పటికీ స్థిరంగా ఉందని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తెలిపారు. ఈ ఒప్పందాన్ని యావత్ ప్రపంచం కోరుకుంది. ఈ పరిణామాలు పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వానికి మార్గం సుగమం చేస్తాయని ఆశిస్తున్నా. మరికొన్ని రోజుల్లో ఈ ఒప్పందంపై సంతకాలు జరగనున్న వేళ.. ప్రస్తుతానికి ఇరుపక్షాలు రెచ్చగొట్టే చర్యలకు దూరంగా ఉండాలని కోరుతున్నా. దీనికి మధ్యవర్తిత్వం వహించిన దేశాలకు అభినందనలు. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా దౌత్య పరిష్కారాలకు మేం నిరంతరం మద్దతు ఇస్తాం తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్ అభిప్రాయపడ్డారు.

**అమెరికా-ఇరాన్ డీల్ గుడ్..**

పశ్చిమాసియా ఉద్రిక్తతలకు తెర పడింది. అమెరికా-ఇరాన్ మధ్య చారిత్రక శాంతి ఒప్పందం కుదిరింది. ఈ వారం చివర్లో దీనిపై సంతకాలు జరగనున్నాయి. మూడు నెలలకు పైగా సాగిన యుద్ధం ముగిసిపోవడంతో భారత్ సహా ప్రపంచదేశాలు హర్షం వ్యక్తంచేశాయి. ఈ ఒప్పందాన్ని స్వాగతిస్తూ.. పశ్చిమాసియాలో సుస్థిర శాంతి నెలకొనాలని ఆకాంక్షించాయి. "అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన ఒప్పందాన్ని స్వాగతిస్తున్నాం. ఈ డీల్‌తో హర్మూజ్ జలసంధిలో ఇకపై నౌకల రవాణా నిరాటంకంగా, స్వేచ్ఛగా జరుగుతుందని ఆశిస్తున్నాం. శాంతి, ప్రాంతీయ స్థిరత్వం కోసం చేపట్టే అన్ని చర్యలకు భారత్ ఎల్లప్పుడూ మద్దతిస్తుంది. ఈ పరిణామాలను స్ఫూర్తిగా తీసుకుని ఉక్రెయిన్-రష్యా కూడా శాంతి ప్రయత్నాలు చేయాలని ఆకాంక్షిస్తున్నాం" అని మంత్రిత్వ శాఖల అంతర్గత సమావేశంలో భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్ వెల్లడించారు. "అమెరికా-ఇరాన్ మధ్య దౌత్యపరంగా చారిత్రక డీల్ జరగడం అభినందనీయం. ఈ పరిణామాలు ప్రపంచ ఆర్థికవ్యవస్థ పునరుజ్జీవనానికి మార్గం సుగమం చేశాయి. పశ్చిమాసియా మరింత సురక్షితంగా ఉంటుంది. ఈ ఒప్పందాన్ని కృతనిశ్చయంతో అమలుచేయడం అత్యావశ్యకం" అని జర్మనీ ఛాన్స్‌లర్ ఫ్రెడ్రిక్ మెర్జ్ అన్నారు.

## శాంతి ఒప్పందం అంగీకరించం

తాము వైదొ లగబోమని ఇజ్రాయెల్ రక్షణమంత్రి కాట్జ్ ప్రకటించారు. హెజ్‌బొల్లా స్థావరాలపై తాము చేస్తున్న దాడులకు ప్రతీకారంగా ఇరాన్ దాడులకు తెగబడితే మళ్లీ యుద్ధ పరిస్థితులు నెలకొంటాయని హెచ్చరించారు. ఇజ్రాయెల్ స్వేచ్ఛకు భంగం కలిగించేలా ఇరాన్ చేసే ఏ డిమాండ్ నైనా రెడ్ లైన్‌గా పరిగణిస్తామని పేర్కొన్నారు. ఆదివారం అమెరి కా-ఇరాన్ ఒప్పందం ఖరారవడానికి కొన్ని గంట ల ముందు ఇజ్రాయెల్ భూభాగం వైపు హెజ్‌బొల్లా కాల్పులు జరిపింది. దీంతో ఆ కాల్పులకు ప్రతిస్పం దనగా బీరుట్‌లోని పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకో వాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఐడీఎఫ్‌ను ఆదే శించారు. హెజ్‌బొల్లా కాల్పుల విరమణను గౌరవిస్తేనే లెబనాన్‌లో దాడులు ఆగుతాయని.. లేదంటే మళ్లీ విరు చుకుపడ తామని ఐడీఎఫ్ హెచ్చరించింది. లెబనాన్‌పై అమెరికా శాశ్వతంగా సైనిక ఆపరేషన్లను నిలిపివేయాల ని ఇరాన్ ఒప్పందంలో నిబంధన పెట్టింది. ఈ డీల్‌పై జూన్ 19వ తేదీన సంతకాలు చేయనున్నట్లు ఇరాన్ విదే శాంగశాఖ ఉప మంత్రి కాజెమ్ గరీబాబడీ వెల్లడించారు. ఇక తుది చర్చలు మాత్రం ఈ డీల్‌లోని అంశాల అమ లుపైనే ఆధారపడి ఉంటాయన్నారు. ఒప్పందంపై సం తకాలు చేసేందుకు ఇరుపక్షాలు శుక్రవారం జెనీవాలో సమావేశం కానున్నట్లు మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న పాకిస్థాన్ తెలిపింది. ఈ సమయంలో లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తుండడం గమనార్హం.

## డిజిటల్ సంతకాలూ పూర్తయ్యాయి

వెల్లడించారు. ఇరు దేశాలు ఇప్పటికే ఈ ఒప్పందంపై డిజిటల్‌గా సంతకాలు చేసేశాయని ఆయన స్పష్టం చేశారు. ఆంక్షల సడలింపు మాత్రం ఇరాన్ తమ ఒప్పంద నిబంధనల్ని అమలు చేసిన తర్వాతే ఉంటుందని స్పష్టం చేశారు. శుక్రవారం ఈ డీల్‌పై అధికారికంగా సంతకాలు జరగనున్న నేపథ్యంలో జేడీ వాన్స్ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఏబీసీ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వాన్స్ కీలక వ్యాఖ్యలు చేశారు.'మేం ఇప్పటికే నిన్న డిజిటల్‌గా ఒప్పందంపై సంతకాలు చేశాం. ఇప్పటివరకు ఇరాన్‌కు ఎలాంటి నిధులు విడుదల కాలేదు. ముున్ముందు కూడా ఆ విధానం మారదు. ఈ ఒప్పందం పూర్తిగా ఇరాన్ పనితీరు, ప్రవర్తనపైనే ఆదారపడి ఉంటుంది.' అని వాన్స్ చెప్పారు. .

## శాంతి ఒప్పందం.. శభపరిణామం

తెలిపారు. ఈ మేరకు ఎక్స్ ఖాతాలో మోదీ పోస్ట్ చేశారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వల్ల ప్రపంచవ్యాప్తంగా అనేక ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం పడింది. ఎన్నో దేశాల్లో ప్రాణనష్టం వాటిల్లింది. ఈ యుద్ధాన్ని ముగించేలా అమెరికా, ఇరాన్ అంగీకారం కుదుర్చుకోవడం స్వాగతించే విషయం. పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వాలను పునరుద్ధరించడం, స్వేచ్ఛా నౌకాయానం, వాణిజ్యానికి భరోసా కల్పించడంలో ఈ పరిణామం సాయపడుతుందని భారత్ విశ్వసిస్తోంది. సుస్థిరమైన తుది ఒప్పందానికి దారితీసేలా.. మిగిలిన అంశాల పైనా సానుకూల చర్చలు జరుగుతాయని విశ్వసిస్తున్నాం అని మోదీ రాసుకొచ్చారు.

## ధాన్యం సేకరణలో కేంద్రం ప్రేక్షకపాత్ర

ప్రభుత్వం ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా.. కేంద్రం నుంచి ఆశించిన స్పందన లభించడం లేదని, ధాన్యం కొనుగోలు పక్రియలో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస ధరలు వస్తాయని ఆశగా సాగు చేసిన రైతులకు న్యాయం జరగట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సచివాలయంలో వ్యవసాయ మరియు మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మొక్కజొన్న కొనుగోళ్లు, నిల్వ సౌకర్యాలు, గన్ని బ్యాగుల లభ్యత, రవాణా ఏర్పాట్లు, కేంద్ర ప్రభుత్వ విధానాలపై సమగ్రంగా చర్చించారు. ఇప్పటికైనా సేకరించిన పంటలను కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం కేవలం మద్దతు ధరను ప్రకటించి, ఆ తర్వాత కొనుగోళ్ల బాధ్యత నుంచి పూర్తిగా తప్పుకుంటోందని ఆయన ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకే రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, అలా నిబంధనల ప్రకారం నడుచుకుంటున్నా కూడా ఎందుకు తమపై ఇంత వివక్ష అని మంత్రి తుమ్మల ప్రశ్నించారు. మద్దతు ధర ప్రకటించిన అన్ని రకాల ధాన్యాలనూ సేకరించాల్సిన ప్రాథమిక బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్రం తన బాధ్యతల నుంచి తప్పుకొంటూ, రాష్ట్ర రైతాంగాన్ని, ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. కేంద్రం చేతులెత్తేసినా రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెనకాడలేదని, ఇప్పటికే 15 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నతో పాటు, 2 లక్షల మెట్రిక్ టన్నుల జొన్నలను రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా కొనుగోలు చేసిందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ఈ ధాన్యం మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వమే పూర్తిగా తీసుకోవాలని మంత్రి తుమ్మల డిమాండ్ చేశారు. కేంద్రం కొనుగోలు చేయకపోయినా రాష్ట్ర ప్రభుత్వం రూ.4,000 కోట్లతో మొక్కజొన్న సేకరణ చేపట్టిందన్నారు. జొన్న కొనుగోలుకు రూ.1100 కోట్లతో ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మొక్కజొన్న, జొన్నలను వెంటనే పీఎస్ఎస్ పరిధిలోకి తీసుకురావాలన్నారు. పిఎస్ఎస్ స్కీంలో ఉన్న శనగ, పొద్దుతిరుగుడు పంటలపై 25శాతం సీలింగ్ పరిమతిని 50 శాతంకు వెంటనే పెంచాలని మంత్రి డిమాండ్ చేశారు. అకాల వర్షాల వల్ల రైతులు ఇబ్బంది పడుతున్న కేంద్రం నుంచి ఎటువంటి సమాధానం లేదని విమర్శించిన మంత్రి తుమ్మల, రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోళ్లను వేగవంతం చేసి, రైతులు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు రైతుల నుండి 9.57 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న సేకరించినట్లు మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయకపోయినా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం స్వంత నిధులతో రూ.4,000 కోట్ల వ్యయంతో మొక్కజొన్న కొనుగోలు చేపట్టిందన్నారు. అదేవిధంగా, రాష్ట్రంలో సాగవుతున్న జొన్న పంటను కూడా రూ.1,000 కోట్లతో సేకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి వెల్లడించారు.

## కాక్రోచ్ జనతా పార్టీ ఫౌండర్‌పై దుండగుల దాడి

కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. జైపుర్‌లో నిరసన కార్యక్రమంలో అతడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తుండగా.. కొందరు వ్యక్తులు అతడి వాహనం వద్దకు దూసుకువచ్చారు. అనంతరం అభిజీత్ చెంపపై కొడుతూ.. దాడికి యత్నించారు. వెంటనే స్పందించిన సీజేపీ కార్యకర్తలు అతడిని కొట్టిన వ్యక్తులపై మూకుమ్మడి దాడి చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. జైపుర్‌లోని అమరవీరుల స్మారక చిహ్నం వద్ద సీజేపీ నిరసన చేపట్టిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. అభిజీత్‌పై దాడి చేసిన నిందితులు పరారీలో ఉన్నారని వారి కోసం గాలింపు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి..దర్యాప్తు చేస్తున్నామన్నారు. దీనిపై అభిజీత్ స్పందిస్తూ..ఈ ఘటనతో ఆగ్రహానికి గురవ్వద్దని యువతకు సూచించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా తమ ఉద్యమాన్ని ఆపబోమన్నారు.

## తెలంగాణ వరి ఉత్పత్తులకు విదేశాల్లో డిమాండ్

ఆదరణ ఉన్న బియ్యం ఉత్పత్తిని పెంచాలని సూచించారు. రైతుల ఆదాయం పెంచే పంటల సాగును ప్రోత్సహించాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. గ్రామస్థాయిలో రైతులకు చైతన్య సదస్సులు నిర్వహించాలని సూచించారు. రైతులకు మార్కెట్ ఆధారిత పంటల సాగుపై మార్గనిర్దేశర చేయాలని నిర్ణయించామని అన్నారు. డిమాండ్ లేని వరి రకాల సాగును క్రమంగా తగ్గించాలని చెప్పారు. వినియోగదారులు, మిల్లర్లు కోరుకునే వరి రకాలకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఎగుమతులకు అనుకూలమైన నిర్దిష్ట వరి రకాల సాగు విస్తరణపై దృష్టి పెట్టాలని భట్టి విక్రమార్క మార్గనిర్దేశం చేశారు. వానాకాలం సాగుపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు పక్రియను కేంద్ర ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. రైతులకు నష్టాలు రాకుండా మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటల ప్రణాళిక చేపట్టాలని సూచించారు. నాణ్యమైన బియ్యం ఉత్పత్తి, నిల్వ, మార్కెటింగ్ వ్యవస్థలను బలోపేతం చేయాలని నిర్ణయించామని చెప్పారు. రైతులకు లాభదాయకమైన, ఎగుమతి అవకాశాలు ఉన్న వంగడాలపై ప్రత్యేక ప్రోత్సాహకాలని పరిశీలించాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తి, ధాన్యం కొనుగోలు, నిల్వ సదుపాయాలపై నిరంతర సమీక్షా సమావేశాలు కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. తెలంగాణను అధిక విలువ కలిగిన వరి ఉత్పత్తి కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు చేపట్టాలని నిర్దేశిరచారు. రైతు ఆదాయం పెంపు, మార్కెట్ అనుసంధానానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించామని అన్నారు. రైతులకు మెరుగైన ధరలు వచ్చేలా మార్కెట్ డిమాండ్ ఆధారిత వ్యవసాయ విధానాన్ని అమలు చేయాలని భట్టి విక్రమార్క సూచించారు.

## మెట్రో విస్తరణను అడ్డుకుంటున్న కిషన్‌రెడ్డి




కిషన్‌రెడ్డి నిధులు విడుదల చేయిస్తారా? లేదా? అని ప్రశ్నిం చారు. లోన్ బదిలీ కాకుండా కిషన్‌రెడ్డి వల్లే మెట్రో విస్తరణ ఆగిందని ఆరోపించారు. మెట్రో విస్తరణకు రూ.40 వేల కోట్లు కావాలని సూచించారు. అంతా తామే భరిస్తామని.. ఎన్‌వోసి ఇవ్వాలని కేంద్రాన్ని కోరామని ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యం లేకుండా మెట్రోను తాము విస్తరిస్తామని కేంద్ర పెద్దలతో తాము చెప్పామని పేర్కొన్నారు. రాజకీయంగా నష్టం జరుగుతోందని మెట్రోపై కిషన్‌రెడ్డి కుట్ర పన్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరో పించారు. రుణం ఇవ్వకపోతే కనీసం ఎన్ వోసి అయినా ఇప్పించరా? అని నిలదీశా రు. నిధులు ఇప్పించి ఎన్‌వోసి ఇస్తే శాలువా కప్పి ఆయనను సన్మానిస్తామని తెలి పారు. కిషన్‌రెడ్డిని కేసీఆర్ తిట్టినట్లు తాను తిట్టలేదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ డైరెక్షన్‌లోనే కేంద్రమంత్రి పనిచేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్‌కు లొంగిపోయి కిషన్‌రెడ్డే అడ్డుపడుతున్నారని మండిపడ్డా రు. ఆయన వెనుక కేటీఆర్ ఉన్నారని ఆరోపించారు. కేటీఆర్ కుట్రలకు కేంద్రమంత్రి సహకరిస్తున్నారని ఆక్షేపించారు.కేటీఆర్ కుట్రలు చేస్తుంటే.. కిషన్‌రెడ్డి అమలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కిషన్‌రెడ్డికి అంత తెలివిలేదని.. కేటీఆర్ చెప్పిందే చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. మెట్రోలో ప్రయాణించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచిస్తున్నారని తెలిపారు. ప్రధాని సూచనలను తాము అమలు చేయాలని చూస్తుంటే.. ఆయన ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. ఫేజ్-1ను కేంద్రం స్వాధీనం చేసుకోవాలని సూచించారు. ఫేజ్-2 నిర్మించుకోవాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని వ్యాఖ్యానించారు. అహ్మదాబాద్ మెట్రోకు అనుమతులు, నిధులు వచ్చాయని ప్రస్తావించారు. హైదరాబాద్‌కు మాత్రం అనుమతులు, నిధులు ఎందుకు రావట్లేదని ప్రశ్నించారు. విశాఖపట్నం మెట్రో నిర్మాణానికి కూడా అనుమతి ఇచ్చారని తెలిపారు. తెలంగాణపై కేంద్రానికి ఎంత వివక్ష ఉందో ఈ విషయంలో అర్థమవుతోందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మెట్రో రైలు నిర్మాణంలో హైదరాబాద్ కంటే ఇతర నగరాలు ముందున్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. మొదటి దశలో రూ.15 వేల కోట్లతో పూర్తి కావాల్సిన మెట్రో రైలు నిర్మాణ వ్యయం రూ.22 వేల కోట్లకు పెరిగిందన్నారు. కేసీఆర్ పాలనలో ప్రజలు ప్రయాణించాల్సిన ప్రాంతాల్లో మెట్రో విస్తరణ జరగలేదని విమర్శించారు. సెకండ్ ఫేజ్‌లో మెట్రో విస్తరణ అనుమతి కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చామన్నారు. అయితే, ఏడాదికి రూ.400 కోట్ల నష్టం వస్తుందని ఎల్అండ్‌టీ చెప్పిందని, ఆర్థిక ఇబ్బందుల వల్ల మెట్రో విస్తరణకు ఆ సంస్థ ఒప్పుకోవట్లేదని వివరించారు. రూ.30వేల కోట్ల ఎల్అండ్‌టీ ఆస్తుల్ని రూ.15వేల కోట్లకు ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఎల్అండ్‌టీకి రూ.13,600 కోట్ల అప్పు ఉంది. ఐఆర్ఎఫ్‌సీ నుంచి ఎల్అండ్‌టీకి రూ.13,600 కోట్ల రుణాలు ఇప్పించాం. ఆ మొత్తానికి 4 శాతం వడ్డీగా రుణం ఇప్పించాం. రేవంత్‌రెడ్డిని తేలికగా పని చేయిస్తే.. తెలంగాణలో భాజపాకి ఇబ్బందులు వస్తాయని సహచర కేంద్రమంత్రులు మనోహర్‌లాల్ ఖట్టర్, అశ్వినీ వైష్ణవ్‌కు కిషన్‌రెడ్డి చెప్పారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చినా.. లోన్ డబ్బులు ఎల్అండ్‌టీకి ట్రాన్స్‌ఫర్ కాలేదన్నారు. ఐఆర్ఎఫ్‌సీ లోన్ మంజూరు చేయకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారు. తెలంగాణ నుంచి కేంద్ర క్యాబినెట్‌లో ఉన్న కిషన్‌రెడ్డికి నగరాన్ని అభివృద్ధి చేసే బాధ్యత లేదా అని ప్రశ్నించారు.కేసీఆర్, కేటీఆర్ కలిసి ఆయన మెట్రో ఫేజ్-2ను అడ్డుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భాజపాకు కేసీఆర్ సహకరించినందుకు కిషన్‌రెడ్డి గురుదక్షిణ చెల్లిస్తున్నారు. అహ్మదాబాద్, విశాఖ మెట్రోలకు అనుమతులిచ్చి హైదరాబాద్‌కు ఆపారు. తెలంగాణపై కేంద్రం వివక్ష కొనసాగిస్తోంది. కచ్చితంగా కేంద్ర ప్రభుత్వం వద్దే మెట్రో ఫేజ్-2 ఆగింది. హైదరాబాద్‌కు 2023లోనే ట్రిపుల్ ఆర్‌ను కేంద్రం ప్రకటించింది. అది

## క్షేత్రస్థాయిలో వెళ్లని అధికారులపై చర్యలు తప్పవు

హైదరాబాద్,జూన్15(జనంసాక్షి): ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో చేపట్టిన కార్యక్రమాలను కొన్ని విభాగాలు ఆశించినంతగా చెప్పుకోలేక పోయాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. వెంటనే అన్ని శాఖలు తాము చేపటిన కార్యక్రమాలకు తగినంత ప్రచారం కల్పించాలని సూచించారు. సంబంధిత ఉన్నతాధికారులు ఆ బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించారు. మీడియా, డిజిటల్ మీడియా ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలకు తాము చేసిన మంచి పనులు చెప్పుకోవాలని అధికారులకు సూచించారు. వివిధ స్థాయిల్లో జరిగిన కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, ప్రజల నుంచి వచ్చిన ఫీడ్ బ్యాక్ను నమోదు చేయాలని, గ్రామాల్లో వచ్చిన సమస్యలను కూడా ఆయా శాఖలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ మూడు నెలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, చేసిన శంకుస్థాపనలు, ఆస్తుల వివరాలన్నీ నమోదు చేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మార్చి 16 నుంచి జూన్ 12 వరకు చేపట్టిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంతో ప్రజా ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువైందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. 9 రోజుల పాటు రాష్ట్రమంతటా జరిగిన కార్యక్రమాలపై సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. విభాగాల వారీగా చేపట్టిన కార్యక్రమాలు, వాటి ద్వారా వచ్చిన ఫలితాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. సందర్భంగా అన్ని విభాగాలు తాము జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు చేపట్టిన కార్యక్రమాల వివరాల నివేదికలను సమర్పించాయి. 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో చురుగ్గా పాల్గొన్న విభాగాలను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు. ప్రధాన కార్యదర్శుల నుంచి జిల్లా కలెక్టర్ వరకు అన్ని విభాగాల ఉన్నతాధికారులు ప్రతినెలా క్షేత్రస్థాయికి వెళ్లాలని గతంలోనే ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు. క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లని అధికారులు, జిల్లా కలెక్టర్లపై తనకు నివేదిక ఇవ్వాలని చీఫ్ సెక్రటరీని సీఎం ఆదేశించారు. వారిపై క్రమశిక్షణా ఉల్లంఘన చర్యలు ఎందుకు తీసుకోకూడదో.. వెంటనే వివరణ కోరాలని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలను పాటించని అధికారులను ఉపేక్షించవద్దని హెచ్చరించారు. ఇప్పటికీ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ భవనాలు లేని గ్రామాలుంటే.. వెంటనే ఆ జాబితాను సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ అధికారులను సీఎం ఆదేశించారు. అక్కడ కొత్తగా గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలను కూడా చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు. అన్ని పాఠశాలల భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. విద్యా, వైద్య విభాగాల్లో అన్ని స్థాయిల్లో ఫేషియల్ రికగ్నిషన్ విధానం అమలు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పాఠశాలల నుంచి కాలేజీల వరకు, పీహెచ్ సీ నుంచి ఉస్మానియా, గాంధీ ఆసుపత్రి వరకు ఉద్యోగులందరికీ ఇదే అటెండన్స్ విధానం పాటించాలన్నారు. రాష్ట్రస్థాయిలో 99 రోజుల యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష నిర్వహించినట్లే.. జిల్లాల వారీగా వెంటనే ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై వెంటనే సమీక్ష జరపాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమీక్షలకు రాష్ట్ర స్థాయి నుంచి ప్రతి జిల్లాకో సీనియర్ ఐఏఎస్ అధికారిని స్పెషల్ ఆఫీసర్ గా నియమించి, ఆ జిల్లాకు పంపించాలని చెప్పారు. స్పెషలాఫీసర్ ఆ జిల్లా కలెక్టర్ కలిసి అన్ని విభాగాల్లో 99 రోజుల పాటు జరిగిన ప్రత్యేక కార్యక్రమాలు, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, వివిధ పథకాలపై వచ్చిన స్పందనలన్నింటినీ సమీక్షించాలని ఆదేశించారు. జిల్లాల వారీగా ఈ ప్రగతి నివేదికలను విడుదల చేయాలని చెప్పారు. జిల్లాలతో పాటు నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల వారీగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందుకున్న లబ్దిదారులు, ప్రజా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వీటిని డ్యాష్ బోర్డులో అందుబాటులో ఉంచాలని చెప్పారు. తాను ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తర్వాత జిల్లాల పర్యటనలు, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై సీఎం అధికారులను ఆరా తీశారు. నియోజకవర్గాల వారీగా ముఖ్యమంత్రి హామీల పురోగతిపై నివేదిక ఇవ్వాలని ప్లానింగ్ విభాగాన్ని ఆదేశించారు. ఈ రాజ్యసభ ఎంపీ వేంనరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రితో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నకిలీ పత్తి విత్తనాల అంతరాష్ట్ర ముఠా గుట్టురట్టు..

▫ ప్రధాన నిందితుడు అరెస్ట్




**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కోట్ల రూపాయల అక్రమ వ్యాపారం చేస్తున్న నకిలీ పత్తి విత్తనాల అంతరాష్ట్ర ముఠాను ఆదిలాబాద్ పోలీసులు పట్టుకున్నారు. పట్టణంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ప్రధాన నిందితుడుతో పాటు తొమ్మిదిపై కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి నకిలీ పత్తి విత్తనాలు, అనుమతులు లేని పురుగుమందులు, ఎక్స్‌పైర్డ్ విత్తనాలు, తయారీ సామగ్రి, కారు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సోమవారం మీడియా సమావేశంలో వెల్లడించారు.

792 ప్యాకెట్ల పింక్ బాండ్ పత్తి విత్తనాల ప్యాకెట్లు , రూ. 9.5 లక్షల విలువ చేసే గడువుతీరిన విత్తనాలు, మందులు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ప్రధాన నిందితుడు హైదరాబాద్‌లో కొత్తపేటలో అగ్రిటెక్, జీనియస్ క్రాప్ సైన్సెస్ యజమాని పాపిన్వర్ సునీల్ కుమార్‌ను అరెస్టు చేశామని తెలిపారు. మహారాష్ట్రకు చెందిన రాథోడ్ పండిత్ , రాథోడ్ బాలాజీ , గుజరాత్‌కు చెందిన గిరీష్ పటేల్, ఆదిలాబాద్‌కు చెందిన ఈశ్వర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని వివరించారు. గణేష్ , కృష్ణ ,కిరణ్, సందేశ్ బండేవర్ అనే మరో నలుగురు పరారీలో ఉన్నారని తెలిపారు .

రైతులను మోసం చేసి అక్రమ లాభాల కోసం నకిలీ విత్తనాల వ్యాపారానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. సమావేశంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, ఆదిలాబాద్ టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ కే నాగరాజు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్సైలు అఖిల్, గోపికృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చర్లపల్లి సెంట్రల్ జైలులో ఐటీఐ ఏర్పాటు

▫ ఖైదీల జీవితాలకు కొత్త దారి

**హైదరాబాద్ (జనంసాక్షి) :** శిక్ష పూర్తి చేసుకుని జైలు నుంచి బయటకు వెళ్లే ఖైదీలు గౌరవప్రదంగా జీవించేలా, వారికి ఉపాధి మార్గాలను చూపే దిశగా తెలంగాణ కారాగార శాఖ కీలక అడుగు వేసింది. హైదరాబాద్‌లోని చర్లపల్లి కేంద్ర కారాగారంలో ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ ఐటీఐ ఏర్పాటు చేస్తోంది. ఖైదీలకు కేవలం శిక్ష విధించడమే కాకుండా, వారిలో మార్పు తీసుకువచ్చి సమాజంలో తిరిగి మంచి పౌరులుగా ఎదిగేలా చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా అన్నారు. ఇందులో భాగంగా ఆమె అదివారం హైదరాబాద్‌లోని నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ మహిళల కోసం ఏర్పాటు చేసిన ఎన్ఎస్టీఐ విభాగాలను సందర్శించారు.



ఐటీఐ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**వృత్తి విద్యా కోర్సుల్లో సాంకేతిక శిక్షణ**

ఐటీఐ ద్వారా ఖైదీలకు వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో సాంకేతిక శిక్షణ ఇచ్చి, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా వారిని తీర్చిదిద్దనున్నారు. దీనివల్ల ఖైదీలు విడుదలయ్యాక ఆర్థిక ఇబ్బందులను అధిగమించి ఆత్మవిశ్వాసంతో తమ కాళ్లపై తాము నిలబడే అవకాశం కలుగుతుంది. శిక్షణ పొందుతున్న అభ్యర్థులు, అధ్యాపకులతో మాట్లాడి వృత్తి విద్యా శిక్షణ వల్ల కలిగే ప్రయోజనాలు, ఉపాధి అవకాశాలపై ఆరా తీశారు. అనంతరం ప్రాంతీయ నైపుణ్యాభివృద్ధి సంచాలకులు రవి చిలుకోటి, ఎన్ఎస్టీఐ మహిళా విభాగం ప్రిన్సిపాల్ ప్రియ లతో సమావేశమై, జైలులో ఐటీఐ ఏర్పాటుకు అవసరమైన సహకారం విధానాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎన్. మురళీ బాబు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ డాక్టర్ డి. శ్రీనివాస్, పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం. ఖాలిద్ అఖ్తర్, చెర్లపల్లి జైలు సూపరింటెండెంట్ జి. ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల తరపున పోరాటం చేస్తాం

▫ తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**కాసిపేట, జూన్ 15 (జనంసాక్షి) :** డిపెండెంట్ ఉద్యోగాలు ఇచ్చే వరకు కార్మికులతో కలిసి పోరాటం చేస్తాం అని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. పాలసీలు చేయాల్సిన సీఎం, డిప్యూటీ సీఎం లే వినతి పత్రాలిస్తూ సింగరేణి కార్మికులని మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. సోమవారం మందమర్రి ఏరియా లోని కాసిపేట గనిపై బాయి బాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం డిపెండెంట్ ఉద్యోగాలతో సహా అన్నింటిలో కార్మికులకు అన్యాయం చేస్తున్నారు. కార్మికులకు హెచ్ఎంఎస్, టీఆర్ఎస్ అండగా ఉంటుందని తెలంగాణ లో కొత్త రాజకీయ శక్తిగా వచ్చాం. సింగరేణి బిడ్డల ఆశీర్వాదం కోసం ఇక్కడకు వచ్చాను అని తెలంగాణ ఉద్యమంలో కార్మికులతో కలిసి పనిచేశామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనూ కలిసి పనిచేశాం. నేను ఎక్కడ ఉన్న కూడా అనునిత్యం మీ పక్కనే ఉండి పోరాటం చేశాను. సింగరేణిలోని మెడికల్ బోర్డు పెట్టకపోతే హైదరాబాద్ లోని సింగరేణి భవన్ ను ముట్టడించామని, ఈ ప్రభుత్వంలో సర్వసామాన్యంగా జరగాల్సిన పనులకు కూడా పోరాటం చేయాల్సి వస్తోంది. హైదరాబాద్, ఢిల్లీలో ఉండి మనకు బొగ్గు బావులు తేవాల్సిన సీఎం, డిప్యూటీ సీఎం లు మీకే వినతి పత్రాలు ఇస్తున్నారు. మనకు ఐటీ సమస్య లేకుండా, నెలకు రెండుసార్లు మెడికల్ బోర్డు పెట్టాల్సిన పనులు ఈ ప్రభుత్వం చేయటం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి బోడ జనార్దన్, రియాజ్ అహ్మద్ సోదారి సురేష్, జగన్, శంకర్, కమల తదితరులు పాల్గొన్నారు

**జిల్లాలో నూతన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన టిఆర్ఎస్ చీఫ్ కవిత**

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 15(జనంసాక్షి ):** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత పర్యటించారు. జిల్లా కేంద్రానికి చేరుకున్న కవిత ఫారెస్ట్ చెక్ పోస్ట్ నుండి ర్యాలీ ద్వారా నడుచుకుంటూ వెళ్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసిన అనంతరం కొమరం భీమ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటుచేసిన తెలంగాణ రక్షణ సేన(టిఆర్ఎస్) పార్టీ జెండాను ఆవిష్కరించి, పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి బోడ జనార్ధన్, బిహెచ్ఎంఎస్ రాష్ట్ర నాయకులు రియాజ్ , కొమరం భీమ్ ఆసిఫా బాద్ జిల్లా అధ్యక్షుడు కిరిమిల్ల వినోద్, కాగజ్నగర్ ఇంచార్జ్ కావేటి సరిత, మహల్కర్ అశోక్ ,నర్సింగోజు సాయికుమార్ పాల్గొన్నారు.

# తాడిచెట్టుపై నుండి పడి గీత కార్మికుడి మృతి



**రేగొండ,జూన్ 15( జనం సాక్షి):** తాడిచెట్టు పై నుండి పడి గీతకార్మికుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంకేంద్రానికి చెందిన గండి సదయ్య (55) కుల వృత్తిలో భాగంగా తాడిచెట్టు ఎక్కి కల్లు గీసే క్రమంలో కాలుజారి చెట్టుపైనుండి అదుపుతప్పి కింద పడ్డాడు.తలకి బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మరణించాడు. మృతుడి భార్య కళ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి.సుధాకర్ తెలిపారు.

# అంతర్జాతీయ సదస్సులో డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి ప్రతిభ



**వరంగల్ బ్యూరో, జూన్ 15 (జనం సాక్షి) :** అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రంలో ఎరోడెక్స్ రీసెర్చ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో 2026 మే 28, 29 తేదీలలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో కాకతీయ విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగం అధ్యాపకుడు డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి ప్రతిభ కనబరిచారు. “ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ టెక్నాలజీ, సైన్స్ అండ్ మల్టీడిసిప్లినరీ ఇన్నోవేషన్-2026” అంశంపై జరిగిన ఈ అంతర్జాతీయ సదస్సులో ఆయన సమర్పించిన “మీడియా స్టడీస్, డిజిటల్ కమ్యూనికేషన్ అండ్ కాంటెంపరరీ జర్నలిజం” పరిశోధన పత్రం ఉత్తమ పరిశోధన పత్రంగా ఎంపికై అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కర్నాటి ప్రతాపరెడ్డి డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డిని అభినందించారు. అంతర్జాతీయ వేదికపై తన పరిశోధనా ప్రతిభతో కాకతీయ విశ్వవిద్యాలయ ఖ్యాతిని మరింత పెంచడం అభినందనీయమని పేర్కొన్నారు.

# జడ్జిల నియామకాల్లో తెలంగాణ అడ్వకేట్స్‌కు ప్రాతినిధ్యం ఇవ్వాలి

▫ తెలంగాణ అడ్వకేట్స్ అసోసియేషన్ డిమాండ్

▫ అధ్యక్షుడు సురేందర్ రెడ్డి నేతృత్వంలో ఏకగ్రీవ తీర్మానం

▫ సామాజిక న్యాయం, సముచిత ప్రాతినిధ్యంపై సీనియర్ న్యాయవాదుల గళం



**హైదరాబాద్, జూన్ 15 (జనంసాక్షి) :** హైకోర్టు న్యాయమూర్తుల నియామకాల్లో తెలంగాణకు చెందిన అర్హులైన న్యాయవాదులకు సముచిత ప్రాధాన్యం కల్పించాలని తెలంగాణ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, ప్రాంతీయ ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం ప్రతిబింబించేలా న్యాయ వ్యవస్థ ఉండాలని స్పష్టం చేసింది. తెలంగాణ హైకోర్టు అడ్వకేట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్. సురేందర్ రెడ్డి అధ్యక్షతన సోమవారం తెలంగాణ హైకోర్టులో జరిగిన అత్యవసర సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం ఆమోదించారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు డి.ఎల్. పాండు, కార్యదర్శులు పీ. శ్రవణ్ కుమార్ గౌడ్, కె. నిరంజన్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి పీ. కృష్ణ కీర్తన, ఖజాంచి బి. బాలాజీ, క్రీడా, సాంస్కృతిక కార్యదర్శి జె. విష్ణువర్ధన్ తో పాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. హైకోర్టు బెంచ్‌కు ఎంపిక చేసే న్యాయమూర్తుల నియామకాల్లో సామాజిక న్యాయాన్ని పాటించడంతో పాటు అన్ని వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని సమావేశం అభిప్రాయపడింది. తెలంగాణలో ప్రతిభావంతులు, అనుభవజ్ఞులు, నిబద్ధత కలిగిన న్యాయవాదులు ఎంతోమంది ఉన్నారని, వారికి తగిన గుర్తింపు దక్కాల్సిన అవసరం ఉందని సీనియర్ న్యాయవాదులు వెల్లడించారు. న్యాయమూర్తుల ఎంపికలో కేవలం ప్రతిభ మాత్రమే కాకుండా ప్రాంతీయ ఆకాంక్షలు, ప్రజల భావోద్వే గాలు, సమగ్ర ప్రాతినిధ్యం కూడా పరిగణనలోకి తీసుకోవాలని వారు సూచించారు. ఈ అంశంపై భారత ప్రధాన న్యాయమూర్తి, సుప్రీంకోర్టు కొలీజియం సభ్యులు, కేంద్ర న్యాయశాఖ మంత్రి, తెలంగాణ గవర్నర్, ముఖ్యమంత్రి, వివిధ రాజకీయ పార్టీల అధ్యక్షులకు వినతిపత్రాలు సమర్పిం చాలని అసోసియేషన్ నిర్ణయించింది. దాంతోపాటు, న్యాయమూర్తుల నియామ కాల్లో పారదర్శకత, న్యాయం, తెలంగాణకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ జూన్ 17న తెలంగాణ హైకోర్టు వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రకటించింది. “ప్రజల వైవిధ్యం, ఆకాంక్షలు, సామాజిక వాస్తవాలు న్యాయవ్యవస్థలో ప్రతిబింబించాలి. తెలంగాణకు హైకోర్టు బెంచ్‌లో సముచిత ప్రాతినిధ్యం దక్కాల్సిందే” అని అసోసియేషన్ తీర్మానంలో స్పష్టం చేసింది.

# ప్రైవేట్ విద్యాసంస్థల అరాచకానికి అడ్డుకట్ట ఎప్పుడు?

▫ టీఆర్పీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా



**కరీంనగర్, జూన్ 16 (జనంసాక్షి) :** కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థుల తల్లిదండ్రులను ఆర్థికంగా దోచుకుంటున్నప్పటికీ ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులు ప్రేక్షక పాత్ర పోషించడం అత్యంత బాధాకరమని తెలంగాణ రాజ్యాధికార పార్టీ కరీంనగర్ జిల్లా నాయకులతో కలిసి రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా ప్రైవేట్ విద్యాసంస్థలపై ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను బేఖాతరు చేస్తూ అనేక ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ మరియు ఇంజనీరింగ్ కళాశాలలు విద్యార్థుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. అడ్మిషన్ ఫీజులు, ట్యూషన్ ఫీజులు, పుస్తకాలు, యూనిఫార్ములు మరియు ఇతర పేర్లతో వేలాది రూపాయలు అదనంగా వసూలు చేస్తూ తల్లిదండ్రులను తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. మరోవైపు విద్యార్థుల పరీక్షా ఫలితాలను నిబంధనలకు విరుద్ధంగా భారీ హోర్డింగులు, ఫ్లెక్సీల రూపంలో ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించి అడ్మిషన్లు పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. విద్యాశాఖ అధికారులు ఈ అక్రమాలన్నీ కళ్ల ముందే జరుగుతున్నప్పటికీ చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోందని అఖిల్ పాషా మండిపడ్డారు. ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్య వైఖరి కారణంగానే ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై వెంటనే సమగ్ర విచారణ జరిపి, నిబంధనలను ఉల్లంఘించిన యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే అక్రమ హోర్డింగులు ఏర్పాటు చేసి తల్లిదండ్రులను తప్పుదోవ పట్టిస్తున్న విద్యాసంస్థల అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తు మరియు తల్లిదండ్రుల ఆర్థిక భారం దృష్ట్యా ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని ఫీజుల నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టాలని, లేదంటే తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అఖిల్ పాషా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింక లావణ్య, జిల్లా అధ్యక్షులు గంగిపెల్లి అరుణ, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, ప్రధాన కార్యదర్శి చిగుర్ల మోహన్, కార్యదర్శి దాట్ల శ్రీనివాస్, మండలాల అధ్యక్షులు ఓర్సు రాజు, అమ్మిగళ్ల కుమార్, ఓర్సు విమల పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ

▫ బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు

▫ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్



**హనుమకొండ, ప్రతినిధి జూన్ 15 (జనం సాక్షి) :** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ వాటి పరిష్కారాన్ని వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ సంబంధిత శాఖల అధికారులు, పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ రవి, ఏఎస్పీతో కలిసి నిర్వహించిన జిల్లా స్థాయి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ కేసుల పురోగతి, బాధితులకు అందుతున్న సహాయం, వివిధ సంక్షేమ కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నమోదైన అట్రాసిటీ కేసుల్లో పెండింగ్‌లో ఉన్న వాటిని ప్రాధాన్యంగా తీసుకుని విచారణలను వేగవంతం చేయాలని సూచించారు. దర్యాప్తు పూర్తయిన కేసుల్లో చార్జిషీట్లు సకాలంలో దాఖలు చేసి న్యాయ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఏసిపి లు మాట్లాడుతూ అట్రాసిటీ కేసుల విషయంలో పోలీసు శాఖ వేగంగా స్పందిస్తూ దర్యాప్తు, ఎఫ్ఐఆర్‌లు, చార్జిషీట్లు, విచారణలో ఉన్న కేసుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. బాధితులకు న్యాయం అందేలా చట్టపరమైన చర్యలను మరింత వేగవంతం చేస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారి సురేష్ కుమార్, ఏసీపీలు ప్రశాంత్ రెడ్డి, నరసింహారావు, ఆర్డీవో లు వెనటేశ్, వెంకన్న, తహసీల్దార్ సీహెచ్ రాజు, ఎన్జీవో ప్రతినిధులు డాక్టర్ పి. దామోదర్, పురుషోత్తం, నరసింహారావు, ఈవీ శ్రీనివాస్, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అనుమానాస్పద స్థితిలో బాలిక ఆత్మహత్య!

▫ పోలీసుల అదుపులో నిందితుడు?

▫ వరంగల్ మట్టెవాడ పిఎస్ పరిధిలో సంఘటన



**వరంగల్ ఈస్ట్, జూన్ 15 (జనం సాక్షి) :** వరంగల్ నగరంలోని మట్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మైనర్ బాలిక ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. ఈ ఘటనకు సంబంధించి ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. స్థానికులు, బంధువుల కథనం ప్రకారం సదరు యువకుడికి ఇప్పటికే వివాహం జరిగి, ఒక కుమారుడు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. కాగా గత నాలుగు సంవత్సరాలుగా ప్రేమ పేరుతో మైనర్ బాలికను తన వలలో వేసుకున్నాడని బంధువులు ఆరోపిస్తున్నారు. బాలిక పుట్టినరోజు వేడుకల పేరుతో యువకుడు ఆమెను ఓయో రూమ్‌కు తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ సందర్భంగా బాలికను మేజర్‌గా చూపించి గది తీసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనంతరం చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో బాలిక ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో ములుగు రోడ్డు ప్రాంతంలోని ఓయో రూములు, లాడ్జీల నిర్వహణపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సరైన గుర్తింపు పత్రాలు, వయస్సు ధ్రువీకరణ లేకుండానే గదులు కేటాయిస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మైనర్లను మేజర్లుగా చూపించి గదులు కేటాయించినట్లయితే సంబంధిత నిర్వాహకులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా హోటళ్లు, లాడ్జీలలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని కోరుతున్నారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు యువకుడిని విచారిస్తున్నారు. బాలిక మృతికి గల అసలు కారణాలు, ఘటనలో ఇతరుల పాత్ర, అలాగే సంబంధిత హోటల్ నిర్వాహకుల నిర్లక్ష్యం ఏమైనా ఉందా అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. బంధువులు చేసిన ఆరోపణలు, స్థానికుల అనుమానాలపై పోలీసులు ఇంకా అధికారికంగా ధృవీకరణ ఇవ్వాల్సి ఉంది.

# స్లాబులు తొలగించండి

▫ హైడ్రా కమిషనర్ ఆదేశం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** కాలువలపైన వేసిన స్లాబులే వరదకు కారణమని హైడ్రా గుర్తించింది. కనీసం డీ సిల్టింగ్ చేయడానికి కూడా అవకాశం లేకుండా చేయడంతో సమస్యల తీవ్రత పెరుగుతోంది. కొండాపూర్‌లోని జూబ్లీగార్డెన్, శంషాబాద్, అత్తాపూర్, రామ్‌దేవ్‌బాబానగర్ ప్రాంతాల్లో వరద ముప్పునకు నాలాల్లో పేరుకుపోయిన పూడికే ప్రధాన కారణంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షేత్ర స్థాయి పర్యటనలో తెలింది. ప్రతి 3 మీటర్లకు వరద కాలువలను ఓపెన్ చేసే వ్యవస్థ ఉంటే.. డీసిల్టింగ్ పనులు పూర్తి స్థాయిలో జరిగేవని స్థానిక అధికారులు చెప్పారు. ట్రాఫిక్ జాయింట్ సీపీ డి. జోయెల్ డేవిస్‌తో పాటు పలు శాఖలకు చెందిన అధికారులు కమిషనర్ పర్యటనలో ఉన్నారు. వందల మీటర్ల కొద్దీ స్లాబ్‌లు తెరవడానికి కూడా వీలు లేకుండా మూసేయడంతో లోతట్టు ప్రాంతాలలో పెద్దమొత్తంలో చెత్త పేరుకుపోయి వరద ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడ్డాయనేది క్షేత్రస్థాయిలో పర్యటించిన అధికారులు నిర్ధారించారు. బొటానికల్ గార్డెన్స్, శ్రీ రాంనగర్, కొండాపూర్ పోలీసు బెటాలియన్ నుంచి భారీగా వచ్చిన వరద మీనాక్షి టవర్స్‌కు చేరువలో ఉన్న మొండి కుంటకు చేరాలి. మొండికుంట నిండిన తర్వాత ఔటెలెట్ ద్వార ముల్లకత్వా చెరువులోకి వెళ్లాల్సిన వరద కాలువలు పూర్తిగా పూడుకుపోవడంతో జూబ్లీ గార్డెన్స్ ను వరద ముంచెత్తిందని చెప్పారు.

**స్లాబులు తొలగించి పూడికతీత..**

శనివారం నుంచే జూబ్లీగార్డెన్స్ ప్రాంతంలో నాలాలపై స్లాబులు తొలగించి పూడికను పెద్దయెత్తున హైడ్రా తొలగిస్తోంది. పక్కనే మీనాక్షి అపార్టుమెంట్స్ ఆవరణ నుంచి 2.15 మీటర్ల వైశాల్యంలో వెళ్లాల్సిన వరద కాలువ మీటరున్నరకు కుంచించుకుపోవడమే కాకుండా.. పైపులైను వేయడంతో వరద పోటెత్తుతోందని అధికారులు గుర్తించారు. అలాగే వరద కాలువను నేరుగా మొండికుంట చెరువులోకి వదిలేయకుండా.. మురుగు నీరును డైవర్ట్ చేసేందుకు ఉద్దేశించి చేపట్టిన కాలువల అనుసంధానంలో ఉన్న లోపాలు కూడా వరద పోటెత్తడానికి కారణమైంది. ఈ సమస్యలను ఒకదాని తర్వాత ఒకటి పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ నాలాలపై అవసరమైన మేరకు స్లాబులు తొలగించి పూర్తిగా డీసిల్టింగ్ పనులు చేపట్టాలని ఆదేశించారు. డీ సిల్టింగ్ పనులు అయిన తర్వాత ఓపె న్ నాలాలను గ్రిల్స్‌తో మూసేయాలని సూచించారు. ప్రతి 3 మీటర్లకూ తెరచే విధంగా ఈ ఏర్పాట్లుండాలన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
16 జూన్ 2026

సంపాదకీయం

# తెలంగాణ ఏర్పాటుపై ఎప్పుడూ అక్కసే..


పవన్ కళ్యాణ్ తెలంగాణ విభజనపై తాజాగా వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలు రాజకీయ వలయాల్లో చర్చకు దారి తీస్తున్నాయి. అయితే ఈ చర్చల్లో అర్థవంతంగా పాల్గొనాలంటే, ఒక సూటైన ప్రశ్న తప్పనిసరిగా అడగాల్సి వస్తుంది. విభజన జరగకముందు పవన్ కళ్యాణ్ తెలంగాణ వాదనకు అనుకూలంగా నిలిచారా?

తెలంగాణ ఉద్యమం దశాబ్దాల పోరాటం ద్వారా సాధించిన విజయం. ఆ పోరాటంలో వేలాది ఉద్యోగాలు వదులుకున్నారు, విద్యార్థులు ప్రాణాలు అర్పించారు. కుటుంబాలు కష్టాలు భరించాయి. అటువంటి సందర్భంలో తెలంగాణ ప్రజలు సహజంగానే ఆ రోజు ఎవరు వారితో నిలిచారు. ఎవరు మౌనం వహించారు అనే విషయాన్ని గుర్తుపెట్టుకుంటారు. పవన్ కళ్యాణ్ తెలంగాణ రాష్ట్ర అవతరణ తర్వాత పదకొండు రోజులు అన్నం తినలేదని చెప్పారు. కోనసీమ కొబ్బరి తోటలకు తెలంగాణ దిష్టి తగిలి వైరస్ సోకిందని వ్యాఖ్యానించారు. ఈ రెండు వ్యాఖ్యలు వారు ఏ వైపు నిలిచారో స్పష్టంగా చెప్పకనే చెప్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర సాధన పట్ల సంతోషపడాల్సిన సమయంలో అన్నం మానేయడం, ఆ రాష్ట్రంపై దిష్టి మాటలు మాట్లాడటం – ఇవి కేవలం సానుభూతి లేకపోవడం మాత్రమే కాదు, బహిరంగ వ్యతిరేకతకు నిదర్శనాలు.

భారత రాజ్యాంగం ప్రకారం పార్లమెంటుకు రాష్ట్రాలను విభజించే అధికారం ఉంది. ఆ నిర్ణయం రాజ్యాంగ ప్రక్రియ ద్వారానే జరిగింది. పార్లమెంటు సమావేశాల్లో పెప్పర్ స్ప్రే సంఘటన, అలజడి.. ఇవి ఆ నిర్ణయాన్ని అడ్డుకోవడానికి జరిగిన ప్రయత్నాలు, అందులో సీమాంధ్ర ఎంపీల పాత్ర చరిత్రలో నమోదైంది. ఇప్పుడు అదే విభజన "తీరు బాగాలేదు" అని అంటే, అది విభజనను అంగీకరించడమా లేదా పరోక్షంగా వ్యతిరేకించడమా అనే ప్రశ్న సహేతుకంగా తలెత్తుతుంది. తెలంగాణ ఆవిర్భావ వేడుకల రోజునే పోటీ సభ నిర్వహించడం మరింత సూటిగా మాట్లాడాల్సిన విషయం. సభ పెట్టుకునే హక్కు ప్రతి పౌరుడికీ ఉంది, పవన్ కళ్యాణ్‌కూ ఉంది. కానీ తెలంగాణ పండుగ రోజున పోటీ సభ పెట్టడానికి ముందు కనీసం ఒక్కసారైనా తెలంగాణకు అనుకూలంగా మాట్లాడిన సందర్భం చూపించాల్సిన బాధ్యత వారిపై ఉంది. తెలంగాణ కోసం ప్రాణాలు వదిలిన అమరవీరులెందరో ఉన్నారు. వారి కుటుంబాల కన్నీళ్లు తుడిచిన సందర్భం ఉంటే చెప్పి సభ పెట్టుకుంటే అది నైతికంగా న్యాయంగా ఉంటుంది. లేకుంటే కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ఆ రోజును వేదికగా వాడుకోవడం తెలంగాణ అమరవీరుల త్యాగాన్ని అవమానించడమే అవుతుంది.

రాజకీయ నాయకుడికి తన నిర్ణయాలను, తన నిశ్శబ్దాన్ని, తన సానుభూతులను ప్రజల ముందు స్పష్టంగా చెప్పే బాధ్యత ఉంటుంది. తెలంగాణ ప్రజలు దశాబ్దాల కష్టాల తర్వాత సాధించుకున్న రాష్ట్రంపై, ఆ పోరాటం జరుగుతున్న సమయంలో మీరు ఎక్కడ నిలిచారు అని అడగడం అతిశయోక్తి కాదు. అది ప్రజాస్వామ్యంలో జవాబుదారీతనం. గతంలో వ్యతిరేకించి, ప్రస్తుతం విభజన తీరుపై విమర్శలు చేయడం రాజకీయ అవకాశవాదానికి నిదర్శనం తప్ప మరొకటి కాదు.

# యోగ.. ఆరోగ్య మంత్రామా, అతిశయోక్తి ప్రచారమా?




ప్రతి సంవత్సరం జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నారు. భారతదేశం ప్రతిపాదనతో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ఇప్పుడు వందలాది దేశాలు మద్దతు ఇస్తున్నాయి. యోగా వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని, ఒత్తిడి తగ్గుతుందని, దీర్ఘాయుష్షు లభిస్తుందని, అనేక రోగాలు దూరమవుతాయని ప్రభుత్వాలు, యోగా సంస్థలు, గురువులు ప్రచారం చేస్తున్నారు. అయితే ఒక శాస్త్రీయ సమాజంలో ఏదైనా ఆరోగ్య ప్రయోజనం గురించి మాట్లాడేటప్పుడు ప్రశ్న ఒక్కటే: దానికి బలమైన వైద్యశాస్త్ర ఆధారాలు ఉన్నాయా?

ముందుగా ఒక విషయాన్ని స్పష్టంగా అర్థం చేసుకోవాలి. యోగా అనేది ఒకే విధానం కాదు. ఇందులో శారీరక భంగిమలు (ఆసనాలు), శ్వాస వ్యాయామాలు (ప్రాణాయామం), ధ్యానం, విశ్రాంతి పద్ధతులు వంటి అనేక అంశాలు ఉంటాయి. అందువల్ల "యోగ వల్ల అన్నీ నయమవుతాయి" అనడం ఎంత తప్పో, "యోగకు అసలు ప్రయోజనం లేదు" అనడం కూడా అంతే తప్పు.

గత రెండు దశాబ్దాల్లో అమెరికా, యూరప్, భారత్ సహా అనేక దేశాల్లో యోగాపై వేలాది పరిశోధనలు జరిగాయి. వాటిలో చాలా పరిశోధనలు యోగా వల్ల ఒత్తిడి, ఆందోళన, నిరాశ లక్షణాలు కొంత మేర తగ్గవచ్చని సూచించాయి. ధ్యానం, నియంత్రిత శ్వాస వల్ల నాడీ వ్యవస్థ ప్రశాంత స్థితిలోకి వెళ్లి గుండె వేగం, రక్తపోటు కొంత తగ్గే అవకాశం ఉందని పరిశోధనలు చూపించాయి. నిద్రలేమితో బాధపడేవారిలో కూడా కొంత మెరుగుదల కనిపించింది.

అయితే ఇక్కడ ఒక ముఖ్యమైన పరిమితి ఉంది. ఈ పరిశోధనల్లో చాలా చిన్న స్థాయిలో జరిగాయి. అనేక అధ్యయనాల్లో పాల్గొన్న వారి సంఖ్య తక్కువగా ఉంది. కొన్నింటిలో సరైన నియంత్రణ సమూహాలు కూడా లేవు. అందువల్ల యోగా వల్ల వచ్చిన ప్రయోజనాలు ఎంతవరకు యోగా కారణంగా వచ్చాయో, ఎంతవరకు సాధారణ వ్యాయామం, సామాజిక మద్దతు లేదా ప్లాసిబో ప్రభావం వల్ల వచ్చాయో నిర్ధారించడం కష్టం.

రోగనిరోధక శక్తి విషయంలో ప్రచారం మరింత అతిశయోక్తిగా ఉంటుంది. "యోగ చేస్తే ఇమ్యూనిటీ విపరీతంగా పెరుగుతుంది" అనే వాదనకు ప్రస్తుతం బలమైన శాస్త్రీయ ఆధారాలు లేవు. కొన్ని అధ్యయనాలు ఒత్తిడి హార్మోన్లు తగ్గడం వల్ల రోగనిరోధక వ్యవస్థ పనితీరులో స్వల్ప మెరుగుదల ఉండవచ్చని సూచించాయి. కానీ యోగా వల్ల వైరస్‌లు, బ్యాక్టీరియాలు దూరంగా ఉంటాయని లేదా తీవ్రమైన అంటువ్యాధులను నివారించవచ్చని చెప్పడానికి ఆధారాలు లేవు. కోవిడ్ మహమ్మారి సమయంలో కూడా యోగా ఉపయోగకరమైన సహాయక పద్ధతిగా ఉండవచ్చని మాత్రమే చెప్పబడింది; అది వ్యాక్సిన్‌కు లేదా వైద్య చికిత్సకు ప్రత్యామ్నాయం కాదని ప్రపంచ ఆరోగ్య నిపుణులు స్పష్టం చేశారు.

అలాగే మధుమేహం, గుండె జబ్బులు, క్యాన్సర్, కీళ్ల నొప్పులు వంటి వ్యాధుల విషయంలో కూడా యోగా సహాయక పాత్ర పోషించవచ్చు. ఉదాహరణకు మధుమేహ రోగి యోగా చేయడం వల్ల ఒత్తిడి తగ్గి, శారీరక చలనం పెరిగి, బరువు నియంత్రణలో ఉండవచ్చు. కానీ దానివల్ల ఇన్సులిన్ అవసరం పూర్తిగా పోతుందని లేదా మందులు మానేయవచ్చని చెప్పడం శాస్త్రీయంగా తప్పు. క్యాన్సర్ రోగులలో అలసట, ఆందోళన తగ్గించడంలో యోగా కొంత ఉపయోగకరంగా ఉండొచ్చు. కానీ క్యాన్సర్‌ను నయం చేసే చికిత్సగా యోగాను ప్రచారం చేయడం ప్రమాదకరం.

"ఎవరైనా యోగా చేయవచ్చు" అనే వాదన కూడా పూర్తిగా సరైనది కాదు. పిల్లలు, యువకులు, మధ్యవయస్కులు, వృద్ధులు అందరికీ ఒకే రకమైన యోగా సరిపోదు. వెన్నెముక సమస్యలు, మెడ నొప్పులు, గుండె జబ్బులు, అధిక రక్తపోటు, గర్భధారణ, కంటి గ్లాకోమా వంటి పరిస్థితుల్లో కొన్ని ఆసనాలు ప్రమాదకరంగా మారవచ్చు. ముఖ్యంగా సోషల్ మీడియా వీడియోలు చూసి కఠినమైన ఆసనాలను ప్రయత్నించడం వల్ల కండరాల గాయాలు, కీళ్ల దెబ్బలు, వెన్నెముక గాయాలు సంభవించిన ఉదాహరణలు ఉన్నాయి. కొన్ని వైద్య పత్రికల్లో యోగా సంబంధిత గాయాలపై నివేదికలు కూడా ప్రచురించబడ్డాయి.

ఇక్కడ ఒక సామాజిక సమస్య కూడా ఉంది. యోగా చుట్టూ కొన్ని సందర్భాల్లో శాస్త్రీయ చర్చ కంటే ఆధ్యాత్మిక లేదా జాతీయవాద ప్రచారం ఎక్కువగా కనిపిస్తుంది. ఆరోగ్య ప్రయోజనాలను అతిశయోక్తిగా చెప్పడం, విమర్శలను దేశద్రోహంగా చిత్రీకరించడం, ప్రతి రోగానికి యోగానే పరిష్కారం అన్న భావనను ప్రోత్సహించడం ప్రజారోగ్యానికి మేలు చేయదు. వైద్యశాస్త్రం అనేది ఆధారాలపై ఆధారపడాలి; విశ్వాసాలపై కాదు.

అయితే విమర్శనాత్మక దృక్పథం అంటే యోగాను పూర్తిగా తిరస్కరించడం కాదు. నడక, సైక్లింగ్, ఈత, సాధారణ వ్యాయామం ఎలా ఉపయోగకరమో, యోగా కూడా ఒక శారీరక-మానసిక ఆరోగ్య సాధనంగా ఉపయోగపడవచ్చు. ముఖ్యంగా వృద్ధులు, కీళ్ల సమస్యలున్నవారు, అధిక ఒత్తిడిలో ఉన్నవారు, ధ్యానం చేయాలనుకునేవారికి ఇది అనుకూలంగా ఉండవచ్చు. కానీ దీనిని వైద్య చికిత్సకు ప్రత్యామ్నాయంగా కాకుండా అనుబంధ పద్ధతిగా చూడాలి.

చివరిగా... ఈ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రజలకు ఇవ్వాల్సిన ముఖ్యమైన సందేశం ఇదే: యోగా ఒక మాయాజాలం కాదు, అదే సమయంలో నిరుపయోగమూ కాదు. దాని ప్రయోజనాలను శాస్త్రీయ ఆధారాల మేరకే అంగీకరించాలి. యోగా చేయాలనుకునేవారు తమ వయసు, ఆరోగ్య పరిస్థితి, వైద్యుల సలహా, శిక్షణ పొందిన బోధకుల మార్గదర్శకత్వాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. ఆరోగ్యానికి నిజమైన మూలస్తంభాలు ఇప్పటికీ సమతుల ఆహారం, క్రమబద్ధమైన శారీరక వ్యాయామం, సరిపడ నిద్ర, టీకాలు, అవసరమైన వైద్య చికిత్సలే. యోగా వాటికి తోడ్పడే ఒక సాధనం మాత్రమే; వాటిని భర్తీ చేసే అద్భుత ఔషధం కాదు.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.



## జనం ఘోష!


పెల్లుబికే 'జనంఘోష'!
దానినిపట్టించుకోకుండా
నెహ్రూ కంటే గొప్ప అంటూ
భజనచేయించు కోవటం!
ఇదేనా సంస్కారం?
ఖరీదైన సూట్లు వేసి
ప్రత్యేక విమానాల్లో
ప్రపంచ దేశాలన్నీ
తిరిగితే ఏంజరిగింది?
రూపాయి పతనం తప్ప!
కొనుగోలు శక్తిలేక
నిత్యదారిద్ర్యంతోజనం!
అదానీ అంబానీలకు
లాభలుమాత్రం ఘనం!
ఇదేనా నీగొప్పతనం ?
అమెరికా ఇజ్రాయెల్
భూతాల సరసన
వాళ్ల భుజంతట్టి
కౌగిలించుకుంటే
ఒరిగిందేమిటి?
విశ్వగురువుకి
అందరూ శిష్యులే!
గురుదక్షిణ మాత్రం
సంకెళ్ళ 'గౌరవం'!
నావికుల హననం!
(నిన్నమననావికులు
ముగ్గురినిఅమెరికన్
సైన్యం చంపేసారు )
నువ్వూ భూతానివే!
దేశంలోనే తప్ప
దేశంబైట నువ్వు
మింగాలేవు!
ఉన్నది కక్కాలేవు!
అద్భుత దీపానికి
నువ్వుబానిసభూతం!
ఇంటా బైటా జనం
కంటనీరు కారుస్తూ
ఎందుకుమాకీ శిక్ష?
కొనొద్దు తినొద్దని
ఇంట్లో ఈగలమోత!
శవాలదుర్గంధతో
బైటవిమానాలమోత!
ఏంటీ 'జనంఘోష'!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

## ప్రైవేటు వద్దు... ప్రభుత్వ బడి ముద్దు

ప్రైవేటు గోడల మధ్య
పుస్తకాల భారమైతే,
ప్రభుత్వ బడిలో మాత్రం
జీవిత పాఠాల వెలుగుంటుంది!
అక్షరాలకు ఆలవాలం
అందరికీ సమాన హక్కు,
పేద ధనిక తేడా లేని
ప్రభుత్వ బడి గొప్పతనం.
మధ్యాహ్న భోజనంతో
మమతను పంచే నిలయం,
ఉచిత విద్యా వరాలతో
భవిష్యత్తు తీర్చే ఆలయం.
ఎందరో మేధావులను
దేశానికి అందించిన గడి,
జ్ఞాన దీపం వెలిగించే
మన ప్రభుత్వ బడి.
మొక్కలా నాటి పిల్లలను
మహావృక్షాలుగా తీర్చిదిద్దే,
ప్రైవేటు వద్దు అంటాం...
ప్రభుత్వ బడి ముద్దు అంటాం!

# బానిసలరా లెండిరో... గుద్దిగుంజుకుందాంరో!



ఓ తెలుగు నేల తల్లీ! నీ కన్నబిడ్డల రోదనలు నీకు వినిపిస్తున్నాయా? నీ గుండె నెత్తురు పిండుకుతింటున్న వారెవరో నీకు తెలుసా? నీ పచ్చని పొలాల్లో చెమట చిందించే రైతు కన్నీరు, పట్నాల్లో ఉద్యోగం కోసం అరిగే నిరుద్యోగి కాళ్ళ చెప్పులు, ఆఖరికి ఆకలితో అలమటించే ముసలి ప్రాణం వీరందరి శ్రమను, ఆశలను దోచుకుంటున్న వారెవరో నీకు అర్థమవుతోందా?అవును, అది మరెవరో కాదు. మన పాలకులే! మన నేతలే! ఐదేళ్లకోసారి ప్రజాప్రతినిధులమని చెప్పుకుంటూ, రాజ్యాంగం మీద ప్రమాణం చేసి, అధికార పీఠం ఎక్కగానే అహంకారంతో కళ్లు మూసుకుపోయే ఆ మోసగాళ్లే.బానిసత్వం అంటే పూర్వంలా గొలుసులతో బంధించడం కాదు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా, నేటికీ సామాన్య జనం రైతులు, కూలీలు, చిన్న వ్యాపారులు ఇంకా అదృశ్య బానిసలుగానే బతుకుతున్నారు. తేడా ఏమిటంటే, అప్పుడు తెల్లవారు పరిపాలించేవారు, ఇప్పుడు మన వాళ్ళలాగే కనిపించే వారే మనల్ని నిలువునా ముంచేస్తున్నారు. తెలుగు భాషలో తీయగా మాట్లాడుతూనే, తెలుగువారి వెన్నుపోటు పొడుస్తున్నారు.


ప్రతి నాయకుడూ అధికారంలోకి వచ్చేముందు ఒక రకమైన వేషం వేస్తాడు. ఎన్నికల సమయంలో మీ ఇంటి గుమ్మం ముందు నిలబడి, సాష్టాంగ నమస్కారం చేసే ఆ నాయకుడు, గెలిచిన తర్వాత కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడు. ఇది కేవలం రాజకీయం కాదు, ఇది పచ్చి మోసం.ఒక్కసారి ఆలోచించండి. ఒక రైతు తన పొలంలో వానాకాలం, చలికాలం అని తేడా లేకుండా కష్టపడతాడు. ప్రకృతి కన్నెర్ర చేసినా, కరెంటు కోతలు వేధించినా, చివరికి పండిన పంటకు మద్దతు ధర లేకపోయినా వంగిపోకుండా నిలబడతాడు. కానీ, అప్పుల ఊబిలో కూరుకుపోయి చివరకు ఆత్మహత్యే శరణ్యమనుకుంటాడు. మరోవైపు, అదే గ్రామం నుంచి గెలిచిన నాయకుడు ఐదేళ్లలో వందల కోట్ల ఆస్తులు ఎలా సంపాదిస్తున్నాడు? రైతు చెమట చుక్క విలువ పెరగదు కానీ, నాయకుడి కారు ధర మాత్రం కోట్లల్లో ఉంటుంది. ఇది దోపిడీ కాదా?నిరుద్యోగుల పరిస్థితి మరీ దారుణం. ఏళ్ళ తరబడి కోచింగ్ సెంటర్ల చుట్టూ తిరుగుతూ, తల్లిదండ్రులు పంపే డబ్బుతో ఒక పూట తిని, మరో పూట పస్తులుంటూ చదువుకుంటారు. కానీ నోటిఫికేషన్లు రావు, వచ్చినా పేపర్ లీకేజీలు లేదా నాయకుల అనుచరులకే ఆ ఉద్యోగాలు అమ్ముడుపోతాయి. సామాన్యుడి ప్రతిభ కన్నా నాయకుడి పలుకుబడే అర్హతగా మారుతోంది.ఒక పేద తల్లి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్తే అక్కడ డాక్టర్లు ఉండరు, మందులు ఉండవు, పడకలు అంతకన్నా ఉండవు. అపరిశుభ్రత రాజ్యమేలుతుంటుంది. కానీ, అదే ప్రజల సొమ్ముతో జీతాలు తీసుకునే నాయకుడు మాత్రం చిన్న తలనొప్పి వచ్చినా విదేశాలకు వెళ్ళి కార్పొరేట్ వైద్యం చేయించుకుంటాడు. మన పన్నుల డబ్బుతో వారి ప్రాణాలు కాపాడుకుంటారు, మరి సామాన్యుడి ప్రాణానికి విలువ లేదా?మనం "గుద్దిగుంజుకుందాం" అన్నప్పుడు అది భౌతిక దాడి కాదు. అది ఒక ఆత్మీయ నిరసన, ఒక సామాజిక చైతన్యం. మన హక్కులను మనం నిలదీసి అడగడం. మన శ్రమను దోచుకునే వారిని గల్లా పట్టుకుని ప్రశ్నించడం. ఇక్కడ పెన్ను కత్తి కంటే గొప్పది, ఓటు తుపాకీ కంటే శక్తివంతమైనది.మనం ఎందుకు నిద్రపోతున్నాం? ఎందుకంటే పాలకులు మనల్ని ఉచితాల మత్తులో ముంచుతున్నారు. ఫ్రీ బియ్యం, ఫ్రీ గ్యాస్, ఫ్రీ బస్సు వంటి పథకాలు ఇస్తూ, మన ఆత్మగౌరవాన్ని కొనేస్తున్నారు. నిజానికి ఇవి ఉచితాలు కావు, మనమే కడుతున్న పన్నుల సొమ్ము. ఒక చేత్తో పన్నుల రూపంలో వేల రూపాయలు వసూలు చేసి, మరో చేత్తో వంద రూపాయల పథకాన్ని ఇచ్చి "మేము గొప్ప పనులు చేస్తున్నాం" అని డబ్బా కొట్టుకుంటున్నారు.తెలుగు నేల పోరాటాలకు పురిటిగడ్డ. అల్లూరి సీతారామరాజు తెల్లదొరల గుండెల్లో నిద్రపోయాడు. తెలంగాణ సాయుధ పోరాటంలో సామాన్య మహిళలు కూడా గడీల పాలనను గడగడలాడించారు. శ్రీకాకుళం రైతాంగ పోరాటం హక్కుల కోసం ఎలా నిలబడాలో నేర్పింది. నేటి కాలంలో మనం తుపాకులు పట్టాల్సిన అవసరం లేదు. కేవలం సత్యాన్ని నమ్మి, ఐక్యంగా నిలబడితే చాలు. మన గొంతు ఒకటైనప్పుడు ఏ వ్యవస్థైనా తలొగ్గక తప్పదు.మీరు ప్రశ్నించడం నేర్చుకోండి మీ వార్డు మెంబర్ నుంచి ఎంపీ వరకు, మీ గ్రామానికి వారు ఏం చేశారో అడగండి. ఆర్టీఐ (సమాచార హక్కు చట్టం) ఉపయోగించండి. నిధులు ఎక్కడ ఖర్చవుతున్నాయో తెలుసుకోండి.ఉన్న ఓటును అమ్ముకోకండి ఎన్నికల ముందు ఇచ్చే వెయ్యి, రెండు వేల రూపాయలు మీ ఐదేళ్ల భవిష్యత్తును కాలరాస్తాయి. ఆ డబ్బు మీ బిడ్డల విద్యను, మీ ఆరోగ్యాన్ని అమ్మేసినట్టే. నోటుకు లొంగని ఓటే నిజమైన ప్రజాస్వామ్య ఆయుధం.అందరు సంఘటితమవ్వండి కులాలు, మతాల పేరుతో నాయకులు మనల్ని విడదీస్తారు. కానీ పేదరికానికి కులం లేదు, ఆకలికి మతం లేదు. రైతులు, కార్మికులు, యువత ఒక్క తాటిపైకి వస్తేనే నాయకులలో వణుకు పుడుతుంది.నేడు ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంది. మీ గ్రామంలో రోడ్డు బాగోకపోయినా, స్కూల్లో టీచర్ రాకపోయినా వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టండి. సామూహిక నిరసనను డిజిటల్ వేదికలపై చూపండి.మనం ఎవరికీ శత్రువులం కాదు. మనం కేవలం న్యాయం కోరుతున్నాం. మన పన్నుల డబ్బుతో నాణ్యమైన రోడ్లు ఉండాలి. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ఉండాలి. ఆసుపత్రుల్లో పేదవాడికి ఉచితంగా వైద్యం అందాలి. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. రైతు పండించిన ప్రతి గింజకూ సరైన ధర దక్కాలి. ఇవి కోరడం నేరం కాదు, ఇది మన హక్కు!ఓ తెలుగు సోదరుడా! సోదరీ! ఇకనైనా నీ కళ్ళు విప్పి చూడు. నీ మౌనం పాలకులకు బలం. నీ భయం వారికి పెట్టుబడి. "బానిసలరా లెండిరో" అన్న పిలుపు నిన్ను అవమానించడానికి కాదు, నీలోని శక్తిని గుర్తు చేయడానికి. మనం బానిసలుగా పుట్టలేదు, పాలకుల పాదాల చెంత పడి ఉండటానికి అంతకన్నా పుట్టలేదు."గుద్దిగుంజుకుందాముంరో" అంటే మన గౌరవాన్ని మనం తిరిగి తెచ్చుకోవడం. ఎవరూ మనకు హక్కులను పళ్ళెంలో పెట్టి ఇవ్వరు. మనం అడిగి తీసుకోవాలి, పోరాడి సాధించుకోవాలి. ఈ నేల మనది, ఈ దేశం మనది, ఈ సంపద మనది. మరి దానిపై అధికారం కూడా మనదే కావాలి.లెండి! చైతన్యవంతులు కండి! రేపటి సుందర ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నిర్మాణం మన చేతుల్లోనే ఉంది. ప్రజాస్వామ్యం అంటే ప్రజల కోసం ప్రజలే నడిపే పాలన. ఆ పాలనను నిజం చేద్దాం.

(తన పాటతో ప్రజల గుండెల్లో చైతన్యాన్ని రగిలించి, 'బానిసలరా లెండిరో' అని నినదించిన ప్రజా యుద్ధనౌక గద్దర్ గారికి అక్షర నివాళి! )

జై హింద్! జై తెలుగు తల్లి!

డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

# చే గువేరా: విప్లవం అనే అగ్నిజ్వాల ఇంకా ఆరిపోలేదు



చరిత్రలో కొందరు వ్యక్తులు తమ కాలాన్ని మాత్రమే కాదు, తరతరాల ఆలోచనలను ప్రభావితం చేస్తారు. వారి జీవితం ఒక దేశానికి పరిమితం కాకుండా ప్రపంచవ్యాప్తంగా చర్చకు, అధ్యయనానికి, స్ఫూర్తికి కేంద్రంగా మారుతుంది. అలాంటి అరుదైన వ్యక్తిత్వాలలో ఎర్నెస్టో "చే" గువేరా ఒకరు. ఆయన మరణించి దాదాపు ఆరు దశాబ్దాలు గడిచినా, నేటికీ ప్రపంచ రాజకీయాలు, సామాజిక ఉద్యమాలు, యువత ఆలోచనల్లో ఆయన పేరు మారుమోగుతూనే ఉంది. చే గువేరాను కేవలం ఒక విప్లవకారుడిగా చూడడం సరిపోదు. ఆయన ఒక వైద్యుడు, రచయిత, తత్వవేత్త, అంతర్జాతీయవాది, సామాజిక న్యాయం కోసం తన జీవితాన్నే పణంగా పెట్టిన ఉద్యమకారుడు.

ప్రపంచ చరిత్రలో ఎన్నో విప్లవాలు జరిగాయి. అయితే వాటిలో కొన్ని మాత్రమే ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపగలిగాయి. క్యూబా విప్లవం అలాంటి వాటిలో ఒకటి. ఆ విప్లవ విజయానికి ఫిడెల్ కాస్ట్రో ఎంత ముఖ్యమో, చే గువేరా కూడా అంతే ముఖ్యుడు. అయితే చే గువేరా ప్రత్యేకత ఆయన సాధించిన విజయాలలో మాత్రమే లేదు. ఆయన తన నమ్మకాల కోసం చేసిన త్యాగంలో ఉంది. అధికారాన్ని పొందిన తర్వాత కూడా అధికార సౌకర్యాలకు బానిస కాకుండా, మరోసారి పోరాట బాట పట్టిన నాయకులు ప్రపంచ చరిత్రలో చాలా అరుదు.

చే గువేరా జీవితాన్ని పరిశీలిస్తే ఆయన విప్లవకారుడిగా పుట్టలేదు. ఆయన ఒక వైద్య విద్యార్థి. సమాజాన్ని అర్థం చేసుకోవాలనే తపనతో దక్షిణ అమెరికా అంతటా చేసిన యాత్ర ఆయన జీవితాన్ని మార్చేసింది. పుస్తకాలలో చదివిన పేదరికం, అసమానత, దోపిడీని ప్రత్యక్షంగా చూసినప్పుడు ఆయన మనసు కలత చెందింది. సహజ వనరులతో నిండిన దేశాల్లో ప్రజలు ఆకలితో అలమటించడం, కార్మికులు దోపిడీకి గురికావడం, ఆదివాసీలు కనీస హక్కులు లేక జీవించడం ఆయనను తీవ్రంగా ప్రభావితం చేశాయి.

ఆ యాత్ర చే గువేరాకు ఒక గొప్ప సత్యాన్ని నేర్పింది. సమాజంలో సమస్యలు వ్యక్తిగత వైఫల్యాల వల్ల కాకుండా వ్యవస్థలోని లోపాల వల్ల ఉత్పన్నమవుతున్నాయని ఆయన గ్రహించారు. ఒక వైద్యుడిగా రోగికి మందులు ఇవ్వవచ్చు. కానీ పేదరికం, నిరక్షరాస్యత, నిరుద్యోగం, దోపిడీ వంటి సామాజిక రోగాలకు మందులు సరిపోవని ఆయన అర్థం చేసుకున్నారు. అందుకే సమాజ మార్పు కోసం రాజకీయ పోరాటాన్ని ఎంచుకున్నారు.

క్యూబా విప్లవం ఆయన జీవితంలో అత్యంత కీలక అధ్యాయం. కొద్దిమంది విప్లవకారులు ఒక శక్తివంతమైన ప్రభుత్వాన్ని ఎదుర్కొని విజయం సాధించడం ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. అయితే ఆ విజయానికి కారణం కేవలం ఆయుధాలు కాదు. ప్రజల విశ్వాసం. రైతుల మద్దతు. సామాజిక న్యాయం పట్ల నిబద్ధత. చే గువేరా గ్రామీణ ప్రజలతో మమేకమై, వారి సమస్యలను అర్థం చేసుకుని, వారికి వైద్య సేవలు అందించడం ద్వారా విప్లవాన్ని ప్రజల ఉద్యమంగా మలిచారు.

విప్లవం విజయవంతమైన తరువాత కూడా ఆయన పాత్ర ముగియలేదు. భూ సంస్కరణలు, విద్య, ఆరోగ్యం, పారిశ్రామిక అభివృద్ధి వంటి రంగాల్లో కీలక బాధ్యతలు చేపట్టారు. క్యూబాలో అక్షరాస్యత పెంపు, ఉచిత వైద్య సేవల విస్తరణ, సామాజిక సంక్షేమ కార్యక్రమాల అమలులో ఆయన దృష్టి స్పష్టంగా కనిపిస్తుంది. ప్రభుత్వం ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి ఒక సాధనం కావాలని ఆయన నమ్మారు.

అయితే చే గువేరాను కేవలం ప్రశంసలతో మాత్రమే చూడడం కూడా చరిత్రకు న్యాయం చేయదు. ఆయన భావజాలం, వ్యూహాలు, ముఖ్యంగా సాయుధ విప్లవంపై ఆయన నమ్మకం వివాదాలకు కారణమయ్యాయి. సామాజిక మార్పు కోసం ఆయుధ పోరాటాన్ని సమర్థించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శకులు అభిప్రాయపడతారు. రాజకీయ ప్రత్యర్థుల పట్ల ఆయన తీసుకున్న కొన్ని కఠిన నిర్ణయాలు కూడా విమర్శలకు గురయ్యాయి. అందువల్ల చే గువేరా చరిత్రను సమతుల్య దృష్టితో చూడాల్సిన అవసరం ఉంది.

అయినప్పటికీ ఆయన జీవితంలో ఒక అసాధారణమైన అంశం ఉంది. అది నిబద్ధత. తాను నమ్మిన సిద్ధాంతాల కోసం వ్యక్తిగత సౌకర్యాలు, పదవులు, అధికారాన్ని త్యజించిన నాయకుడిగా ఆయన నిలిచారు. చాలా మంది నాయకులు ఉద్యమాల ద్వారా అధికారంలోకి వచ్చి అక్కడే ఆగిపోతారు. కానీ చే గువేరా అధికారాన్ని అంతిమ లక్ష్యంగా చూడలేదు. అది ఒక సాధనం మాత్రమేనని భావించారు. అందుకే క్యూబాలో ఉన్నత పదవులను వదిలి ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల్లోని విముక్తి ఉద్యమాలకు మద్దతు ఇవ్వడానికి బయలుదేరారు.

నేటి ప్రపంచంలో చే గువేరా ప్రాసంగికత ఏమిటి అనే ప్రశ్న తరచూ వినిపిస్తుంది. ప్రపంచం మారిపోయింది. శీతల యుద్ధం ముగిసింది. రాజకీయ సమీకరణాలు మారాయి. అయినప్పటికీ పేదరికం, అసమానత, నిరుద్యోగం, కార్పొరేట్ ఆధిపత్యం, సామాజిక అన్యాయం వంటి సమస్యలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమవుతుండగా, కోట్లాది మంది ప్రజలు ప్రాథమిక అవసరాల కోసం పోరాడుతున్నారు. ఈ నేపథ్యంలో సామాజిక న్యాయం గురించి చే గువేరా లేవనెత్తిన ప్రశ్నలు ఇప్పటికీ సమాధానం కోసం ఎదురుచూస్తున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా యువతలో చే గువేరా పట్ల ఆకర్షణకు కారణం కూడా ఇదే. ఆయన కేవలం ఒక రాజకీయ నాయకుడు కాదు. అన్యాయాన్ని ప్రశ్నించే ధైర్యానికి ప్రతీక. పరిస్థితులను మార్చగలమనే ఆశకు ప్రతీక. వ్యక్తిగత ప్రయోజనాల కంటే సామాజిక బాధ్యతకు ప్రాధాన్యం ఇచ్చిన వ్యక్తిగా ఆయన నిలిచారు. అందుకే ఆయన చిత్రం నేటికీ నిరసన ప్రదర్శనల్లో, విద్యార్థి ఉద్యమాల్లో, సామాజిక న్యాయం కోసం జరిగే ప్రచారాల్లో కనిపిస్తూనే ఉంది.

అయితే చే గువేరాను అర్థం చేసుకోవాలంటే ఆయన ఫోటోను చూసి భావోద్వేగానికి లోనవడం సరిపోదు. ఆయన రచనలు చదవాలి. ఆయన ఆలోచనలను విమర్శనాత్మకంగా విశ్లేషించాలి. ఆయన విజయాలతో పాటు వైఫల్యాలను కూడా అధ్యయనం చేయాలి. చరిత్రలో ఏ నాయకుడినైనా దేవుడిగా చూడడం ఎంత ప్రమాదకరమో, పూర్తిగా తిరస్కరించడం కూడా అంతే ప్రమాదకరం.

చే గువేరా మనకు నేర్పిన అతిపెద్ద పాఠం ఏమిటంటే సమాజ మార్పు గురించి మాట్లాడటం మాత్రమే కాదు, ఆ మార్పు కోసం వ్యక్తిగతంగా కృషి చేయడం కూడా అవసరం. ఆయన జీవితం ఒక ప్రశ్నను మన ముందుంచుతుంది. అన్యాయం కనిపించినప్పుడు మనం మౌనంగా ఉంటామా? లేక దానిని ప్రశ్నిస్తామా? ఇదే ప్రశ్న ఆయనను ప్రపంచ చరిత్రలో చిరస్థాయిగా నిలబెట్టింది.

చరిత్రలో అనేక మంది నాయకులు వచ్చారు, వెళ్లిపోయారు. కానీ కొందరు మాత్రమే ఒక ఆలోచనగా, ఒక చిహ్నంగా, ఒక ఉద్యమంగా మిగిలిపోతారు. చే గువేరా అలాంటి వారిలో అగ్రగణ్యుడు. ఆయనను అభిమానించవచ్చు. విమర్శించవచ్చు. కానీ విస్మరించడం మాత్రం అసాధ్యం. ఎందుకంటే చే గువేరా ఒక వ్యక్తి మాత్రమే కాదు-సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడే మానవ సంకల్పానికి ప్రతీక. నేటి ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్ల మధ్య చే గువేరా జీవితాన్ని మరోసారి పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఆయన చూపిన మార్గాన్ని అక్షరాలా అనుసరించాల్సిన అవసరం లేకపోవచ్చు. కానీ సమాజంలో అసమానతలపై ప్రశ్నించే ధైర్యం, ప్రజల పట్ల నిబద్ధత, త్యాగస్ఫూర్తి, ఆదర్శాల కోసం నిలబడే సంకల్పం మాత్రం ప్రతి తరానికి అవసరమే. అదే చే గువేరా వారసత్వం. అదే ఆయనను చరిత్రలో శాశ్వతంగా నిలబెట్టిన అసలు కారణం.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

● జిల్లా కలెక్టర్ ప్రియాంక

**నారాయణపేట జిల్లా బ్యూరో, జూన్ 15 (జనం సాక్షి) :** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ కు అవసరమైన అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సూచించారు. ఆర్ అండ్ బి, నేషనల్ హైవే ,పోలీసు శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాలో గుర్తించిన బ్లాక్ స్పాట్స్ ( ప్రమాదకర ప్రదేశాలు)లో ఇకపై ప్రమాదాలు జరగకుండా రోడ్ సేఫ్టీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో ఏర్పాటు చేసిన రోడ్ సేఫ్టీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్ అండ్ బి అధికారులు రోడ్లకు సమీపములో ఉన్న స్కూల్స్ వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. జంక్షన్ల దగ్గర సూచిక బోర్డులు హజార్డ్ మార్కర్లు ఏర్పాటు చేయాలని, కల్వర్టుల దగ్గర రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలన్నారు. కోసిగి సర్కిల్లో మున్సిపాలిటీ పరిధిలో జాతీయ రహదారి 167 నాచారం అవుట్ స్టిక్కర్లు వేయాలన్నారు. మరికల్ సర్కిల్లో బ్లాక్ స్పాట్స్ టాప్ 10 బ్లాక్ స్పాట్స్ ఉన్నాయని తెలిపారు. నారాయణపేట సర్కిల్ ఇతర



రహదారి మున్సిపాలిటీ పరిధిలో 2025లో 13మరణం సంభవించిందని 18 మంది గాయపడ్డారని తెలిపారు. నారాయణపేట సత్యనారాయణ ఎక్స్ రోడ్లు గత 72 మరణాలు సంభవించాయని మక్తల్ మున్సిపాలిటీలో 2025లో 10 మరణాలు తొమ్మిది మంది గాయపడ్డారని తెలిపారు. దండు ఎక్స్ రోడ్ నల్లజానమ్మ గుడి వద్ద, మక్తల్ బస్టాండ్ చందాపూర్ లో బ్లాక్ స్పాట్ ఉన్నాయని భారీకేడ్లు సూచిక బోర్డులు జీబ్రా క్రాసింగ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మరికల్ టౌన్ పెద్ద చింతకుంట జాతీయ రహదారి రంబుల్ ట్రిప్స్ విత్ స్టడీస్ యాక్సిడెంట్ ఏరియా డ్రైవ్ స్లో తదితర ఏర్పాట్లు చేయాలన్నారు.ప్రతినెల సమావేశాలు నిర్వహించి రోడ్ కమిటీ సూచనలు ఇవ్వాలన్నారు. హైవేలో మెడికల్ డిపార్ట్మెంట్ సమన్వయంతో పని చేయాలన్నారు. అప్పంపల్లి దగ్గర న్యారో కల్వర్టులో ఉన్నాయని ప్రమాదం జరిగా అవకాశం ఉన్నందున ఆర్టీసీ అధికారులు జాగ్రత్త ఉండాలని అన్నారు. నారాయణపేట బస్టాండ్ దగ్గర ఫ్రూట్ బండ్లు ఇబ్బంది కలుగుతుందని వాటిని తొలగించాలన్నారు. కోస్గి బస్టాండ్ దగ్గర ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. సింగారం బోయిన్పల్లి దగ్గర ముళ్లపదలు తొలగించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్టిఏ మెంబర్ పోషల్ రాజేష్ , డి.యం హెచ్.ఓ.జయచంద్ర మోహన్,ఆర్ అండ్ బి ఈ ఈ.వెంకట్రాములు,నేషనల్ హైవే డిప్యూటీ ఈ ఈ మహమ్మద్ సుభాన్ , రాజయ్య , అశోక్ ,ఎం సి శంకర్ ఆర్ . టి.ఓ.అధికారి మున్ని సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

● ఏబీవీపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుర్వ మహిపాల్

**చేవెళ్ల, జూన్ 15 (జనంసాక్షి) :** ప్రైవేట్ పాఠశాలలు, కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ అదిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుర్వ మహిపాల్ డిమాండ్ చేశారు. సోమవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో చేవెళ్ల ఎంఈవో పురందాస్ ను కలిసి వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం ఇష్టం వచ్చినట్లు ఫీజులు పెంచి విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నారని అన్నారు. చేవెళ్లలో కొన్ని ప్రైవేట్ విద్యా సంస్థలు సరైన అనుమతులు, మౌలిక సదుపాయాలు లేకుండానే నిర్వహిస్తున్నాయని ఆరోపించారు. విద్యాశాఖ నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. చేవెళ్ల మండలంలో ఉన్న ప్రైవేట్ పాఠశాల తనిఖీలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులు కల్పించి నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల భవిష్యత్తు, విద్యా వ్యవస్థ పరిరక్షణ అంశాల పై తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు జైపాల్, సంతోష్ తదితరులు ఉన్నారు.



# ప్రజల సంక్షేమం, ప్రాంత అభివృద్ధే లక్ష్యం

● ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**కాప్రా, జూన్ 15 (జనం సాక్షి) :** ప్రజల సంక్షేమం, ప్రాంత అభివృద్ధే తమ లక్ష్యమని, చర్లపల్లి డివిజన్లో మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి కొనసాగిస్తామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నరు. చర్లపల్లి డివిజన్ చెందిన పలు కాలనీలలో ఎన్నో సంవత్సరాలుగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షాకాలంలో మురుగునీరు బయటకు వెళ్లక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు నిధులు మంజూరు చేయించడంతో పాటు టెండర్ ప్రక్రియను కూడా పూర్తి అయిందని అన్నారు. ఈ పనులు వేగంగా ప్రారంభమై సజావుగా కొనసాగేందుకు అవసరమైన సహకారం అందించాలని కోరుతూ ఘట్కేసర్ పరిధిలోని రాంపల్లి పర్యటించి అక్కడి సమస్య పరిష్కారానికి డిసి వాణితో మాట్లాడడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, చర్లపల్లి డివిజన్ ప్రజలు చాలా కాలంగా ఎదురుచూస్తున్న డ్రైనేజీ సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం లభిస్తుందని, పనుల అమలులో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించాలని కోరారు.ప్రజల సంక్షేమం, ప్రాంత అభివృద్ధే



తమ లక్ష్యమని, చర్లపల్లి డివిజన్లో మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి కొనసాగిస్తామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తెల్ల శ్రీధర్, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు మహేష్ గౌడ్ ,కాలనీ వాసులు సి.హెచ్. సురేందర్ రెడ్డి, కె. కృష్ణా రెడ్డి డి. భూమ్ రెడ్డి అధ్యక్షులు సి.హెచ్. వెంకట్రాం రెడ్డి కార్యదర్శి వి. జీవన్ రెడ్డి కోశాధికారి బి. సుదర్శన్ ఉపాధ్యక్షులు, సి.హెచ్. శ్రీనివాస్ రెడ్డి పి. పవన్ కుమార్ రెడ్డి కె. సాయినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ట్రాన్స్‌జెండర్ బిల్లు-2026ను వెంటనే రద్దు చేయాలి

● ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ నాయకురాలు మోనాలిసా

**ముషీరాబాద్, జూన్ 15 (జనం సాక్షి) :** ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ (ప్రొటెక్షన్ ఆఫ్ రైట్స్) అమెండ్‌మెంట్ బిల్లు-2026ను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ నాయకురాలు మోనాలిసా డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో నిర్వహించిన ట్రాన్స్ ఉ హిజ్రా కమ్యూనిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోనాలిసా మాట్లాడుతూ, ప్రతిపాదిత బిల్లు ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల రక్షణ కోసం కాకుండా వారి ఉనికినే నేరంగా పరిగణించేలా ఉందని విమర్శించారు. నల్సా- 2014 తీర్పు ద్వారా లభించిన స్వీయ గుర్తింపు (సెల్ఫ్ ఐడెంటిఫికేషన్) హక్కును హరించే ప్రయత్నం జరుగుతోందని, ఘరానాలు, గురు-చేలా వ్యవస్థలు, కమ్యూనిటీకి అండగా నిలిచే స్వచ్ఛంద సంస్థలను కూడా నేరపూరితంగా చిత్రీకరించే నిబంధనలు ఇందులో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశానికి మద్దతుగా మాట్లాడిన భూపతి వెంకటేశ్వర్లు, ట్రాన్స్ మరియు హిజ్రా వ్యక్తుల గౌరవం, గుర్తింపు రాజ్యాంగబద్ధ హక్కులని పేర్కొన్నారు. ఈ హక్కులను పరిమితం చేసే ప్రయత్నాలను తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు. కమ్యూనిటీ నాయకులు రచన ముద్రబోయిన, చంద్రముఖి, అవంతి తదితరుల డిమాండ్లకు పూర్తి



మద్దతు ప్రకటిస్తూ, బిల్లు రద్దయ్యే వరకు పోరాటానికి అండగా ఉంటామని చెప్పారు. సమావేశంలో పాల్గొన్న వారు ట్రాన్స్ బిల్లు-2026పై అవగాహన కార్యక్రమం నిర్వహించి పలు డిమాండ్లు చేశారు. వాటిలో బిల్లును వెంటనే రద్దు చేయడం, నల్సా - 2014 ప్రకారం స్వీయ గుర్తింపు హక్కును పునరుద్ధరించడం, ఘరానా లు, కమ్యూనిటీ మద్దతు వ్యవస్థలను నేరంగా పరిగణించే నిబంధనలను తొలగించడం, ట్రాన్స్ పురుషులు, నాన్-బైనరీ వ్యక్తులు సహా అన్ని ప్రాంతీయ లింగ గుర్తింపులను చట్టంలో చేర్చడం వంటివి ఉన్నాయి. ఈ సమావేశంలో బి. ఏర్నా, దాస్ తదితరులు పాల్గొని ట్రాన్స్‌జెండర్ బిల్లుకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు.

## అల్కాపూర్ రోడ్ నెంబర్ 30 తవ్వకాలపై సమగ్ర విచారణ జరిపించాలి

● బీఆర్ఎస్ డిమాండ్



**రాజేంద్రనగర్, జూన్ 15 (జనంసాక్షి) :** అల్కాపూర్ టౌన్‌షిప్ రోడ్ నెం.30లో చేపట్టిన తవ్వకాల వ్యవహారంపై సమగ్ర, నిష్పాక్షిక విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని బీఆర్ఎస్ నాయకులతో కలిసి సీతారాం దూళిపాల డిమాండ్ చేశారు. సోమవారం మణికొండ, నేక్నాంపూర్ డివిజన్ల బీఆర్ఎస్ నాయకులు ప్రాంతాన్ని సందర్శించి స్థానిక సమస్యలను పరిశీలించారు.రూ.1.85 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదించిన పనికి రూ.99.43 లక్షలకు టెండర్ ఖరారైందని, అయితే వర్క్ ఆర్డర్‌లో వర్షపు నీటి కాలువ పేర్కొన్న పనిలో లోతైన తవ్వకాలు చేసి యూజీడీ, తాగునీటి పైపులు దెబ్బతిన్నాయని ఆరోపించారు. ఇప్పటికే డ్రైనేజీ వ్యవస్థ ఉన్న ప్రాంతంలో మరో స్టార్మ్ వాటర్ డ్రెయిన్ అవసరం ఏమిటని, ఇది యూజీడీ లైన్‌కు ఎందుకు అనుసంధానం చేస్తున్నారనే అనుమానాలను వ్యక్తం చేశారు.కొత్తగా వేసిన రోడ్డును మళ్లీ తవ్వడం ప్రజాధన దుర్వినియోగమేనని, ఈ వ్యవహారంలో రాజకీయ నాయకులు, సంబంధిత అధికారులు, రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ల పాత్రపై కూడా విచారణ జరిపి అక్రమాలు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. అనంతరం జయశంకర్ పార్కును పరిశీలించిన నాయకులు, వాకింగ్ ట్రాక్ వెంట విద్యుత్ దీపాలు పనిచేయకపోవడం, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండటం, పార్కు నిర్వహణ పూర్తిగా నిర్లక్ష్యానికి గురికావడం, వాచ్‌మన్‌కు నాలుగు నెలలుగా వేతనం చెల్లించకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ధూళిపాళ, గుట్టమీది నరేందర్, ఉపేంద్రనాథ్ రెడ్డి, అందే లక్ష్మణ్ రావు, షేక్ ఆరిఫ్, సుమనళిని, భాను చందర్, బొడ్డు శ్రీధర్, బిందు, శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

# జనాభా కనుగుణంగా మంచినీటిని సరఫరా చేయాలి

**నిజాంపేట్, జూన్ 15 (జనం సాక్షి) :** నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని తాగునీటి కొరత నేటి బిల్లులు ,వసూళ్లు ,ట్యాంకర్ల ద్వారా నీటి విక్రయాల పై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఆకుల సతీష్ నేతృత్వంలో ధర్నా చేపట్టి అనంతరం సోమవారం హైదరాబాద్ మెట్రోపాలిటీ వాటర్ సప్లై అండ్ సివరేజ్ బోర్డు జనరల్ మేనేజర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాంపేట్ సర్కిల్ పరిధిలో 5లక్షల జనాభా నివసిస్తున్నారని జనాభా కనుగుణంగా తాగునీటి సమస్య పై వాటర్ బోర్డు అధికారులు చర్యలు చేపట్టడం లేదని , ప్రజలకు అవసరాలకు అనుగుణంగా నిత్యం రోజుకు సుమారు 3 నుంచి5 కోట్ల లీటర్ల తాగునీటి సరఫరా అవసరం ఉన్నప్పటికీ సరిపడ తాగునీరు సప్లై చేయడం లేదని తెలిపారు. లక్షలాది రూపాయలు చెల్లించి కనెక్షన్ తీసుకున్న వినియోగదారులకు అవసరమైన కనీస తాగునీటి సరఫరా అందడం లేదని , వారానికి ఒక్కసారి మాత్రమే లేదా అత్యంత పరిమిత స్థాయిలో తాగునీరు సరఫరా చేస్తున్నప్పటికీ నెలవారి కనీస బిల్లులు వసూలు చేయడం తీవ్ర



అన్యాయంగా మారిందని తెలిపారు, పైపులైన్ లీకేజీలు పాత మోటర్లు సిబ్బంది కొరత మరమ్మతులు ల అలసత్యం కొత్త పైపు నిర్మాణాలకు వంటి సమస్యలు నీటి సరఫరా పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని తెలిపారు ఇప్పటికైనా పై అధికారులు నీటి సమస్యపై చర్యలు చేపట్టి ప్రజల సమస్యను పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# తక్షణమే ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి

**ముషీరాబాద్, జూన్ 15 (జనం సాక్షి) :** తెలంగాణా రాష్టంలో నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి కోచింగ్ సెంటర్ లలో వేల రూపాయలు ఖర్చు పెట్టి చదివి జాబ్ క్యాలెండర్ కోసం ఎదురు చూస్తున్నారనీ, ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా నిరుద్యోగ యువతతో ఆటలాడుకుంటుందని డివైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎం.డి జావీద్, సిఐటీయూ జోన్ కార్యదర్శి వెంకటేష్ లు ఆక్రోశించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గోల్కొండ క్రాస్ రోడ్ జోన్ కార్యాలయంలో భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డి వై ఎఫ్ ఐ ) ముషీరాబాద్ జోన్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎం.డి జావీద్, సిఐటీయూ జోన్ కార్యదర్శి వెంకటేష్ ముఖ్య అతిథులు హాజరైయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అధికారంలో కి రాక ముందు ఏటా రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాక. యాభై



వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని విమర్శించారు. మూడు ఏళ్లకు ఆరు లక్షల ఉద్యగాలు ఇవ్వాలని డిమాండ్ చేసారు. పోలీస్ కానిస్టేబుల్ పోస్టు 5000 నుండి 20000 వేలకు పెంచాలని కోరారు. అనంతరం ముషీరాబాద్ జోన్ నూతన కమిటీ ని ఎన్నుకున్నారు. జోన్ నూతన కమిటీ 15 మంది ఎన్నుకున్నారు. జోన్ కార్యదర్శిగా రాజయ్య, అధ్యక్షులుగా బాను కిరణ్, ఉపాధ్యక్షులుగా అన్వేష్,ప్రవీణ్,ఉమేష్ సహాయ కార్యదర్శిలుగా ప్రసాద్, గోవింద్,అనిల్ లను ఎన్నుకున్నారు.

## పాఠశాలల అభివృద్ధి లక్ష్యంగా అందరం కృషి చేద్దాం


● ఉపముఖ్యమంత్రి భట్టి



**మొయినాబాద్, జూన్ 15 (జనం సాక్షి) :** విద్యా, వైద్యంతోనే ఆర్థికాభివృద్ధి సాధ్యమని తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం కాశీంబౌలి గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన నదీమనగర్ గ్రామంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాడి రాజేందర్రెడ్డి శాలువాతో సన్మానించి విద్యార్థులతో మధ్యాహ్న భోజనాన్ని చేశారు. ఈ సందర్భంగా విచ్చేసిన జన్మదిన వేడుకల్లో భట్టి విక్రమార్క కేక్కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు వంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు గజమాలతో సన్మానించి కేక్లు కట్ చేయించడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. జన్మదిన వేడుకలు ముఖ్యం కాదని ఆయన సూచించారు. పిల్లల భవిష్యత్తే తన లక్ష్యమన్నారు. రంగారెడ్డి జిల్లాలోని నదీ మనగర్ కస్తూర్బా గాంధీ పాఠశాలలో గ్రామ సర్పంచ్ మాడి రాజేందర్రెడ్డి ఆధ్వర్యంలో తన జన్మదిన వేడుకలు జరువుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. జన్మదిన సందర్భంగా విద్యార్థులకు భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఈర్లపల్లి శంకర్, చల్లా నర్సింహ్మారెడ్డి, భీమ్ భరత్, ఎమ్మెల్సీ మహేందర్రెడ్డి, మధుసూధన్రెడ్డి, గౌరీ సతీష్, ఎలిగేవల్లి శ్రీనివాస్యాదవ్, మహేందర్ ముదిరాజ్, గడ్డం వెంకట్రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు జ్యోతి భీమ్భరత్, చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జీ భీమ్భరత్, అధికారులు పాల్గొన్నారు.

## పీఎఫ్ బకాయిలను వెంటనే జమ చేయాలి

**నిజాంపేట్ జూన్ 15 (జనం సాక్షి) :** నిజాంపేట్ సర్కిల్ లో ఉద్యోగ, కార్మికులకు వర్ష కాలం కిట్టును వెంటనే ఇవ్వాలని, నిజాంపేట్ సర్కిల్లో పని చేసే కార్మికులకు గత ఏడు నెలలుగా పెండింగ్ లో ఉన్న పిఎఫ్ బకాయిలు వెంటనే చెలించాలని ఈ మేరకు ఇతర సమస్యల పై సిఎంసీ, నిజాంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ షాబీర్ అలీ కీ



వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏఐటీయూసీ మున్సిపల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఏసు రత్నం, ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కార్మికులకు ఇచ్చే రేన్ కోట్, సబ్బులు, నూనె, గ్లౌజులు, యూనిఫామ్ డ్రస్, చెప్పులతో కూడిన కిట్ వెంటనే ఇవ్వాలని, గత ఏడు నెలలుగా పిఎఫ్ బకాయలు పెండింగ్లో ఉన్నాయని వాటిని వెంటనే చెలించాలని, గత నెల కార్మికులకు జీతంలో కొంత కోత విధించిరాని వాటిని వెంటనే సరిచేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పొన్నకంటి దస్తగిరి, బక్క మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# బీఎన్ రెడ్డి నగర్‌లో 116 ఎకరాల్లో ఆధునిక పార్కు అభివృద్ధి

**హయత్‌నగర్, జూన్ 15 (జనం సాక్షి) :** ఎల్‌బీ నగర్ నియోజకవర్గంలోని బి.ఎన్.రెడ్డి నగర్ ప్రాంత ప్రజలకు కేబీఆర్ పార్క్‌కు సమానంగా ఆధునిక సౌకర్యాలతో కూడిన విశాలమైన పార్కును అందుబాటులోకి తీసుకురానున్నట్లు టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ తెలిపారు. ఈ నెల 18న బి.ఎన్.రెడ్డి నగర్ సమీప అటవీ ప్రాంతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా వన మహోత్సవ కార్యక్రమం ప్రారంభం కానున్న నేపథ్యంలో సోమవారం మధుయాష్కి గౌడ్ సంబంధిత అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా చీఫ్ కన్జర్వేటివ్ ఆఫ్ ఫారెస్ట్స్ ప్రియాంక వర్గీస్, డీఎఫ్ఓ రోహిత్ రెడ్డి, ఏసీపీ కాశిరెడ్డితో కలిసి కార్యక్రమ స్థలాన్ని సందర్శించి, ఏర్పాట్లపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ, 116 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చెందుతున్న ఈ పార్కు ఎల్‌బీ నగర్ నియోజకవర్గ ప్రజలకు ఒక ముఖ్యమైన ఆస్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. గత మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న భూవివాదాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం పరిష్కరించి, ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. పార్కు అభివృద్ధితో పాటు రూ.20 కోట్ల వ్యయంతో బి.ఎన్.రెడ్డి నగర్ పరిసర ప్రాంతాల్లో వరదనీటి పారుదల, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి బాక్స్ డ్రెయిన్‌లు, డ్రైనేజీ లైన్ల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నగర అభివృద్ధికి తగిన ప్రాధాన్యత లభించలేదని, హైదరాబాద్‌కు కేటాయించిన నిధులు ఇతర ప్రాజెక్టులకు మళ్లించబడినట్లు విమర్శించారు. ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వం నగర ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ నిధులను సమర్థవంతంగా వినియోగిస్తోందన్నారు. జూన్ 18న సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్న సీఎం రేవంత్ రెడ్డి వన మహోత్సవ



కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పరిసర ప్రాంతాల ప్రజలకు మధుయాష్కి గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ శ్రీనివాస్, ఎఫ్‌డీఓ బాబ్జీరావు, వెంకటయ్య, ఎఫ్ఆర్‌వో శ్రీనివాస్ రెడ్డి, దాము మహేందర్ యాదవ్, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు కోసం కోటకొండ నుంచి పేట వరకు పాదయాత్ర

**నారాయణపేట జిల్లా బ్యూరో, జూన్ 15 (జనం సాక్షి) :** అప్పక్‌పల్లి – కోటకొండ –కోయిలకొండ మధ్యన అసంపూర్తిగా మిగిలిన రోడ్డును వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్,సిపిఎం,బీఎస్పీ,టి ఆర్ ఎస్ పార్టీల ఆధ్వర్యంలో సోమవారం కోటకొండ నుంచి నారాయణపేట వర కు పాదయాత్ర నిర్వహించా రు. ఈ పాదయాత్ర కోటకొండ సెంటర్ లోని భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి ప్రారంభించారు. ప్రారంభ సభకు మాస్ లైన్ పార్టీ డివిజన్ కార్యదర్శ కె.కాశీనాథ్ అధ్యక్షత వహించగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం హన్మేష్ మాట్లాడుతూ. ఈ రోడ్డును పూర్తి చేయడంలో ప్రభుత్వంగా నిర్లక్ష్యం వహి స్తునందన్నారు.ఐదు సంవ త్సరాల క్రితం ప్రారంభించిన రోడ్డు ప్రభుత్వం మారిపోయి కొత్త ప్రభుత్వం వచ్చినా కూడా పూర్తి చేయడంలో చిత్తశుద్ధి చూపడం లేదనీ అన్నారు. అందుకు స్థానిక ఎమ్మెల్యే జవాబు చెప్పాల్సి న అవసరం ఉంది అన్నారు. రోడ్డు అసంపూర్తిగా మిగిలి పోవడం వల్ల ఈ ప్రాంత విద్యార్థులకు చదువులు కొనసాగించడం ఇబ్బందిగా ఉందనీ అన్నారు ఇక్కడ నుంచి మహబూబ్నగర్, నారాయణ పేట వెల్లె వ్యాపా రస్తులైన, విద్యార్థులైన వేరే ఉపాధి



వెతుక్కునే యువకు లైన ఉద్యోగస్తులకైన చాలా ఇబ్బందిగా మారింది అన్నా రు ఆర్టీసీ వాళ్లు బస్సు నడ పాలి అంటే ఈ ప్రాంతం నుండి వచ్చే ఆదాయం కంటే బస్సు రిపేర్ కి ఎక్కువ ఖర్చు అవుతున్నది అందుకే బస్సు లు నడపడం లేదని అంటు న్నారు. ఏ ప్రాంతమైన అభి వృద్ధి చెందాలంటే ఆ ప్రాంతం లో రవాణా సౌకర్యాలు నీళ్లు ముఖ్యమైనవి కానీ ఇవి కల్పించడంలో గత ప్రభు త్వాలు నేటి ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా ఉంటున్నాయనీ అన్నారు. గత అసెంబ్లీ ఎన్ని కల్లో అన్ని పార్టీలు రోడ్డు పూర్తి చేస్తామని హామీలు ఇచ్చాయి హామీలు ఇచ్చి రెండున్నర సంవత్సరాలు అవుతున్నా కూడా వాటిని పూర్తి చేయడంలో చిత్తశుద్ధి చూపడం లేదు అన్నారు. ఇప్పటికైనా ఈ ప్రాంతంపై చిత్తశుద్ధి ఉంటే స్థానిక ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ అయినా కేంద్రంలో ఉన్నటువంటి బిజెపి ఎంపీ డీకే అరుణ అయినా ఈ రోడ్డుని పూర్తిచేసే అవకాశం ఉన్నది కానీ వాళ్లు నిర్లక్ష్యంగా ఉంటూ ప్రజలపై రాజకీ యాలు చేస్తున్నారనీ అన్నా రు. వాళ్లు చిత్తశుద్ధితో వెంట నే రోడ్డు పూర్తి చేసి ప్రాంత అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. లేనిచో ఈ ప్రాంతం లో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరిం చారు. అనంతరం జిల్లా కలె క్టర్ కు వినతి పత్రం సమర్పిం చారు.ఈ పాదయాత్రలో సిపిఐఎం జిల్లా కార్యదర్శి వెంకట్ రాంరెడ్డి, మాస్ లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి బి.రాము, తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్, తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి శివ వీరన్న, జిల్లా అధ్యక్షులు కృష్ణ, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు బొదిగల శ్రీనివాస్, మద్దతు ప్రకటిస్తూ మాట్లాడారు. కోటకొండా మాజీ ఎంపీటీసీ లు సునీత, సరళ, మాస్ లైన్ పార్టీ జిల్లా నాయకులు జయ, బోయిన్ పల్లి రాము, యాదగిరి, బి.నరసింహ పి.రామకృష్ణ, కొండ నరసిములు, చెన్నారెడ్డి, డివిజన్ నాయకులు హాజీ, ఎదిరింటి నర్సింలు, ప్రతాప్, వెంకట్రములు, అంజి, బాలకృష్ణ, ప్రశాంత్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాల కన్న ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య

● ఎంఈఓ సత్యనారాయణ



**తూప్రాన్, జూన్ 15 (జనం సాక్షి) :** ప్రైవేట్ పాఠశాల కన్నా ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన లభిస్తుందని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఎంఈఓ సత్యనారాయణ తెలిపారు. తూప్రాన్ మున్సిపల్ నాలుగో వార్డ్ పరిధిలోని పుట్టకోట ప్రైమరీ పాఠశాల లో పుస్తకాల పంపిణీ చేసిన సందర్భంగా మాట్లాడారు ప్రైమరీ పాఠశాలను జిల్లాలోని ఆదర్శ పాఠశాల గా నిలవడానికి కృషి చేయాలని అన్నారు. నాలుగో వార్డ్ కౌన్సిలర్ జైపాల్ రాథోడ్ పాఠశాలలకు అందిస్తున్న సేవలను అభినందించారు. 4వ వార్డు కౌన్సిలర్ జైపాల్ రాథోడ్, మాట్లాడుతూ జిల్లాలోని ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో అన్ని సదుపాయాలు ఉన్నాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య ఉంటుందని ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు చేర్పించాలని జిల్లాలోనే ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దాలని స్కూల్ ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్ ఉపాధ్యాయులు పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలి



**జడ్చర్ల, జూన్ 15 (జనంసాక్షి) :** ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను నిలువునా దోచుకుంటున్నాయని, వీటిని వెంటనే నియంత్రించాలని బీసీ జాగృతి సేన నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణిలో జడ్చర్ల తహసిల్దార్ నర్సింగ్ రావుకు ఈ మేరకు వారు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ జాగృతి సేన మండల అధ్యక్షులు గొడుగు నర్సిములు మాట్లాడుతూ ప్రైవేట్ యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. చాలా పాఠశాలలకు కనీస వసతులు కూడా లేవని, నిబంధనలకు విరుద్ధంగా ఫస్ట్ ఫ్లోర్ లలో తరగతులను నిర్వహిస్తున్నారని విమర్శించారు. విద్యా హక్కు చట్టం ప్రకారం నిరుపేద విద్యార్థులకు కల్పించాల్సిన 20 శాతం ఉచిత ప్రవేశాలను అమలు చేయడం లేదని, పాఠశాలల్లోనే పుస్తకాలు, యూనిఫాంలు అమ్ముతూ అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పాఠశాలలను పర్యవేక్షించి, నిబంధనలు పాటించని యాజమాన్యాలపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో బీసీ జాగృతి సేన జిల్లా నాయకులు మాచారం శ్రీనివాస్, కార్మిక విభాగం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సురభి విజయ్ కుమార్, మండల కార్యదర్శులు సురభి రఘు, చెన్నయ్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియలో బీఎల్ఏ-2లు కీలకంగా వ్యవహరించాలి

- క్షేత్రస్థాయిలో సరైన రీతిలో పని చేయాలి
- అలసత్వం వహిస్తే అడ్మినిస్ట్రేషన్‌కి ఇబ్బంది
- వనపర్తి డిసిసి చీఫ్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి



**వనపర్తి బ్యూరో, జూన్ 15 (జనంసాక్షి) :** కేంద్ర ఎన్నికల సంఘం సర్ (స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్) ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (శితీ) ప్రత్యేక సమగ్ర పునఃసమీక్ష పై బిఎల్ఎ–2 సభ్యులు కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుందని వనపర్తి డిసిసి చీఫ్ యువసేన రెడ్డి సూచించారు.సోమవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా, పట్టణ, మండల అధ్యక్ష కార్యవర్గ సభ్యులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయిలో పనిచేయాల్సిన విధి విధానాలను, నూతనంగా నియమించిన పట్టణ మండల అధ్యక్షులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డిసిసి చీఫ్ శివసేన రెడ్డి మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాలలో ప్రతి ఒక్క కార్యకర్తను అక్కున్న చేర్చుకొని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఎవరికైనా ఇబ్బందులు వచ్చినా వారిని సైతం కలుపుకొని ముందుకెళ్లాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఏ ఎన్నికలు వచ్చినా, అసెంబ్లీ, మున్సిపల్, సర్పంచ్ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు కాంగ్రెస్ పార్టీ ఫలితాలు మళ్లీ పునరావృతం అవుతాయని ధీమా వ్యక్తం చేశారు. బిఆర్ఎస్, బిజెపి పార్టీల ద్వంద వైఖరి ఒకటేనని, ఆ పార్టీ నాయకులు చేస్తున్న ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తిప్పుకొట్టాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల నుంచి అధిష్టానం వరకు ప్రతిపక్షం నాయకులు ఎవరైనా అనుచిత వ్యాకలు చేస్తే ఉపేక్షించేది లేదని, వారి మాటలను ఖండిస్తూ కౌంటర్ చేయాలని అన్నారు. అనంతరం కొత్తకోట పట్టణ,మండల, మదనపురం మండల అధ్యక్షుల ఎన్నికైన వారికి నియమక పత్రం అందజేశారు.ఈ సమీక్ష సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఐ సత్య రెడ్డి, కోళ్ల వెంకటేష్, శరవంద, మన్యం, బి.కృష్ణ ,పట్టణ అధ్యక్షులు కదిరే రాములు, సహదేవు, దయాకర్ రెడ్డి, రామ్ రెడ్డి, సుఖేందర్ రెడ్డి, విష్ణు ముదిరాజ్, రవి కిరణ్, బోయెజ్ పలువురు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

● జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి, జూన్ 15 (జనం సాక్షి) :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులు, వినతులను సమగ్రంగా పరిశీలించి త్వరిత గతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంగీతతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో అందిన ప్రతి అర్జీని సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిశీలించాలని సూచించారు. ప్రజావాణిలో అందిన ప్రతి వినతిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ఎలాంటి జాప్యం చేయరాదని చెప్పారు. అందిన ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని వివిధ డివిజన్లు మరియు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 62 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. అందులో కలెక్టరేట్‌లో 31, సంగారెడ్డి డివిజన్‌కు 15, ఆందోల్ డివిజన్‌లో 0, నారాయణఖేడ్ డివిజన్‌లో 10, జహీరాబాద్ డివిజన్‌లో 6 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా సేవలు అందించాలి

● ఎస్పీ డాక్టర్ వినీత్



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూన్ 15 (జనం సాక్షి) :** పోలీసు అధికారులు ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలని నారాయణపేట ఎస్పీ డాక్టర్ వినీత్ సూచించారు.ఇటీవల పోలీస్ స్టేషన్ లకు నూతన ఎస్‌హెచ్ఓలుగా బాధ్యతలు స్వీకరించిన దామరగిద్ద ఎస్ఐ నరేష్, కోస్గి ఎస్ఐ పురుషోత్తం సోమవారం జిల్లా పోలీసు కార్యాలయం లో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలను అందజేశారు. అనంతరం నూతన బాధ్యతలు చేపట్టిన అధికారులకు అభినందనలు తెలియజేసి, తమ విధులను అంకితభావంతో నిర్వహించాలని సూచించారు. మండల పరిధిలో శాంతిభద్రతల పరి రక్షణకు అత్యంత ప్రాధాన్య త ఇవ్వాలని, ప్రజలకు ఎల్ల ప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించే విధం గా పనిచేయాలని సూచించా రు. గ్రామాలు, పట్టణాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, నేరాలు, శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశిం చారు.ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ కమ్యూనిటీ పోలీసింగ్‌ను మరింత బలో పేతం చేయాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదు దారునికిమర్యాదపూర్వకంగా స్పందించి న్యాయం జరి గేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళలు, బాలికలు,వృద్ధులు,బలహీన వర్గాల భద్రతకు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అదేవిధంగా సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవా ణా, చోరీలు, భూ వివాదా లు, రోడ్డు ప్రమాదాల నివా రణ వంటి అంశాలపై ప్రత్యేక నిఘా ఉంచి ప్రజల్లో అవగా హన కార్యక్రమాలు నిర్వహిం చాలని సూచించారు. ప్రజల విశ్వాసాన్ని పొందే విధంగా పారదర్శకంగా విధులు నిర్వ ర్తించాలని ఎస్పీ పేర్కొన్నారు.

## క్షేత్రస్థాయిలో ఆరోగ్య సేవలను బలోపేతం చేయాలి



**జడ్చర్ల, జూన్ 15 (జనంసాక్షి) :** క్షేత్రస్థాయిలో ఆరోగ్య సేవలను బలోపేతం చేయాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా సిబ్బంది పని చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. ఏ. శ్రీనివాసులు సూచించారు. సోమవారం గంగాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పోలేపల్లి ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి డా. మనుప్రియ, ఎంఎల్ హెచ్‌పి, ఏఎన్ఎంలతో కలిసి ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా ఐదేళ్ల లోపు పిల్లలకు అతిసార వ్యాధి సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఆహార పరిశుభ్రత, సురక్షిత తాగునీరు, పరిసరాల పరిశుభ్రతపై విస్తృత అవగాహన కల్పించాలని, ఆరోగ్య కేంద్రంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలను నిరంతరం అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అనంతరం ఈ నెల 28న నిర్వహించ బోయే పల్స్ పోలియో కార్యక్రమంపై రూపొందించిన ప్రణాళికలను సమీక్షించారు. ఉపకేంద్రం నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. శివకాంత్, గంగాపూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి డా. మనుప్రియ, ఎంఎల్ హెచ్‌పి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడిలో నాణ్యమైన బోధన



పాపన్నపేట, జూన్ 15 (జనంసాక్షి) : వేసవి సెలవులు ముగిశాక తొలి రోజు బడి గంట మోగి వినూత్న రీతిలో పాఠశాల ప్రారంభమైంది. సోమవారం పాపన్నపేట ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి ప్రతాపరెడ్డి,ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్ విద్యార్థులకు గులాబీ పూలు అందజేసి స్వాగతం పలికారు. పాఠ్య పుస్తకాలు,పెన్నులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ..విద్యార్థులకు నాణ్యమైన విద్య ప్రభుత్వ బడిలోనే అందుతుందన్నారు. విద్యావంతులైన ఉపాధ్యాయుల బోధన ప్రభుత్వ బడిలో ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు వెంకటేశం,అంజాగౌడ్, ప్రవీణ్, నాగరాజు, మంగ నర్సింలు,రమేష్, యాదయ్య,మోహన్ రావ్, నింగప్ప, రియాజ్, కృష్ణకాంత్,రవికాంత్,ఇందిరా,పద్మ తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



**పెద్ద శంకరంపేట, జూన్ 15 (జనం సాక్షి) :** ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని మండల విద్యాధికారి వి. శేఖర్ అన్నారు. సోమవారం పెద్ద శంకరంపేటలోని మండల వనరుల కేంద్రంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మధ్యాహ్న భోజన కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలో మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. పాఠశాలలో పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మధ్యాహ్నం భోజన కార్మికులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్య కోసం సమిష్టి కృషి అవసరం

● డీఈఓ విజయ కుమారి




**జడ్చర్ల, జూన్ 15 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధుల సమిష్టి కృషి ఎంతో కీలకమని, అందరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా విద్యాధికారిని ఐ. విజయ కుమారి పిలుపునిచ్చారు. సోమవారం జడ్చర్ల మండలంలోని పలు పాఠశాలలను ఆమె సందర్శించి, విద్యా కార్యక్రమాల అమలును సమీక్షించారు. పర్యటనలో భాగంగా పోలేపల్లి పాఠశాలలో జరిగిన స్కూల్ అసెంబ్లీలో పాల్గొన్న డీఈఓ, 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠ్యపుస్తకాలు మరియు నోట్‌బుక్స్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం జెడ్పీహెచ్ఎస్ గంగాపూర్ పాఠశాలలో తరగతి బోధనను పరిశీలించి, నాణ్యమైన విద్యపై ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. రామస్వామి గుట్ట తండా పాఠశాలలో అందుబాటులో ఉన్న బోధన అభ్యాస సామగ్రిని, గ్రామస్థుల సహకారాన్ని ఆమె ప్రత్యేకంగా ప్రశంసించారు. చివరగా జెడ్పీహెచ్ఎస్ పెద్ద ఆదిరాల పాఠశాలలో ఎస్ఎస్‌సీ జిల్లా టాపర్ ఆరాధ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ కె. మంజులా దేవి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# జడ్చర్ల నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**జడ్చర్ల, జూన్ 15 (జనంసాక్షి) :** నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడంతో పాటు, జడ్చర్లను ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం జడ్చర్ల పట్టణంలోని చంద్ర గార్డెన్స్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై బూత్ లెవల్ ఏజెంట్ల అవగాహన, శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తోందని, అభివృద్ధి పనులకు అడ్డంకులు సృష్టించే శక్తులను ప్రజలే తిప్పికొడతారని హెచ్చరించారు. ఉదండాపూర్ ప్రాజెక్టు విషయంలో గత ప్రభుత్వం వ్యవహరించిన నిర్లక్ష్య ధోరణి వల్లే ప్రాజెక్టు ఆలస్యమైందని ఎమ్మెల్యే విమర్శించారు. మాజీ ఎమ్మెల్యేలు, అప్పటి మంత్రులు పాలమూరు ప్రాజెక్టులపై చిత్తశుద్ధితో వ్యవహరించి ఉంటే, ఈ పాటికే పనులు పూర్తయ్యేవని అన్నారు.



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన వెంటనే ప్రాజెక్టు భూ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి రూ. 631 కోట్లు మంజూరు చేసి, రైతుల పట్ల తమకున్న నిబద్ధతను చాటుకున్నారని తెలిపారు. జడ్చర్లకు అత్యంత అవసరమైన బైపాస్ రోడ్డు, రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం తాను ఇప్పటికే ముఖ్యమంత్రికి ప్రతిపాదనలు పంపానని, త్వరలోనే వీటిపై సానుకూల నిర్ణయం రానుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ జీవితంలో 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఉమ్మడి మిడ్జిల్, ఉర్కొండ మండలాలకు భారీ అభివృద్ధి నిధులు కేటాయించనున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా జూలై 4 లేదా 5వ తేదీన మిడ్జిల్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే రంగనాయకస్వామి గుట్టపై ప్రతిష్టాత్మక ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, దీనిని అడ్డుకోవాలని చూడటం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా బిఎల్ఏల బాధ్యత ఎంతో కీలకమని, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చూడాలని ఎమ్మెల్యే కోరారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త సమన్వయంతో పని చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సీఎం ప్రవాసి ప్రజావాణి రాష్ట్ర కోఆర్డినేటర్, మహబూబ్ నగర్ పార్లమెంట్ ఎస్ఐఆర్ ప్రోగ్రామ్ ఇంచార్జ్ బొజ్జ అమరేందర్ రెడ్డి, నాయకులు, ప్రజా ప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోలియో రహిత జనగామ లక్ష్యంగా పటిష్ట ఏర్పాట్లు చేయాలి

- పల్స్ పోలియో 2026 విజయవంతానికి సమగ్ర కార్యాచరణ రూపొందించాలి
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ ప్రతినిధి, జూన్ 15(జనంసాక్షి):** పోలియో రహిత జనగామ లక్ష్యంగా పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. సోమవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోంతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధ్యక్షతన జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం -2026 నిర్వహణపై జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 0-5 సంవత్సరాల వయసు గల 33,651 మంది పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయుట లక్ష్యంగా నిర్ణయించామన్నారు. అదనంగా 277 మంది వలస పిల్లలనూ గుర్తించి టీకా కార్యక్రమంలో చేర్చేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమం కోసం జిల్లాలో 293 పోలియో బూత్‌లు, 29 రూట్లు, 29 రూట్ సూపర్వైజర్లు, 16 మొబైల్ బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 94 అధిక ప్రమాద ప్రాంతాలను గుర్తించి, ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు. కార్యక్రమం నిర్వహణకు 1,172 మంది టీకా సిబ్బంది నియమించామని, ప్రతి బూత్ వద్ద నలుగురు సిబ్బంది విధులు నిర్వహిస్తారన్నారు. అదనంగా 15 ట్రాన్సిట్ పాయింట్లు ఏర్పాటు చేసి, ప్రయాణికుల పిల్లలకు కూడా పోలియో చుక్కలు అందించనున్నారన్నారు. జిల్లాకు అవసరమైన 2,103 వైల్స్, 33,651 డ్రాం డోసులు అందుబాటులో ఉంచి, కోల్డ్ చైన్ నిర్వహణ, వ్యాక్సిన్ రవాణా, సిబ్బంది శిక్షణ, పర్యవేక్షణ, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామస్థాయి, వార్డ్ స్థాయిలో టీంలను ఏర్పాటు చేసి టామ్ టామ్ వేపించి పోలియో కార్యక్రమం విజయవంతంగా జరిగేలా చూడాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి, జిల్లాలో గల అర్హత కలిగిన ప్రతి చిన్నారికి పల్స్ పోలియో చుక్కలు వేయించి, పోలియో రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని కలెక్టర్ పిలుపుని చ్చారు. ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ మల్లికార్జున రావు, విద్యా శాఖ ఏడీ శ్రీనివాస్, డీపీఓ వెంకట్ రెడ్డి, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు కొండంత ఆశతో...

- న్యాయం జరుగుతుందన్న నమ్మకం
- సమస్యలు తీరుతాయన్న విశ్వాసం
- వరంగల్ కలెక్టరేట్ గ్రీవెన్స్ లో దరఖాస్తుదారుల సందడి
- ఎంతో ఓపికగా సమస్యలు వింటున్న కలెక్టర్





**వరంగల్ బ్యూరో, జూన్ 15 (జనం సాక్షి) :** వరంగల్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణం సోమవారం గ్రీవెన్స్ సందర్భంగా దరఖాస్తుదారులతో సందడిగా మారింది. వరంగల్ జిల్లా నలుమూలల నుండి వందలాదిమంది ఉదయం 9 గంటలకే కలెక్టరేట్కు చేరుకోవడం కనిపించింది. తమ బాధలు, సమస్యలు, జిల్లా కలెక్టర్కు విన్నవించాలనే సంకల్పంతో వినతి పత్రాలతో దరఖాస్తుదారులు రావడం జరిగింది. ఏండ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్నటువంటి తమ సమస్యలను కలెక్టర్, ఇతర ఉన్నతాధికారుల సమక్షంలో చెప్పడం ద్వారా తమకు సత్వర న్యాయం జరుగుతుందని, సమస్యలు పరిష్కారం అవుతాయని ఆత్మవిశ్వాసంతో వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు, యువత, రైతులు, కార్మికులు, కూలీలు మొదలైన అన్ని వర్గాలకు చెందిన వారు దరఖాస్తులతో వచ్చి లైన్ లో నిలబడి నెంబర్ వేయించుకొని గంటల తరబడి ఓపికగా కూర్చోవడం ప్రతి సోమవారం జరుగుతుంది. ప్రతి సోమవారం గ్రీవెన్స్కు సుమారు వందకు పైగా దరఖాస్తులు రావడం జరుగుతుంది. వచ్చిన వందలాదిమంది దరఖాస్తుదారులు లోపల హాల్లో అధికారులతో పాటు కూర్చోవడం, బయట చెట్ల కింద, షెడ్డు కింద, కాన్ఫరెన్స్ హాల్ మెట్లమీద , ఎదురుగా ఉన్న కలెక్టరేట్ భవనం మెట్లమీద కూర్చోవడం జరుగుతుంది. కలెక్టర్ తమ బాధలను తీరుస్తారని కొండంత ఆశతో వారు ఎంతసేపైనా కూర్చోవడం కనిపించింది. వారికి తాగునీరు ఇతర సదుపాయాలు కూడా ఉన్నాయి.

**ఇలాంటి సమస్యలే ఎక్కువ**


తాము అర్హులమని తమకు వృద్ధాప్యం, దివ్యాంగుల, ఒంటరి మహిళ మొదలైన పింఛన్లు ఇవ్వాలని కొందరు, తమ కొడుకులు కోడళ్ళుతమనుపట్టించుకోవడంలేదని, తిండి పెట్టడం లేదని, ఇంట్లో నుంచి తమను గెంటి వేశారని మరి కొందరు, తమ ఆస్తిని వేరే వాళ్ళ వారి పేరు మీద అక్రమంగా రాసుకున్నారని కొందరు, తమకు ఉద్యోగం ఉపాధి లేదని ఉపాధి మార్గం చూపించాలని కొందరు కలెక్టర్ ను వేడుకోవడం జరుగుతుంది. అదేవిధంగా భర్త తనను నిత్యం వేధిస్తున్నాడని అతని నుండి రక్షణ కావాలని కొందరు, ఇందిరమ్మ గృహాలు కావాలని, ఊర్లలో విచ్చలవిడిగా బెల్ట్ షాపుల నిర్మాణ వల్ల కలుగుతున్న బాధలను పరిష్కరించాలని, తమ ఊరు, కాలనీలలో రోడ్డు మోరీలు సౌకర్యాలు కల్పించాలని కొందరు, కిందిస్థాయి అధికారులు తమ సమస్యలు పరిష్కరించడం లేదని మరికొందరు, ఆస్తి తగాదాలు తీర్చాలని కొందరు, తమ ఊరికి ప్రాంతానికి వైద్యారోగ్య సౌకర్యాలు కలిగించాలని ఇంకొందరు, ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో సమస్యలతో కలెక్టర్కు విన్నవించేందుకు నిత్యం కలెక్టరేట్ గ్రీవెన్స్ కు రావడం జరుగుతుంది. సమస్యలు పరిష్కారం కాకపోతే అదే సమస్యల తోటి మళ్లీమళ్లీ గ్రీవెన్స్ లో ఇవ్వడం కూడా జరుగుతుంది.

**ఎంతో ఓపికగా సమస్యలు వింటున్న కలెక్టర్**

వరంగల్ జిల్లా నలుమూలల నుండి వివిధ రకాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాలతో వస్తున్న వందలాది మంది దరఖాస్తులను పరిశీలిస్తూ ఎంతో ఓపికగా సమాధానం ఇవ్వడమే కాకుండా అప్పటి కప్పుడు పరిష్కారం అయ్యే సమస్యలను పరిష్కరిస్తూ వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద దరఖాస్తుదారులకు అభయ మిస్తున్నారు. అంతేకాకుండా ఆయా శాఖల అధికారులకు సంబంధిత సమస్యలను సత్వరమే పరిష్కరించాలని చెబుతున్నారు. పక్కనే ఉన్నటువంటి ఆర్డీఓ ఆఫీసులో కూడా జరుగుతున్న గ్రీవెన్స్ కు పలు దరఖాస్తులను పంపించడం జరుగుతుంది. దీంతో దరఖాస్తుదారుల్లో నమ్మకం పెరుగుతుంది. తమకు న్యాయం జరుగుతుందన్న విశ్వాసం కలుగుతుంది. అందుకే ప్రతి సోమవారం గ్రీవెన్స్కు వచ్చే వాళ్ళ సంఖ్య కూడా పెరుగుతుంది.

# కేటీకే-5 గనిలో బ్లాస్టింగ్ ప్రమాదం

- కార్మికుడికి గాయాలు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-5 గనిలో పెద్ద ప్రమాదం తప్పింది. బొగ్గు ఉత్పత్తి కోసం బ్లాస్టింగ్ చేస్తుండగా మందుగుండు చేతిలోనే పేలింది. గని లోపల 13వ లెవెల్‌లో ఈ ఘటన జరిగింది. షార్ట్ ఫైరర్‌గా పనిచేస్తున్న శ్రీరాముల ప్రదీప్ చేతిలో పూర్ణిమ అకస్మాత్తుగా పేలింది. దీంతో ప్రదీప్ ఎడమ చేతికి తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే తోటి కార్మికులు స్పందించారు. గాయపడిన ప్రదీప్‌ను వెంటనే భూపాలపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడికి వైద్యం అందుతోంది. విషయం తెలుసుకున్న సింగరేణి ఉన్నతాధికారులు గనికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరుపై విచారణ చేపట్టారు. భద్రతా నిబంధనలు పాటించారా లేదా అనే కోణంలో ఆరా తీస్తున్నారు. కెటికె-5 గనిలో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. గని కార్మికుల భద్రతపై అధికారులు మరింత దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

# ప్రజావాణిలో దరఖాస్తులకు సత్వర పరిష్కారం

- ఆలస్యం చేస్తే చర్యలు తప్పవు
- అదనపు కలెక్టర్ అశోక్ కుమార్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ప్రజావాణిలో దరఖాస్తులకు సత్వర పరిష్కారం చూపాలని, ఆలస్యం చేస్తే చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఐడిఓసి కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ ప్రజావాణిలో వచ్చిన 66 దరఖాస్తులు స్వీకరించారు. ఆయా శాఖల అధికారులకు దరఖాస్తులు ఎండార్స్ చేసి పరిష్కార బాధ్యత అప్పగించారు. ప్రజలు ఇచ్చిన దరఖాస్తులు జాప్యం కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తును అధికారులు స్వయంగా పరిశీలించి పరిష్కరించాలని స్పష్టం చేశారు. వచ్చే సోమవారం లోపు అందిన ప్రతి దరఖాస్తుకు పరిష్కారం చూపాలని గడువు విధించారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అందిన ప్రతి దరఖాస్తు ప్రజావాణి పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. దరఖాస్తుదారునికి రశీదు ఇవ్వాలని ఆదేశించారు. దీనివల్ల సమస్య పరిష్కారంలో పారదర్శకత వస్తుందని తెలిపారు. అన్ని శాఖల అధికారులు తీసుకున్న చర్యల వివరాలు కూడా పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ప్రజావాణి దరఖాస్తులను ప్రాధాన్యతగా తీసుకుని నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. పరిష్కారంలో ఆలస్యం జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిఆర్ఓ వసంత కుమారి, ఆర్డిఓ హరికృష్ణతో పాటు ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కాగజ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

- శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.
- పోలీస్ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచన



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 15(జనంసాక్షి ):** కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్ సోమవారం కాగజ్ నగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలు, లాకప్ రూమ్, రిసెప్షన్, బెల్ ఆఫ్ ఆర్మ్స్ రూమ్, స్టోర్ రూమ్, నమోదు చేసిన రికార్డులు, పెండింగ్ కేసుల పురోగతి, స్టేషన్ హాజరు రిజిస్టర్, స్టేషన్ శుభ్రత తదితర విభాగాలను పరిశీలించారు. ఎస్పీ ఎస్‌హెచ్ఓ సందీప్ కుమార్ తో , స్టేషన్ సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి పోలీసు సిబ్బందీ ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో చట్టవ్యతిరేకచర్యలు, అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణా, మాదకద్రవ్యాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదిదారుడితో, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని అన్నారు. మహిళలు, బాలికల భద్రతకు సంబంధించిన కేసుల్లో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, లా అండ్ ఆర్డర్ విషయంలో రాత్రిపూట పర్యవేక్షణ, పికెటింగ్, ప్యాట్రోలింగ్‌ను కచ్చితంగా కొనసాగించాలని సూచించారు. ప్రజాభద్రతకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వెంట కాగజ్ నగర్ డిఎస్పీ వాహిదుద్దీన్ ఉన్నారు.

# పోలియో రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలి

- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్



**హనుమకొండ ప్రతినిధి, జూన్ 15 (జనంసాక్షి) :** పోలియో నిర్మూలనతో పాటు చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా చేపడుతున్న పల్స్ పోలియో, స్టాప్ డయేరియా క్యాంపెయిన్, జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాలను అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశానికి అధ్యక్షత వహించిన కలెక్టర్, ఆయా కార్యక్రమాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని 0-5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా వలస కార్మికులు నివసించే ప్రాంతాలు, ఇటుక బట్టీలు, నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాలు వంటి అధిక ప్రమాద ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాం కుమార్ మాట్లాడుతూ, జూన్ 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంలో జిల్లాలోని 84,298 మంది 0-5 సంవత్సరాల పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం 472 పోలియో బూత్‌లు, మొబైల్ బృందాలు, ట్రాన్సిట్ పాయింట్లు, అధిక ప్రమాద ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రవి, డి ఆర్ ఓ శ్రీనివాస్, జెడ్పీ సీఈఓ శేషాద్రి పంచాయతీరాజ్, మహిళా మరియు శిశు సంక్షేమ, విద్యాశాఖ, గిరిజన సంక్షేమ, బీసీ సంక్షేమ, ఎస్సీ సంక్షేమ శాఖల అధికారులు, ఇంటర్మీడియట్ విద్యాశాఖ, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు..

**ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో జాప్యానికి తావివ్వొద్దు**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించి ప్రజలకు త్వరితగతిన సేవలు అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా ప్రజల నుంచి అందిన దరఖాస్తుల నమోదు, పరిష్కార ప్రక్రియపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించిన వెంటనే వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రవి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, జెడ్పీ సీఈఓ శేషాద్రి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

- వర్షాకాలానికి పూర్తి సంసిద్ధతతో అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- పెన్షన్లు, తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి
- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు ప్రతినిధి, జూన్ 15(జనంసాక్షి) :** జిల్లాలో వివిధ దశలలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో వేగం పెంచాలని, వర్షాకాలానికి పూర్తి సంసిద్ధతతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, పెన్షన్లు, తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి అని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తన ఛాంబర్‌లో, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతి, నూతన పెన్షన్ల మంజూరు, వన మహోత్సవం, గ్రామాల పారిశుద్ధ్యం, వర్షాకాలం సంసిద్ధత అప్రమత్తత,తాగునీటి సరఫరా, వన మహోత్సవం మొక్కల పెంపకం,తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో ఎక్కడా జాప్యం లేకుండా పనులను వేగవంతం చేయాలని, లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తూ నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. ప్రత్యేక ప్రజా దర్బార్, ప్రజావాణి కార్యక్రమంలో పెన్షన్ల మంజూరు కోసం అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పారదర్శకంగా పరిశీలించి అర్హుల జాబితా సిద్ధం చేసి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. వర్షాకాలంలో ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా వెంటనే స్పందించే విధంగా ముందస్తు కార్యాచరణ సిద్ధంగా ఉంచాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు, చెరువులు, కుంటలు, వాగులు, కల్వర్టుల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రమాదకర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాలను ముందుగానే గుర్తించి, లోతట్టు ప్రాంతాల నుంచి గర్భిణీ స్త్రీలను ఇతర సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. మేడారం పరిసర ప్రాంతాలలో విస్తృత స్థాయిలో మొక్కలు నాటి వాటి సంరక్షణకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజలకు మెరుగైన సేవలందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అధికారులు సమన్వయంతో పని చేసి జిల్లాను అన్ని రంగాల్లో ముందంజలో నిలపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, డిపిఓ వెంకయ్య, హౌసింగ్ పీడీ సూర్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ సంపత్, ఎంపీడీవోలు, ఎంపీఓలు, అధికారులు పాల్గొన్నారు.

# ఫిట్నెస్ లేకుండా బస్సులు నడపొద్దు

- మూడు స్కూల్ బస్సుల సీజ్
- ఎంవిఐ శోభన్ బాబు



**వరంగల్ ఈస్ట్, జూన్ 15 (జనం సాక్షి) :** ఫిట్నెస్ లేకుండా స్కూల్ బస్సులు రోడ్డు మీద తిరిగితే కేసులు రాసి సీజ్ చేస్తామని వరంగల్ ఎం వి ఐ శోభన్ బాబు హెచ్చరించారు. వరంగల్ నగరంలోని నాయుడు పెట్రోల్ బంక్ జంక్షన్, ఉర్సు గుట్ట గట్టుపల్లి జంక్షన్ ప్రాంతాలలో సోమవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు ఎంవి ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఫిట్నెస్ లేని రెండు బస్సులతో పాటు , సరైన పత్రాలు లేని ఒక బస్సును మొత్తం మూడు బస్సులను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో సుమారు 400 పైన పాఠశాల బస్సులు ఉన్నాయని, ఇప్పటివరకు సుమారు 320 వరకు బస్సులు ఫిట్నెస్ అయినట్లు తెలిపారు. మిగతా బస్సులు ఫిట్నెస్ చేయించుకోవాలని కోరారు. ప్రతిరోజు తనిఖీలు ఉంటాయని ఎంవీఐ శోభన్ బాబు తెలిపారు.

# ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి


- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్, జూన్ 15 (జనంసాక్షి) :** ప్రజావాణి దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్ కు సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వంగిన కరెంటు స్తంభాలు

**రైతుల ప్రాణాలకు ముప్పు**



**చిట్యాల, జూన్ 15 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని కైలాపూర్ గ్రామ శివారు శాంతినగర్ ప్రాంతంలో రైతుల భూముల్లో ప్రమాదం ముంచుకొస్తోంది. దాదాపు రెండు సంవత్సరాలుగా సపోర్ట్ వైర్లు తెగిపోవడంతో కరెంటు స్తంభాలు వంగిపోయి ప్రమాదకరంగా నిలిచాయి. ఇలాంటి స్తంభాలు ఒకటి కాదు, దాదాపు 10 వరకు ఉండటం పరిస్థితి తీవ్రతను చూపుతోంది. వర్షాకాలంలో పంటలు పండించే సమయంలో ఈ వంగిన స్తంభాలు ఎప్పుడైనా కూలే ప్రమాదం ఉందని రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటి నుంచో ఫిర్యాదు చేస్తున్నాం.. కానీ ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇలా ఉంటే ఎప్పుడైనా ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉంది అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి స్తంభాలను సరిచేయాలని, లేదంటే పెద్ద ప్రమాదం తప్పదని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
16 జూన్ 2026

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు

**● హౌసింగ్ కార్పొరేషన్ ఎండి. గౌతమ్**

**యాదాద్రి కరస్పాండెంట్, జూన్ 15 (జనం సాక్షి) :** అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడం జరుగుతుందని హౌసింగ్ కార్పొరేషన్ ఎండి గౌతమ్ అన్నారు. సోమవారం భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో సింగన్న గూడెం గల డబుల్ బెడ్ రూమ్‌లు, తుర్కపల్లి మండలం వాసాలమర్రి, కొండా పురం, భువనగిరి మండలం అనంతారం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావుతో కలసి, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను,ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అయన గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల అమలు పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. సింగన్నగూడెంలోని డబుల్ బెడ్ రూమ్ పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు త్వరితగతిన అందజేయాలన్నారు. అనంతరం తుర్కపల్లి మండలం వాసాలమర్రి, కొండా పురం, భువనగిరి



మండలం అనంతారం గ్రామంలో మొత్తం ఎన్ని ఇళ్లు మంజూరీ చేయడం జరిగిందని, వాటిలో ఎన్ని పూర్తయ్యాయని , ప్రస్తుతం ఎన్ని ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయని, ఇంకా ఎన్ని ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాలేదో వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారుల ఇళ్లను సందర్శించి పరిశీలించారు.. ప్రభుత్వం అందించిన సహాయంతో సొంత ఇంటి కల నేర వేరిందా అని హౌసింగ్ కార్పొరేషన్ ఎండి గౌతమ్ లబ్ధిదారులతో ముచ్చటించారు. గ్రామాలలో పూరిగుడిసే, డేరా, మట్టి గోడల, రేకుల షేడ్ లలో నివసించే వారిని గుర్తించాలన్నారు. అట్టివారికి కూడా ఇందిరమ్మ ఇండ్లను మంజూరీ చేయాలనీ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆగమ్మ ఇంటిని సందర్శించిన అధికారులు ఆమెతో మాట్లాడారు. ఇప్పుడు మీ సొంత ఇల్లు నిర్మించుకున్నారు కదా, ఎలా అనిపిస్తోంది అని అడగగా, ఆగమ్మ ఆనందం వ్యక్తం చేశారు. చాలా సంతోషంగా ఉందని ఎన్నో సంవత్సరాలుగా సొంత ఇల్లు ఉండాలనే కల ఉండేదని ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ కల నెరవేరిందని ఇప్పుడు భద్రంగా, గౌరవంగా మా సొంత ఇంట్లో నివసిస్తున్నాం ఇందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు అని ఆమె తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసి అర్హులందరికీ గృహ సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ అలివేలు, ఎంపీడీవోలు, ఏఈలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## టెట్ పరీక్షలకు సర్వం సిద్ధం



**కొత్తగూడెం, జూన్ 15 (జనంసాక్షి) :** జిల్లాలో నిర్వహించనున్న టీజీ టెట్ జూన్ – 2026 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 16 నుండి జూన్ 22 వరకు మొత్తం ఐదు రోజుల పాటు పది సెషన్లలో ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 1,217 మంది అభ్యర్థులు టెట్ పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం పాల్వంచలోని అనుబోస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీను పరీక్షా కేంద్రంగా ఎంపిక చేసి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. పరీక్షా కేంద్రంలో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్, ఇంటర్నెట్, తాగునీరు, భద్రతా ఏర్పాట్లు, వైద్య సదుపాయాలు తదితర ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. అభ్యర్థులు పరీక్ష సమయానికి ముందుగానే కేంద్రానికి చేరుకుని హాల్ టికెట్‌తో పాటు సంబంధిత గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. పరీక్షలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులు పరీక్షా నిబంధనలను తప్పనిసరిగా పాటించి విజయవంతంగా పరీక్ష రాయాలని ఆకాంక్షించారు.

## యూరియా యాప్‌ను రద్దు చేయాలంటూ రోడ్డెక్కిన రైతులు



**ఆర్మూర్, జూన్ 15 (జనంసాక్షి) :** ఆర్మూర్ నియోజకవర్గంలోనీ నందిపేట్ మండల కేంద్రంలో యూరియా యాప్ ను రద్దు చేయాలంటూ రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో రైతులు రోడ్డు ఎక్కారు.యూరియా యాప్ ను వెంటనే రద్దు చేయాలంటూ డిమాండ్ చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డౌన్ ,డౌన్ అంటూ ఫ్లాక్ కార్డుల ప్రదర్శించారు.కొందరు రైతులకు సెల్ ఫోన్లు లేవని, ఉన్నవారికి స్మార్ట్ ఫోన్లు, డబ్బా ఫోన్లు ఉన్నాయన్నారు. రైతులకు యాప్ ఎలా ఉపయోగపడుతుందంటూ రైతులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. సుమారు రెండు గంటల పాటు రైతులు ఆందోళన చేపట్టారు. చౌరస్తాలో ఇరువైపులా వెళ్లే వాహనాలు పెద్ద ఎత్తున స్తంభించిపోయాయి. పోలీసులతో వాగ్వాదం అనంతరం ,పోలీసులు రైతులను శాంతింప చేసి ఆందోళన విరమించారు. ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన సందర్శించి రైతులకు సంఘీభావం తెలిపారు.యూరియా యాప్ ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.రైతులకు ఉపయోగం లేని యాప్ ఎందుకనీ ప్రశ్నించారు.రైతు ఏడ్చిన రాజ్యం, ఎద్దు ఏడ్చిన వ్యవసాయం బాగుపడ్డట్లు చరిత్రలో లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ యాప్ ఏందిరా నాయనా అని ఎద్దేవ చేశారు. తెలంగాణ వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శని మాత్రం పోలేదంటూ విమర్శించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నందిపేట మండల అధ్యక్షుడు మచ్చర్ల సాగర్, మాజీ జెడ్పిటిసి ఎర్రటి ముత్యం, బిఆర్ఎస్ నాయకులు, పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీలో అక్రమాల దందా..?

● **రూ. 200 ఇస్తేనే వంద రోజుల పని!**
● **వనభోజనాల పేరుతో వసూళ్లకు తెరలేపిన మధ్యవర్తులు**
● **సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఆడియో రికార్డింగ్ కలకలంలో కల్వలపాలెం**
● **విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం ఏపీవో**




**మాడుగులపల్లి, జూన్ 15 (జనం సాక్షి) :** మండల పరిధిలోని కల్వలపాలెం గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఉపాధి హామీ) అమల్లో తీవ్ర అక్రమాలు చోటుచేసుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి కూలీలకు వంద రోజుల పని కల్పించాలన్నా, వంద రోజుల కోటా పూర్తయిన వారికి తిరిగి అదనంగా పని ఇప్పించాలన్నా తలకూ రూ. 200 చొప్పున ఇవ్వాలంటూ కొందరు మధ్యవర్తులు వసూళ్లకు తెరలేపిన ఉదంతం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది గత కొన్ని రోజులుగా కల్వలపాలెం గ్రామస్తుల వాట్సాప్ గ్రూపుల్లో ఒక వాయిస్ రికార్డ్ విపరీతంగా చక్కర్లు కొడుతోంది తల రూ. 200 చొప్పున డబ్బులు ఇవ్వండి వనభోజనాలకు రండి అప్పుడే మీకు ఉపాధి పని ఉంటుంది ఒకవేళ మీకు వంద రోజుల పని అయిపోయినప్పటికీ, మళ్లీ పని దొరికేలా చూస్తాం అంటూ సదరు ఆడియోలో కొందరు బహిరంగంగానే కూలీలను డిమాండ్ చేస్తుండటం వినబడుతోంది ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉచితంగా లభించాల్సిన చట్టబద్ధమైన హక్కును, కొందరు తమ స్వార్థం కోసం ఇలా వ్యాపారంగా మార్చేయడంపై కూలీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు కష్టపడితేనే కానీ పొట్ట గడవని పేద కూలీల నుంచి వనభోజనాలు, పార్టీల పేరుతో ఇలా డబ్బులు వసూలు చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై మాడుగులపల్లి మండల ఏపీవో నంద్యాల శ్రీనివాస్ రెడ్డి ని వివరణ కోరగా ఈ వ్యవహారం ఇంకా తమ దృష్టికి రాలేదని పేర్కొన్నారు వాట్సాప్‌లో చక్కర్లు కొడుతున్న ఆడియో రికార్డింగ్‌పై త్వరలోనే పూర్తి స్థాయిలో విచారణ జరిపిస్తామని, ఉపాధి హామీ చట్టానికి విరుద్ధంగా కూలీల నుంచి డబ్బులు వసూలు చేసే మధ్యవర్తులు, బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏపీవో స్పష్టం చేశారు.

## కల్నల్ సంతోష్ బాబు జీవితం నేటి యువతకు ఆదర్శం



**సూర్యాపేట, జూన్ 15 (జనంసాక్షి) :** కల్నల్ సంతోష్ బాబు జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని, దేశ సేవకై , మాతృభూమి రక్షణకు ముందుకు రావాలని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు.మహావీరచక్ర కల్నల్ సంతోష్ బాబు వర్ధంతి సందర్భంగా సూర్యాపేట పట్టణంలోని కల్నల్ సంతోష్ బాబు చౌరస్తాలో ఆయన విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో ఎక్స్ సర్వీస్ మెన్స్, పలువురు ప్రముఖులు సంతోష్ బాబు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం కోసం పోరాటం చేసిన కల్నల్ సంతోష్ బాబు పేరు చరిత్రలో నిలిచిపోతుందన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ వుల్లా, ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్,కల్నల్ సంతోష్ బాబు తల్లిదండ్రులు బిక్కుమల్ల ఉపేందర్, మంజుల,కల్నల్ సంతోష్ బాబు సతీమణి బిక్కుమల్ల సంతోషి,యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్,కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, కొణతం రాజేష్ రెడ్డి, చిలుముల సునీల్ రెడ్డి, నాగుల వాసు, రిటైర్డ్ కల్నల్ సుంకరి శ్రీనివాసరావు , ఎక్స్ సర్వీస్ మెన్ మేజర్ బిఎస్ఎన్ స్వామి, సుబెదార్ నీరజ్ దుబె రిటైర్డ్, హవల్దార్ సాగర్ దులాసి, నాయకులు రెబల్ శ్రీను, మన్నెం మల్లేష్ యాదవ్,ఆలేటి మాణిక్యం, గడ్డం వెంకన్న, నరేందర్ నాయుడు, రుక్మారావు, పాండు రంగాచారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కల్నల్ సంతోష్ బాబు సతీమణి సంతోషి ఆద్వర్యంలో అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు,తోట శ్యామ్ ప్రసాద్, బిక్కుమళ్ల కృష్ణ, చల్లా లక్ష్మయ్య, మిట్టపల్లి రమేష్, సోమ ప్రవీణ్,యామా సంతోష్, బెలిదె శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి



**ఖమ్మం కార్పొరేషన్, జూన్ 15 (జనం సాక్షి) :** ప్రజలు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు. ఎర్రుపాలెం మండలం మీనవోలు గ్రామ కాంగ్రెస్ ఆర్గనైజర్ సాగుర్తి ఫిలిప్ గ్రామంలోని సర్వే నెంబర్ 188, 190, 119 లో ఎస్సీ ఎస్టీ వారు తాత ముత్తాతల కాలం నుంచి వ్యవసాయం చేస్తున్నారని, వీరికి వ్యవసాయ పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, కలెక్టరేట్ ఈ విభాగం పర్యవేక్షకులకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం నగరం 32వ వార్డు బొక్కల గడ్డకు చెందిన టి.ఉమా రాణి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడీ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. కొణిజర్ల మండలం మల్లుపల్లి రెవెన్యూ గ్రామానికి చెందిన కె.రమేష్ బాబు తనకు సర్వే నెంబర్ 24/హెచ్/6 లో 2 ఎకరాల 31 గుంటల భూమి ఉందని సీతారాం బంజర మేజర్ కాలువ నుండి మా పొలంకి పంట కాలువ ఉందని, పై భాగంలో ఉన్న రైతులు కాలువను ఆక్రమించి ఫెన్సింగ్ వేశారని సాగునీరు రావడం లేదని, తమకు కాలువ సౌకర్యం కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కొణిజెర్ల కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం మోతీనగర్ కు చెందిన కే.వెంకట కృష్ణ తమ ఇంటికి మిషన్ భగీరథ పైప్ లైన్, రోడ్డు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, సంబంధిత అధికారులకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. సింగరేణి మండలం బొక్కలతండా గ్రామానికి చెందిన ఏ. రామారావు తన ఇంటి స్థలంలో 2 విద్యుత్ స్తంభాలు ఉన్నాయని, వీటి వల్ల ఇంటినిర్మాణానికి ఆటంకం కల్గుతున్నందున ఆ స్తంభాలు తొలగించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఎస్ఈ టిజి ఎన్పిడిసిఎల్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం కార్పొరేషన్, జూన్ 15 (జనం సాక్షి) :** వెలుగుమట్ల లబ్ధిదారులకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని సద్వినియోగం చేసుకోని, త్వరితగతిన ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ అన్నారు. సోమవారం వెలుగుమట్ల లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి పనులను క్షేత్ర స్థాయిలో జిల్లా కలెక్టర్ పరిశీలించారు. లబ్ధిదారులతో నిర్మాణంలో ఉన్న ఇండ్ల ప్రస్తుత పరిస్థితుల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాల పనులపై పలు సూచనలు చేశారు. నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల దశలను ప్రత్యక్షంగా పరిశీలించి, లబ్ధిదారులకు ఇళ్లు త్వరితగతిన పూర్తయ్యేలా పనులను వేగవంతం చేసేలా అధికారులు సహకారం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్మాణాలు వివిధ దశలలో ఉన్నాయని, పునాదులు, గోడల నిర్మాణం పూర్తయిన తర్వాత, స్లాబ్ దశలో, నిర్మాణం పూర్తిగా పూర్తయిన తర్వాత మొత్తంగా ఐదు లక్షల రూపాయలు ప్రభుత్వ ఆర్థిక సాయం లబ్ధిదారుల ఖాతాలో జమచేస్తున్నట్లు కలెక్టర్ అన్నారు. అర్హులై పునాది స్థాయి వరకు కట్టుకోలేని వారికి మహిళా సంఘాల ద్వారా రుణం ఇప్పించుటకు చర్యలు తీసుకున్నామని కలెక్టర్ అన్నారు. కలెక్టర్ తనిఖీ సందర్భంగా హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఈఈ జగ్గారావు, అధికారులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా పరిశీలన చేసి పరిష్కరించాలి

**● కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 15 (జనం సాక్షి) :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా పరిశీలన చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 135 ఫిర్యాదులు అందాయని,వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు, అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ పి.సురేష్, డీఆర్ఓ గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారని తెలిపారు. ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రజావాణి అనంతరం కలెక్టర్ అధికారులకు పలు అంశాలపై సూచనలు చేశారు.నూతన విద్యా సంవత్సరం ప్రారంభం అయినందున అన్ని వసతి గృహాలు,రెసిడెన్షియల్ స్కూళ్లు, పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.జిల్లా అధికారులతో పాటు మండల స్పెషల్ ఆఫీసర్లు,ఆర్.సీ.ఓలు విధిగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.బాలికల పాఠశాలల్లో ఎక్కడైనా టాయిలెట్స్ అవసరం ఉన్న పక్షంలో తక్షణమే ప్రతిపాదనలు పంపాలని



అన్నారు. ఈ నెల 25 నుండి జూలై 24 వరకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ కొనసాగనుందని,ఈ ప్రక్రియ ప్రారంభం కావడానికి ముందే అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు అందరూ బీ.ఎల్.ఓ లను సంప్రదించి మ్యాపింగ్ ను పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**● జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**సూర్యాపేట ప్రతినిధి, జూన్ 15 (జనంసాక్షి) :** ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ, ప్రజలు సమర్పించిన దరఖాస్తులకు ఆయా శాఖలు కచ్చితమైన సమాచారాన్ని సంబంధిత ఫార్మెట్ లో అందించాలని అన్నారు. రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీలలో శానిటేషన్, త్రాగునీరు సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించడానికి జిల్లా అధికారులు, మండల స్పెషల్ ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి వెంటనే చర్యలు చేపట్టాలని అన్నారు.వర్షాకాలం మొదలైనందువలన ప్రకృతి వైపరీత్యాల వలన ఏవైనా అత్యవసర పరిస్థితులు వస్తే డిజాస్టర్ మేనేజ్మెంట్ టీమ్స్ అందుబాటులో ఉంటాయి కావున అధికారులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.రెడ్ క్రాస్ సంస్థలు మానవతా దృక్పథంతో అందిస్తున్న వారి సేవలు మోటివేషన్ చేయటానికి అధికారులు, సంబంధిత శాఖలు కృషి చేయాలని వారి యొక్క సేవలు వినియోగించుకోవాలని అన్నారు.ఎస్ఐఆర్ లో భాగంగా వారికి



కచ్చితమైన సమాచారాన్ని ఇవ్వాలని, అధికారులు అందుబాటులో ఉండాలని అన్నారు.వివిధ శాఖలలో సమీక్ష సమావేశాలు పెండింగ్ లో ఉంటే వెంటనే నిర్వహించుకోవాలని అన్నారు.ఈ యాసంగి సీజన్ లో జిల్లాలో 3 లక్షల 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు.ధాన్యం కొనుగోలులో సహకరించిన అదనపు కలెక్టర్, సివిల్ సప్లై, డిఆర్డిఏ, మెప్మా, అగ్రికల్చర్ , మండల స్పెషల్ ఆఫీసర్లు, తహాశీల్దార్లకు శుభాకాంక్షలు తెలిపారు. ధాన్యం కొనుగోలులో ఇంకా ఏమైనా పెండింగ్ ఉంటే వెంటనే పరిష్కరించుకోవాలని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా, డివిజన్ స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రజావాణికి అన్ని శాఖల డివిజనల్ అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. స్థానిక సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలకి సంబందించి 58 దరఖాస్తులు, డిడబ్ల్యూఓ 10, డీపీఓ 7, ఫిషరీస్ 5, డిఆర్డిఏ 4, మిగిలిన 31 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని మొత్తం 113దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, జడ్పీ సీఈవో శిరీష, డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, సిపిఓ కిషన్ నాయక్, డిఏఓ శ్రీధర్ రెడ్డి, డిఈఓ అశోక్,స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి నరసింహారావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 12 ఏళ్ల తర్వాత తెరుచుకున్న బడి

**● ఆనందంలో గ్రామస్థులు**




**నాంపల్లి, జూన్ 15 (జనం సాక్షి) :** చదువులు మొత్తం ప్రైవేటు పాఠశాల గుప్పిట్లో ఉన్న ఈ రోజులో,సర్కారీ బడులు మూతపడిపోతున్న తరుణంలో సర్కారు బడి మళ్ళీ తెరుచుకోవడం అరుదైన విషయం ఈ సంఘటన మండలంలోని రాందాస్ తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల గత 12 ఏళ్ల నుండి విద్యార్థులు లేక మూతపడి ఉన్నది.అట్టి పాఠశాలను ఆ గ్రామం యొక్క యువకులు, ఉద్యోగస్తులు మరియు గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్,గ్రామస్తులందరూ కలిసి పాఠశాలకు దాదాపు రూ.లక్ష వెచ్చించి రంగులు సిమెంట్ చేయించి బ్లాక్ బోర్డ్ ,విద్యార్థులకు బ్యాగులు నోటుకు పుస్తకాలు అందించడం జరిగింది. ఈ పాఠశాలలో ప్రస్తుతం 15 మంది విద్యార్థులను చేర్పించుటకు తల్లిదండ్రులు అంగీకరించారు. నాంపల్లి మండల విద్యాధికారి మల్లికార్జునరావు, ప్రధానోపాధ్యాయులు అజయ్ కుమార్, పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించడం జరిగింది. ఆ పాఠశాలకు పక్క పాఠశాల నుండి రఘుపతి అనే ఉపాధ్యాయుడిని తాత్కాలికంగా సర్దుబాటు చేయడం జరిగింది, వీరి వెంట సిఆర్పి కేశవులు కూడా పాల్గొన్నారు ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాల పున ప్రారంభించడం చాలా సంతోషకరమని విద్యార్థులకు ప్రభుత్వం నుండి మధ్యాహ్న భోజనం పార్టీ పుస్తకాలు యూనిఫామ్ అన్ని సౌకర్యాలు పై అధికారుల నుండి అనుమతి తీసుకొని ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాందాస్ తాండ గ్రామంలో గల అందరూ విద్యార్థులను ప్రైవేట్ పాఠశాల నుండి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించుటకు గ్రామస్తులు నిర్ణయం తీసుకున్నారు.




## రూ.5-6 వేల కోట్ల ఐపీఓకు రేజర్‌పే రెడీ




**న్యూఢిల్లీ:**ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ రేజర్‌పే తొలి పబ్లిక్ ఆఫర్‌కు వచ్చేందుకు సిద్ధమవు తోంది. ఇందుకు సంబంధించిన ముసాయిదా పత్రాలను కాన్ఫిడెన్షియల్ రూట్‌లో సెబీకి దరఖాస్తు చేసినట్లు సమాచారం. పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.5-6 వేల కోట్లు సమీకరించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఈ వ్యవహారంతో సంబంధమున్న వర్గాలు తెలిపాయి. ఇందుకు సంబంధించిన ప్రీ ఫైల్డ్ ముసాయిదా పత్రాలను సెబీకి, స్టాక్ ఎక్స్ఛేంజీల్లో కంపెనీ ఫైల్ చేసినట్లు తెలుస్తోంది. ఐపీఓ ద్వారా ఎంత సమీకరించేదీ కంపెనీ అధికారికంగా ఇంకా వెల్లడించలేదు. 2014లో హర్షిల్ మాథుర్, శశాంక్ కుమార్ రేజర్‌పేను నెలకొల్పారు. డిజిటల్ చెల్లింపులు, ఆన్‌లైన్ పేమెంట్ సేవలను ఈ కంపెనీ అందిస్తోంది. మరోవైపు, ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే కూడా ఐపీఓకు రానుంది. అంతర్జాతీయ పరిస్థితుల దృష్ట్యా తన పబ్లిక్ ఇష్యూను వాయిదా వేస్తూ వస్తోంది. 1.5 బిలియన్ డాలర్ల నిధులను ఐపీఓ ద్వారా సమీకరించే అవకాశం ఉంది. ఈక్రమంలోనే రేజర్‌పే ఐపీఓకు వస్తుండటం గమనార్హం. పోటీదారులకు మేలు చేకూర్చే సున్నిత సమాచారమేదీ బయటకు రాకుండా కంపెనీలు ఈ కాన్ఫిడెన్షియల్ రూట్‌ను ఎంచుకుంటూ ఉంటాయి. సెబీ అనుమతి పొందేవరకు ఆ వివరాలేవీ పబ్లిక్ డొమైన్‌లోకి రావు.


### మారుతీ సుజుకీ స్మార్ట్ మెయింటెయినెన్స్ ప్లాన్

**న్యూఢిల్లీ:**ప్రముఖ కార్ల తయారీ కంపెనీ మారుతీ సుజుకీ 'స్మార్ట్ మెయింటెయినెన్స్ ప్లాన్' తీసుకొచ్చింది. వాహన కొనుగోలు అనంతర సేవల కోసం కాల వ్యవధి ఆధారిత ప్రీపెయిడ్ సర్వీస్ ప్యాకేజీలను అందుబాటులోకి తెచ్చింది. కస్టమర్లు దీన్ని వినియోగించుకోవచ్చు. ఎస్‌ఎంపీలో భాగంగా లేబర్ ఓన్లీ, పార్ట్స్-లేబర్, కమర్షియల్ వెహికల్ మైనర్ సర్వీస్, కస్టమర్ డిమాండ్ సర్వీస్, కూలంట్స్ వంటి ప్యాకేజీలు లభిస్తాయి. కారు కొనుగోలు సమయంలో లేదంటే కొనుగోలు అనంతరం ఏదైనా మారుతీ సుజుకీ వర్క్‌షాప్ వద్ద తమకు కావాల్సిన ప్యాకేజీలను కస్టమర్లు ఎంపిక చేసుకోవచ్చు. దేశవ్యాప్తంగా అన్ని మారుతీ సుజుకీ వర్క్‌షాప్‌ల్లో ఈ ప్లాన్ చెల్లుబాటు అవుతుంది.ప్రైవేట్ వెహికల్ కస్టమర్లకు రెండేళ్లు/20,000 లేదంటే 10 ఏళ్లు/1,00,000 కిలోమీటర్ల ఆప్షన్లను ఎంపిక చేసుకోవచ్చు. కమర్షియల్ కస్టమర్ల కోసం 10 ఏళ్లు /1,60,000 కిలోమీటర్ల వరకు కంపెనీ ప్యాకేజీలు ఉన్నాయి. కొనుగోలు సమయంలో ఎంపిక చేసుకున్న సర్వీస్ ప్యాకేజీల ధరలు మున్ముందూ వర్తిస్తాయి.

# భారీ లాభాల్లో సూచీలు

### సెన్సెక్స్ +736, నిఫ్టీ +231

**ముంబయి:** దేశీయ స్టాక్‌మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతలకు తెరదించుతూ శాంతి ఒప్పందంపై అమెరికా-ఇరాన్ ప్రకటన చేసిన నేపథ్యంలో చమురు ధరలు భారీగా దిగొచ్చాయి. ప్రపంచ ఇంధన సరఫరాకు కీలకమైన హర్మూజ్ జలసంధి త్వరలో తెరుచుకోనుండడంతో ప్రపంచ మార్కెట్‌లూ ఊపిరి పీల్చుకున్నాయి. దాదాపు 4 నెలల ఉద్రిక్తతలకు శుభం కార్డు పడడంతో దలాల్ స్ట్రీట్‌లో కొనుగోళ్ల ఉత్సాహం కనిపించింది. సెన్సెక్స్ ఓ దశలో 1200 పాయింట్లకు పైగా లాభపడగా.. ఆఖర్లో అమ్మకాల ఒత్తిడితో 700 పాయింట్ల లాభంతో సరిపెట్టుకుంది. నిఫ్టీ 23,850 పాయింట్ల ఎగువన స్థిరపడింది. సెన్సెక్స్ ఉదయం 76,725.27 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 75,527.95) లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 76,821.07 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 736.38 పాయింట్ల లాభంతో 76,264.33 వద్ద ముగిసింది. నిఫ్టీ 231 పాయింట్ల లాభంతో 23,853.90 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 94.71గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ట్రెంట్, ఇండిగో, బజాజ్ ఫిన్‌సర్వ్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎటర్నల్ షేర్లు లాభపడ్డాయి. ఎన్టీపీసీ, ఐసీఐసీఐ బ్యాంక్, హిందుస్థాన్ యూనిలీవర్, అదానీ పోర్ట్స్, సన్‌ఫార్మా షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 82 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4338 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఆసియా మార్కెట్‌లు లాభాల్లో ముగియగా.. యూరోపియన్ మార్కెట్లు సైతం లాభాలతో ప్రారంభమయ్యాయి.





### వేదాంతా ఇక ఐదు కంపెనీలుగా.. స్టాక్ ఎక్స్ఛేంజీల్లోకి కొత్తగా 4

దిల్లీ: వేదాంతా గ్రూప్‌నకు చెందిన విభజిత నాలుగు కంపెనీల షేర్లు సోమవారం ప్రధాన స్టాక్ ఎక్స్ఛేంజీలైన బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో నమోదయ్యాయి. ఇప్పటికే నమోదైన వేదాంతా లిమిటెడ్‌తో పాటు కొత్తగా ఏర్పాటైన వేదాంతా అల్యూమినియం మెటల్-ఎంఓఒ, వేదాంతా ఆయిల్ అండ్ గ్యాస్ ఖాఉఒ, వేదాంతా పవర్, వేదాంతా ఐరన్ అండ్ స్టీల్ ఎమోఒ షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. ఆయా సంస్థలు స్వతంత్రంగా పని చేస్తూ, తన వ్యాపార ప్రణాళికలకు మూలధనాన్ని సమీకరించుకుంటాయి.వేదాంతా అల్యూమినియం మెటల్ బీఎస్ఈలో రూ.527 వద్ద ట్రేడింగ్‌ను ఆరంభించింది. అనంతరం రూ.538 వద్ద గరిష్ఠాన్ని తాకింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.1,95,773.58 కోట్లు (1.95 లక్షల కోట్లు)కు చేరింది. వేదాంతా పవర్ బీఎస్ఈలో రూ.41.30 వద్ద లిస్టయ్యింది. అనంతరం రూ.43.35 వద్ద గరిష్ఠాన్ని చేరింది. దీని మార్కెట్ విలువ రూ.16,736.46 కోట్లుగా నమోదైంది.వేదాంతా ఆయిల్ అండ్ గ్యాస్ రూ.39 వద్ద ట్రేడింగ్‌ను ఆరంభించి రూ.40.95 వద్ద గరిష్ఠాన్ని తాకింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.14,487.99 కోట్లుగా లెక్క తేలింది. వేదాంతా ఐరన్, స్టీల్ షేర్లు రూ.22.25 వద్ద ట్రేడింగ్‌ను ఆరంభించాయి. ఈ కంపెనీ మార్కెట్ విలువ రూ.8,231.37 కోట్లకు చేరింది. ఇక ఎన్ఎస్ఈలో వేదాంతా అల్యూమినియం రూ.522, పవర్ రూ.41.80, వేదాంతా ఆయిల్ అండ్ గ్యాస్ రూ.38, వేదాంతా ఐరన్, స్టీల్ రూ.20 వద్ద ట్రేడింగ్‌ను ఆరంభించాయి. ఇక ప్రధాన కంపెనీ అయిన వేదాంతా లిమిటెడ్ రూ.305.20 వద్ద ట్రేడవుతోంది.షేర్ల విభజన ఇలా..: గనుల దిగ్గజ సంస్థ వేదాంతా గ్రూపు తన వ్యాపారాలను పునర్వ్యవస్థీకరించి విభజించింది. అల్యూమినియం, చమురు-గ్యాస్, విద్యుత్, ఇనుము, ఉక్కు వ్యాపారాలను ప్రత్యేకంగా గుర్తించడం ద్వారా ప్రతి వ్యాపారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టొచ్చన్న ఉద్దేశంతో డీమెర్జర్ ప్రక్రియ చేపట్టింది. గతేడాది డిసెంబర్‌లో జాతీయకంపెనీ లా ట్రైబ్యునల్ ఈ డీమెర్జర్‌కు ఆమోదం తెలిపింది. ఇందులోభాగంగా వేదాంతా లిమిటెడ్‌లో కలిగిఉన్న ప్రతిఒక్క షేరుకు, వాటాదార్లు విభజిత కంపెనీల్లో ఒక్కో షేరు చొప్పున అందుకున్నారు.

### అలా అయితే అన్ని రంగాల్లో సంక్షోభం: సత్యనాదెళ్ల

ప్రపంచమంతా ఏఐ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్ల కీలక వ్యాఖ్యలు చేశారు. ఏఐ వల్ల కలిగే ప్రయోజనాలు కేవలం కొన్ని కంపెనీల నియంత్రణలోనే ఉండిపోతే, అన్ని రంగాలు తమ నైపుణ్యాన్ని, దీర్ఘకాలిక పోటీతత్వాన్ని కోల్పోయి సంక్షోభంలోకి వెళ్లిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మానవ నైపుణ్యం ఆధారంగా ఏఐని నిర్మించాలని కంపెనీలకు సూచించారు. మానవులు, ఏఐ వ్యవస్థలు ఒకరి నుంచి ఒకరు నిరంతరం నేర్చుకోగల దశలోకి వ్యాపారాలు ప్రవేశిస్తున్నాయన్నారు.ప్రస్తుతం ఉత్పాదకతను మెరుగుపరచడానికి మాత్రమే కాకుండా ఇతర పనులకు కూడా కృత్రిమ మేధను వినియోగిస్తుండడంతో రాబోయే ఏఐ యుగం మునుపటి సాంకేతిక పరివర్తనల కంటే భిన్నంగా ఉంటుందని సత్యనాదెళ్ల పేర్కొన్నారు. భవిష్యత్ కంపెనీల్లో రెండు రకాల ఎదుగుదల ఉండాలన్నారు. మానవుల పరిజ్ఞానం, సృజనాత్మకత, ఏఐ సాంకేతికత కలిస్తేనే సంస్థలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు.

## ఫ్లెక్స్‌ఫ్యూయల్ వ్యాగన్‌ఆర్ ధర ఎంతంటే?

**న్యూఢిల్లీ:**ప్రముఖ కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ తన ఫ్లెక్స్ ఫ్యూయల్ కారు వ్యాగన్‌ఆర్ బయోఫ్లెక్స్ ధరను వెల్లడించింది. ఈనెల మొదట్లో ధర, ఇతర వివరాలేవీ వెల్లడించకుండా కారును మాత్రమే ఆవిష్కరించగా.. తాజాగా ధర వివరాలను బయటపెట్టింది. ఫ్లెక్స్‌ఫ్యూయల్ వెర్షన్ ధరలు రూ.7.24 లక్షల నుంచి ప్రారంభమవుతాయి. అదే పెట్రోల్ వేరియంట్‌లో టాప్ మోడల్‌తో పోలిస్తే దీనిధర రూ.86 వేలు అధికం. ఈ కారు ఇ20 నుంచి ఇ85 వరకు పెట్రోల్‌లో ఇథనాల్ కలిపిన మిశ్రమంతో నడవనుంది.అయితే, బయోఫ్లెక్స్ వెర్షన్‌ను తొలుత కమర్షియల్ వినియోగానికి మాత్రమే అందుబాటులోకి తెచ్చారు. భవిష్యత్‌లో అందరికీ అందుబాటులోకి తేనున్నారు. ప్రస్తుతం క్యాబ్ కోసం ప్రత్యేకంగా వ్యాగన్ ఆర్ టూర్ ఊ3ని మారుతీ సుజుకీ అందిస్తోంది. దీని ధర రూ.4.99 లక్షల నుంచి రూ.5.89 లక్షల వరకు ఉంది. దీంతో పోలిస్తే బయోఫ్లెక్స్ రూ.1.35 లక్షల నుంచి రూ.2.25 లక్షలు అధికం. ఇక వ్యాగన్‌ఆర్ బయోఫ్లెక్స్‌లో 1.2 లీటర్ కే12ఔ 4 సిలిండర్ నాచురల్ యాస్పిరేటెడ్ పెట్రోల్ ఇంజిన్ ఇచ్చారు. అధిక స్థాయిల్లో ఇథనాల్‌ను బ్లెండ్ చేసినా నడిచేలా ఇంజిన్‌ను మాడిఫై ఛేశారు. పవర్, టార్క్ ఔట్‌పుట్‌లో ఎలాంటి మార్పూ చేయలేదు. 90.9 హెచ్‌పీ పవర్‌ను 113.7 ఎన్‌ఏ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. మైలేజ్ వివరాలు ఇంకా వెల్లడించలేదు.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,45,800 | ₹ 1,59,060 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,95,000

# డీల్‌కు ఇజ్రాయెల్ అడ్డుపుల్ల?

### లెబనాన్‌పై కొనసాగుతున్న దాడులు





టెల్‌అవీవ్:డీల్ కుదుర్చుకోవడానికి ఇరాన్-అమెరికా సిద్ధంగా ఉన్న సమయంలో ఈ శాంతి ఒప్పందానికి ఇజ్రాయెల్ అడ్డం పడుతోంది. లెబనాన్‌పై దాడులు ఆపితేనే ఒప్పందం కుదురుతుందని టెహ్రాన్ స్పష్టం చేసినా.. క్షిపణులతో విరుచుకుపడుతోంది. ఒప్పందం ఇంకా కుదరనందున గాజా, సిరియా, లెబనాన్‌లలో స్వాధీనం చేసుకున్న భూభాగాల నుంచి తాము వైదొలగబోమని ఇజ్రాయెల్ రక్షణమంత్రి కాట్జ్ ప్రకటించారు. హెజ్‌బొల్లా స్థావరాలపై తాము చేస్తున్న దాడులకు ప్రతీకారంగా ఇరాన్ దాడులకు తెగబడితే మళ్లీ యుద్ధ పరిస్థితులు నెలకొంటాయని హెచ్చరించారు. ఇజ్రాయెల్ స్వేచ్ఛకు భంగం కలిగించేలా ఇరాన్ చేసే ఏ డిమాండ్ నైనా రెడ్ లైన్‌గా పరిగణిస్తామని పేర్కొన్నారు.ఆదివారం అమెరి కా-ఇరాన్ ఒప్పందం ఖరారవడానికి కొన్ని గంటల ముందు ఇజ్రాయెల్ భూభాగం వైపు హెజ్‌బొల్లా కాల్పులు జరిపింది. దీంతో ఆ కాల్పులకు ప్రతిస్పందనగా బీరుట్‌లోని పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకోవాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఐడీఎఫ్‌ను ఆదేశించారు. హెజ్‌బొల్లా కాల్పుల విరమణను గౌరవిస్తేనే లెబనాన్‌లో దాడులు ఆగుతాయని.. లేదంటే మళ్లీ విరుచుకుపడ తామని ఐడీఎఫ్ హెచ్చరించింది. లెబనాన్‌పై అమెరికా శాశ్వతంగా సైనిక ఆపరేషన్లను నిలిపివేయాలని ఇరాన్ ఒప్పందంలో నిబంధన పెట్టింది. ఈ డీల్‌పై జూన్ 19వ తేదీన సంతకాలు చేయనున్నట్లు ఇరాన్ విదేశాంగశాఖ ఉప మంత్రి కాజెమ్ గరీబాబడీ వెల్లడించారు. ఇక తుది చర్చలు మాత్రం ఈ డీల్‌లోని అంశాల అమలుపైనే ఆధారపడి ఉంటాయన్నారు. ఒప్పందంపై సంతకాలు చేసేందుకు ఇరుపక్షాలు శుక్రవారం జెనీవాలో సమాఎ ేశం కానున్నట్లు మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న పాకిస్థాన్ తెలిపింది. ఈ సమయంలో లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తుండడం గమనార్హం.

## మళ్లీ నిఫా కలకలం

జాగ్రత్తగా క్వారంటైన్‌లో ఉంచారు. అయితే, ప్రస్తుతం పర్యవేక్షణలో ఉన్న ఎవరికీ వైరస్ లక్షణాలు కనిపించలేదని, ఇప్పటివరకు సేకరించిన నమూనాల పరీక్ష ఫలితాలు నెగెటివ్‌గా వచ్చాయని కేరళ ఆరోగ్య శాఖ వెల్లడించింది. వైరస్ సమాజంలో విస్తరించిన సూచనలు లేవని, అందువల్ల ప్రస్తుతం కంటైన్‌మెంట్ జోన్లు ప్రకటించే అవసరం లేదని అధికారులు తెలిపారు. పరిస్థితిని సమీక్షించేందుకు జాతీయ వ్యాధి నియంత్రణ కేంద్రం నిపుణుల బృందం కూడా కోజికోడ్‌కు చేరుకుంది. కేరళలో నిఫా కేసు వెలుగులోకి రావడంతో పొరుగు రాష్ట్రం తమిళనాడు కూడా అప్రమత్తమైంది. కేరళతో సరిహద్దు కలిగిన నీలగిరి, కోయంబత్తూర్, తేని, కన్యాకుమారి, కడలూరు జిల్లాల్లో ఆరోగ్య శాఖలను సిద్ధంగా ఉంచింది. తాళూర్, నాడుగని, నంబియార్‌కున్ను, సోలాడి, పట్టవాయల్ తదితర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక వైద్య బృందాలను మోహరించి కేరళ నుంచి వచ్చే ప్రయాణికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. అనుమానాస్పద లక్షణాలు ఉన్నవారిని వైద్య శిబిరాలకు తరలించి ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచుతున్నారు. కేరళ నుంచి తమిళనాడులోకి వైరస్ వ్యాపించకుండా నిరోధించడానికి సరిహద్దు జిల్లాల్లో హై అలర్ట్ ప్రకటించారు. కేరళ, కర్ణాటక రాష్ట్రాలతో సరిహద్దులను పంచుకునే ప్రాంతాలతో పాటు పర్యాటక ప్రాంతాలైన నీలగిరి (ఊటీ), కోయంబత్తూరు జిల్లాలపై ఆరోగ్య శాఖ ప్రత్యేక నిఘా ఉంచింది




## బంగారానికి మళ్లీ డిమాండ్..

**న్యూఢిల్లీ:**దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండికి మళ్లీ గిరాకీ పెరిగింది. పశ్చిమా సియాలో ఉద్రిక్తతలు చల్లారడం, చమురు ధరలు దిగిరావడం, రూపాయి విలువ బలోపేతం వంటి కారణాలతో ఈ లోహాల ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. సోమవారం హైదరాబాద్ విపణిలో 10 గ్రాముల మేలిమి 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,55,490 పలికింది. అటు వెండి ధర కూడా ఎగబాకింది. కేజీ వెండి ధర రూ.2.57లక్షలకు చేరింది. గతవారం ఒకదశలో బంగారం ధర రూ.1,50,000 కన్నా దిగువకు పడిపోయిన సంగతి తెలిసిందే.అంతర్జాతీయ విపణిలోనూ బంగారం, వెండికి డిమాండ్ పెరిగింది. స్పాట్ గోల్డ్ ఔన్సు ధర 4,323 డాలర్లు, ఔన్సు వెండి ధర 70.38 డాలర్లకు చేరింది. గతవారం పసిడి ధర ఒక దశలో దాదాపు 4000 డాలర్లకు తగ్గింది. ఇక, కమొడిటీ ఎక్స్ఛేంజీలో గోల్డ్ ఫ్యూచర్స్ ధర రూ.1,53,258గా ఉంది. వెండి ఫ్యూచర్స్ ధర రూ.2,52,383గా ట్రేడ్ అవుతోంది.ఇరాన్‌తో డీల్ కుదిరినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. దీంతో మూడు నెలలకు పైగా సాగిన యుద్ధానికి ముగింపు లభించినట్లయ్యింది. ఈ పరిణామాలతో ముడి చమురు ధరలు భారీగా దిగొచ్చాయి. బ్రెంట్ క్రూడ్ 83 డాలర్లకు పడిపోయింది. అటు డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 53 పైసలు బలపడి 93.65 వద్ద ట్రేడ్ అవుతోంది.

## ఎన్ఎస్ఈ ఐపీఓ రాబోతోంది!


దేశంలో అతిపెద్ద స్టాక్ ఎక్స్ఛేంజ్ అయిన నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ).. పబ్లిక్ ఇష్యూకు అనుమతి కోరుతూ సోమ/మంగళవారాల్లో మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించనున్నట్లు ఈ వ్యవహారంతో సంబంధమున్న వర్గాలు వెల్లడించాయి. సెబీ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) అందిన తర్వాత, ఫిబ్రవరి 6న ఎన్ఎస్ఈ బోర్డు ప్రతిపాదిత ఐపీఓకు ఆమోదం తెలిపిన సంగతి విదితమే. ఈ పబ్లిక్ ఇష్యూ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) రూపంలోనే ఉండనుంది. ఇందులో తాజా షేర్ల జారీ ఉండదు.ఎన్ఎస్ఈలో 10.72% వాటాతో, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) అతిపెద్ద వాటాదారుగా ఉంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), దాని అనుబంధ సంస్థ అయిన ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్ కలిసి సుమారు 7.5% వాటా కలిగి ఉన్నాయి. విదేశీ పెట్టుబడిదార్లలో టెమాసెక్ అనుబంధ సంస్థ అయిన అరండా ఇన్వెస్ట్‌మెంట్స్, కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు (సీపీపీఐబీ) ఉన్నాయి. ఈ సంస్థలే వాటాలు విక్రయించే అవకాశం ఉంది.కో-లొకేషన్ వివాదంతో పాటు నియంత్రణ సమస్యల కారణంగా దశాబ్ద కాలంగా ఎన్ఎస్ఈ లిస్టింగ్ ప్రణాళికలు నిలిచిపోయిన సంగతి విదితమే. ఈ ఏడాది జనవరిలో ఎన్ఎస్ఈకి సెబీ ఎన్ఓసీ జారీ చేసింది. దీంతో ఐపీఓ ప్రణాళికలను పునరుద్ధరించుకోవడానికి ఎన్ఎస్ఈకి మార్గం సుగమమైంది.ప్రతిపాదిత ఇష్యూ, దేశీయంగా అతిపెద్ద వాటిలో ఒకటిగా నిలుస్తుందని అంచనా. సుమారు 1.8 లక్షల మంది వాటాదార్లను కలిగిన ఎన్ఎస్ఈ విలువ, అన్‌లిస్టెడ్ మార్కెట్‌లో రూ.5 లక్షల కోట్లకు పైగా ఉందని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.




# వేసవిలో ఎక్కువ డిమాండ్ శ్రీనగర్‌కే

### ఆ ప్రాంతానికి అత్యధిక విమానసర్వీసులు

ఈ వేసవి సెలవుల్లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని శ్రీనగర్, లండన్ మార్గాల్లో అత్యధిక సర్వీసులను దేశీయ విమానయాన సంస్థలు అందుబాటులోకి తెచ్చాయి. విమాన టికెట్ల ధరలు భారీగా పెరిగినా.. ఈ ప్రాంతాలకు డిమాండ్ ఏమాత్రం తగ్గలేదు. గ్లోబల్ ఏవియేషన్ డేటా అనలిటిక్స్ ప్లాట్‌ఫామ్ ఓఏజీ తాజా గణాంకాలను వెలువరించింది. వేసవి ఎండల్లో చల్లగా ఉండే ప్రాంతాలకు వెళ్లడం సహజమే. కశ్మీర్‌లో పరిస్థితులు కుదుటపడటంతో.. ఈసారి దేశీయంగా శ్రీనగర్‌కు విమానాల్లో వెళ్లే ప్రయాణికుల రద్దీ బాగా పెరిగింది. ఎయిరిండియా, ఇండిగో, ఆకాశ ఎయిర్ కలిసి ఈ నెలలో దిల్లీ-శ్రీనగర్ మార్గంలో గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే 2 లక్షలకు పైగా అదనపు సీట్లు కేటాయించాయి. ఈ మార్గంలో సీట్ల సామర్థ్యాన్ని 35% పెంచాయి. కొన్ని రోజుల్లో ఈ మార్గంలో విమాన ఛార్జీలు 40% వరకు పెరిగాయి కూడా. ప్రయాణికుల రద్దీ పరంగా ఈ నెలలో దేశంలోనే 9వ అత్యంత రద్దీ మార్గంగా దిల్లీ-శ్రీనగర్ అవతరించింది. అంతర్జాతీయ ప్రయాణాలపై ప్రభావం: పశ్చిమాసియా సంక్షోభం కారణంగా విమాన ఇంధన (ఏటీఎఫ్) ధరలు రెండింతలు కావడంతో టికెట్ల ధరలూ బాగా అధికమ య్యాయి. ఫలితంగా అంతర్జాతీయ విమాన సర్వీసులపై ప్రభావం చూపింది. దీంతో విమానయాన సంస్థలు పశ్చిమాసియా మార్గాల నుంచి, తమ విమానాలను లండన్ మార్గానికి కేటాయించాయి. 2025 జూన్‌తో పోలిస్తే ఈసారి దిల్లీ-లండన్ హీత్రూ మార్గంలో 15% ఎక్కువ సీట్లను, ముంబయి-లండన్ హీత్రూ మార్గంలో 12% ఎక్కువ సీట్లను విమాన సంస్థలు పెంచాయి. దిల్లీ-లండన్ మార్గంలో భారత సంస్థల విమాన టికెట్ ధరలు 35% ఎక్కువగా ఉండగా, గల్ఫ్ దేశాల విమాన సంస్థల ధరలు 15% ఎక్కువగా ఉన్నాయి. ముంబయి-దుబాయ్ మార్గంలో సీట్ల సామర్థ్యం 10% తగ్గింది. 2.1 లక్షల సీట్లతో ఇది ఇప్పటికీ భారత్ నుంచి అత్యంత రద్దీగా ఉండే అంతర్జాతీయ మార్గంగా ఉంది. ఇక్కడ విమాన ఛార్జీలు 10-15% అధికంగా ఉన్నాయి. అబుదాబి- ముంబయి మార్గంలో డిమాండ్ సాధారణంగా ఉండటంతో, విమాన సామర్థ్యం 18% తగ్గి లక్ష సీట్లకు చేరింది. దేశంలోనే అత్యంత రద్దీ మార్గంగా 6.58 లక్షల సీట్ల (9% వృద్ధి)తో ముంబయి-దిల్లీ కొనసాగుతోంది. రెండో స్థానంలో బెంగళూరు-దిల్లీ (4.31 లక్షల సీట్లు) నిలిచింది. బెంగళూరు-దిల్లీ, బెంగళూరు- ముంబయి వంటి మెట్రో మార్గాల్లో విమాన టికెట్ల ధరలు ఇప్పటికీ 15-20% అధికంగానే ఉన్నాయి. ఎయిరిండియా, ఇండిగో సర్వీసులు తగ్గించినా కూడా బెంగళూరు-హైదరాబాద్ మార్గంలో టికెట్ ధరలు కాస్త తగ్గుముఖం పట్టాయి




## ఎన్‌టీఏ తీరుతో నీట్ అభ్యర్థులకు అవస్థలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):నీట్ యూజీ అభ్యర్థులకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ చుక్కలు చూపిస్తోంది. గత నెలలో నిర్వహించిన నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం కారణంగా రద్దవ్వడంతో తీవ్ర నిరాశలో ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రులకు ఆ సంస్థ పనితీరు మరింత చిరాకు తెప్పిస్తోంది. దేశ వ్యాప్తంగా జూన్ 21న మళ్లీ జరగనున్న నీట్ పరీక్షకు అడ్మిట్ కార్డులు ఆన్‌లైన్‌లో పెట్టినట్లు ఈ నెల 14న ఎన్‌టీఏ ప్రకటించింది. అయితే, ఈ డౌన్‌లోడ్ లింక్ సైతం ఓపెన్ కాకపోవడంతో పలువురు అభ్యర్థులు అవస్థలు పడుతున్నారు. మొత్తంగా దాదాపు 23 లక్షల మందికి పైగా విద్యార్థులు ఈ పరీక్ష రాయాల్సి ఉండగా.. అడ్మిట్ కార్డుల జారీ ప్రారంభమైనప్పట్నుంచి నేటి ఉదయం వరకు కేవలం 4లక్షల మంది మాత్రమే డౌన్‌లోడ్ చేసుకున్నట్లు ఎన్‌టీఏనే స్వయంగా ప్రకటించింది. సాంకేతిక సమస్యలు, సర్వర్ ఇబ్బందుల కారణంగా అడ్మిట్ కార్డులను విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకోలేకపోతున్నట్లుగా పేర్కొంది. ఈ సమస్యలను పరిష్కరించేందుకు తమ టీమ్ పనిచేస్తోందని, అభ్యర్థులందరికీ అతి త్వరలోనే అడ్మిట్ కార్డులు అందేలా చూస్తామని, ఈ అసౌకర్యానికి చింతిస్తున్నట్లుగా 'ఎక్స్'లో రాసుకొచ్చింది. మరోవైపు, డౌన్‌లోడ్ లింక్ సరిగ్గా పనిచేయకపోవడంతో ఆల్టర్నేటివ్ లింక్‌ను కూడా వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకొచ్చింది. ఏటా తప్పిదాలు చోటుచేసుకుంటున్నా ఈ సంస్థ మాత్రం తన పనితీరును మార్చుకోవడం లేదంటూ తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. దీనికితోడు రీఎగ్జామ్ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకొనే ముందే రీఫండ్‌కు సంబంధించి బ్యాంకు వివరాలను ధ్రువీకరించుకోవడం తప్పనిసరి చేయడం మరింత గందరగోళానికి దారితీసినట్లు కనబడుతోంది. అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసే క్రమంలో ఫీజు రీఫండ్ ఆప్షన్ మరోసారి చెక్ చేసుకోవాలని మెసేజ్ వస్తోందని, బ్యాంకు వివరాల నమోదు చేసేందుకు వెళ్తే తమ పాత వివరాలు కనిపించడంలేదని పలువురు వాపోతున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
16 జూన్ 2026

# నకిలీ విత్తనాల విక్రేతలపై క్రిమినల్ కేసులు

- విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు
- వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**వికారాబాద్ జిల్లా బ్యూరో జూన్ 15 (జనం సాక్షి):** నకిలీ విత్తనాలు విక్రయించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. వాన కాలం సీజన్‌కు సంబంధించి ఎరువులు, విత్తనాల విక్రయాలపై క్రమబద్ధీకరణ, నియంత్రణపై కొడంగల్ నియోజకవర్గం వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ...జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు, విత్తనాలను విక్రయించాలన్నారు. ప్రభుత్వం సూచించిన ధరలకు అనుగుణంగా మాత్రమే విక్రయించాలని ఆయన తెలిపారు. ఎవరైనా డీలర్లు నిర్దేశించిన వాటి కంటే ఎక్కువ ధరలకు విక్రయించినట్లయితే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు నకిలీ విత్తనాలు, బ్లాక్ మార్కెట్లలో విత్తనాలు, నిషేధిత విత్తనాలు విక్రయించినట్లయితే అలాంటి వారిపై చర్యలు తప్పవని ఆయన తెలిపారు. జిల్లాలో టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అవకతవకలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదుచేసి చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తుగానే జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. రైతు బీమ, రైతు భరోసా తదితర పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. విత్తనాల పంపిణీకి సంబంధించి రిజిస్టర్ లో నమోదు చేయాలని అదేవిధంగా రైతుల సంతకాలను తప్పనిసరిగా తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ అధికారులు ఎరువుల, విత్తనాల నిల్వలను ఎప్పటికప్పుడు రిజిస్టర్ లలో నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రజా ప్రతినిధుల, ఇతర శాఖల అధికారులను భాగస్వాములను చేసి రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలో పర్యటించి తెలుసుకోవాలని ఆయన సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం సన్న రకం బియ్యాన్ని పండించేందుకు రైతులను ప్రోత్సహించడం జరుగుతుందని, ఆ దిశగా రైతులను ప్రోత్సహించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. సన్న రకం వరిని సాగుచేసిన వారికి 500 రూపాయలు బోనస్ చెల్లించడం జరుగుతుందని, ఇట్టి విషయంపై రైతుల్లో అవగాహన కల్పించి జిల్లాలో సన్నరకం వరిని సాగు చేసే విధంగా వారిని ప్రోత్సహించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఉమా శంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూరు, జిల్లా వ్యవసాయ అధికారి రాజా రత్నం, వ్యవసాయ సహాయ సంచాలకులు, మండల వ్యవసాయ, విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

## విద్యుత్ ప్రమాద బాధిత కుటుంబానికి అండగా నిలవాలి

- అల్వాల్ ఘటనపై ఎంపీ ఈటల రాజేందర్ ఆవేదన
- మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున సాయం డిమాండ్
- సందీప్ భార్యకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని విజ్ఞప్తి

**అల్వాల్, జూన్ 15 (జనంసాక్షి) :** అల్వాల్ టెలికాం కాలనీలో తెగిపడిన విద్యుత్ తీగల కారణంగా తండ్రి, కుమార్తె మృతి చెందిన విషాద ఘటనపై మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోయిన సందీప్, ఆయన కుమార్తె రీతిక కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులను ఓదారుస్తూ ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎంపీ ఈటల రాజేందర్.. భార్య కళ్లముందే భర్త, కుమార్తె మృతి చెందడం అత్యంత హృదయ విదారక ఘటనగా పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేయాల్సి ఉండగా గంటన్నర నుంచి రెండు గంటల వరకు విద్యుత్ కొనసాగడం సంబంధిత శాఖల నిర్లక్ష్యాన్ని బహిర్గతం చేస్తోందన్నారు. అత్యవసర కాల్స్ వెళ్లినప్పటికీ అధికారులు వెంటనే స్పందించకపోవడం దురదృష్టకరమని విమర్శించారు.
మృతుడు సందీప్ కుటుంబానికి ప్రధాన ఆధారమని, ఆయన ఆకస్మిక మరణంతో కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టబడిందన్నారు. ఇదే సమయంలో సందీప్ తల్లి క్యాన్సర్‌తో బాధపడుతుండటంతో కుటుంబ పరిస్థితి మరింత విషమంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించాలని కోరారు.
మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించాలని, సందీప్ భార్యకు ప్రభుత్వంలో, ముఖ్యంగా జీహెచ్‌ఎంసీ పరిధిలో తగిన ఉద్యోగావకాశం కల్పించాలని భారతీయ జనతా పార్టీ తరపున డిమాండ్ చేశారు. బాధిత కుటుంబం భవిష్యత్తుకు భరోసా కల్పించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ ఘటనకు కారణమైన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా విద్యుత్ శాఖ భద్రతా ప్రమాణాలను మరింత కట్టుదిట్టం చేయాలని, ప్రజల ప్రాణ భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

## గఫూర్‌నగర్ ఇన్‌లెట్ సమస్యకు శాశ్వత పరిష్కారం

*అధికారులతో కలిసి ఎమ్మెల్యే అరికెపూడి క్షేత్రస్థాయి పరిశీలన*

- డ్రైనేజీ సమస్యల నివారణకు ప్రత్యేక చర్యలు
- వర్షాకాల ముంపు నివారణపై దృష్టి
- కాలనీల అభివృద్ధికి మౌలిక వసతులే ప్రాధాన్యం



**శేరిలింగంపల్లి, జూన్ 15 (జనంసాక్షి) :** కొండాపూర్ డివిజన్ పరిధిలోని గఫూర్‌నగర్ కాలనీలో నెలకొన్న ఇన్‌లెట్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అవసరమైన చర్యలు చేపడతామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తెలిపారు. సోమవారం శేరిలింగంపల్లి సర్కిల్ ఉప కమిషనర్ బాలకృష్ణ, సీఎంసీ ఇంజినీరింగ్, ప్రాజెక్ట్స్ విభాగ అధికారులతో కలిసి ఆయన గఫూర్‌నగర్ కాలనీలోని ఇన్‌లెట్ పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇన్‌లెట్ సక్రమంగా లేకపోవడంతో అది కుంచించుకుపోయి, చెత్తాచెదారం పేరుకుపోవడం వల్ల కాలనీలో మురుగునీటి సమస్య తీవ్రరూపం దాల్చిందన్నారు. ఈ సమస్య పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇన్‌లెట్‌ను పునరుద్ధరించి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం ద్వారా కాలనీవాసులకు ఉపశమనం కల్పించాలని అధికారులను ఆదేశించారు.
వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కాలనీ ముంపునకు గురికాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వరదనీరు సాఫీగా వెళ్లేలా డ్రైనేజీ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా ప్రజల ఆస్తి, ప్రాణాలకు ఎటువంటి నష్టం జరగకుండా చూడవచ్చన్నారు. డ్రైనేజీ మ్యాన్‌హోల్‌లకు అవసరమైన మరమ్మతులు చేపట్టి సమస్య మరింత జటిలం కాకుండా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను కోరారు. కాలనీవాసులకు పరిశుభ్రమైన, ప్రశాంతమైన వాతావరణం కల్పించడమే లక్ష్యమని అరికెపూడి గాంధీ స్పష్టం చేశారు. ప్రజలకు ఎదురయ్యే ఏ చిన్న సమస్యనైనా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రతి కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎంసీ ఈఈ గోవర్ధన్, ప్రాజెక్ట్స్ డీఈ ధీరజ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.




**నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్-ఆయిల్‌సీడ్స్ పథకం కింద కొడంగల్ నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టుగా రైతులకు ఉచితంగా వేరుశెనగ విత్తనాలు పంపిణీ చేస్తున్నారు. అయితే ఈ పథకంలో భారీ అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. కొందరు రైతులకు కేటాయించిన విత్తనాలను పూర్తిస్థాయిలో అందించకపోవడంతో పాటు, అదనంగా పంపిణీ చేసినట్లు రికార్డులు సృష్టించి విత్తనాలను అక్రమంగా మళ్లించినట్లు విచారణ లో తేలినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై రైతులు ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ అయ్యా యి. విచారణలో అక్రమాలు వెలుగుచూడడంతో దుద్యాల మండల వ్యవసాయ అధికారి నాగరాజును సస్పెండ్ చేశారు. తెలంగాణ సివిల్ సర్వీసెస్ నిబంధనల ప్రకారం శాఖాపరమైన చర్యలు చేపట్టడంతో పాటు దుద్యాల పోలీస్ స్టేషన్‌లో ఆయనపై కేసు నమోదు చేశారు.**

# పల్లీల కుంభకోణంలో అధికారులపై వేటు

*ముగ్గురు వ్యవసాయ అధికారులపై పోలీసు కేసులు*

### ఇద్దరు కాంట్రాక్ట్ ఏఈఓల సేవల రద్దు

- కొడంగల్ ఏడీఏను ప్రధాన కార్యాలయానికి సరెండర్
- సీఎం నియోజకవర్గంలో వెలుగుచూసిన విత్తనాల అక్రమాలు

**వికారాబాద్, జూన్ 15 (జనం సాక్షి):**
రైతులకు ఉచితంగా పంపిణీ చేయాల్సిన వేరుశెనగ సబ్సిడీ విత్తనాల అక్రమాల వ్యవహారంలో వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బందిపై చర్యలు ప్రారంభమయ్యాయి. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో వెలుగు చూసిన విత్తనాల కుంభకోణం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారగా, బాధ్యులుగా గుర్తించిన అధికారు లపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు చేపట్టారు. ముగ్గురు వ్యవసాయ అధికారులపై వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేయగా, ఇద్దరు కాంట్రాక్ట్ వ్యవసాయ విస్తరణ అధికారులను (ఏఈఓలు) సేవల నుంచి తొలగించారు.
అదే విధంగా బొమ్మరాస్పేట్ మండలం మెట్లకుంట క్లస్టర్‌కు చెందిన కాంట్రాక్ట్ ఏఈఓ జగదీశ్వర్, దౌల్తాబాద్ మండలం గోకఫసల్‌వాడ క్లస్టర్‌కు చెందిన కాంట్రాక్ట్ ఏఈఓ మమతలను సేవల నుంచి తొలగించారు. వీరిపై కూడా సంబంధిత పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు అయ్యాయి. కొడంగల్ ఏడీఏ శంకర్‌రాథోడ్‌ను తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ ప్రధాన కార్యాలయానికి సరెండర్ చేశారు. విచారణలో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. కొడంగల్ ప్రాంతం నుంచి వలస వెళ్లిన రైతుల పేర్లను ఉపయోగించి వారికి విత్తనాలు పంపిణీ చేసినట్లు రికార్డులు నమోదు చేసి, క్వింటాళ్ల కొద్దీ వేరుశెనగ విత్తనాలను దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో లక్షల రూపాయల విలువైన విత్తనాలు అక్రమంగా మళ్లించబడినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. అయితే ఈ కుంభకోణంలో కేవలం దిగువస్థాయి సిబ్బందిపైనే చర్యలు తీసుకుంటున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నప్పటికీ, కొద్ది మంది అధికారులపైనే చర్యలు పరిమితం కావడం పట్ల రైతు సంఘాలు, ప్రజలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. కుల్కచర్ల, బషీరాబాద్, దోమ తదితర మండలా ల్లోనూ సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులందరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. రైతులకు అందించే సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, జవాబుదారీతనం అత్యంత కీలకమని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని, అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



## జొన్నల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

### మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వై మహేందర్ రెడ్డి

**మోమిన్ పేట జూన్ 15 ( జనం సాక్షి) :** జొన్నల కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వై మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మోమిన్ పేట ,పిఎసిఎస్ కార్యాలయంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రానికి ధాన్యం తరలించే రైతులు వ్యవసాయ శాఖ అధికారుల నుండి రసీదు తో పాటు ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్, పట్టాదారు పాస్ బుక్ తీసుకురావాలని సూచించారు. మండలంలోని వివిధ గ్రామాలలో రైతులు తాము పండించిన జొన్నలను ఎంఎస్‌పి 3,699 రూపాయలకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు కొనుగోలు చేస్తున్నామని, ఈ కొనుగోలు కేంద్రాన్ని పరిసరాల రైతులు జొన్నలను తరలించి లబ్ధి పొందాలని ఆయన సూచించారు, రైతులు తాము పండించిన పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తరలించినట్లయితే ఎలాంటి దళారుల పాలు కాకుండా నేరుగా రైతు ఖాతాలోని డబ్బులు జమ అవుతాయని ఆయన తెలిపారు.మేక వనం పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఈ కొనుగోలు కేంద్రం నడుస్తున్నందున మారుమూల గ్రామాల రైతులు అందరూ సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సృజన సాహితి,మోమిన్ పేట పిఎసిఎస్ చైర్మన్ రామచంద్రారెడ్డి వైస్ చైర్మన్ లకం గారి జయమ్మ మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు కోసిగి సురేందర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మన్నే శంకర్ యాదవ్ పిఎసిఎస్ డైరెక్టర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు

- ప్రతి అర్జీకి ప్రాధాన్యమిస్తూ చర్యలు
- ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం
- ప్రజావాణిలో 97 వినతుల స్వీకరణ
- క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేయాలి



**శేరిలింగంపల్లి, జూన్ 15:** ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కమిషనర్ సృజన అధికారులను ఆదేశించారు. ప్రజలు అందజేసే వినతుల పట్ల ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదని, వాటి పరిష్కారం కోసం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సోమవారం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో కమిషనర్ స్వయంగా పాల్గొని ఫిర్యాదుదారుల నుంచి వినతులు స్వీకరించారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అందిన ఫిర్యాదులపై కమిషనర్ ఆరా తీసి సంబంధిత అధికారులతో చర్చించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమం ప్రస్తుతం ఒక యజ్ఞంలా కొనసాగుతోందన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని ప్రతి సర్కిల్, జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమానికి విశేష ప్రాధాన్యం ఉందని తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు కీలక అధికారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు సమయాన్ని కేటాయిస్తున్నారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మొత్తం 97 వినతులు అందినట్లు అధికారులు వెల్లడించారు. వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించినవి అత్యధికంగా 77 ఉండగా, ఇంజినీరింగ్ విభాగానికి 8, ఎఫ్ అండ్ ఏ విభాగానికి 1, చెరువులు, సరస్సుల విభాగానికి 2, రెవెన్యూ విభాగానికి 2, శానిటేషన్ విభాగానికి 3, ట్రాన్స్‌పోర్ట్ విభాగానికి 1, అర్బన్ బయోడైవర్సిటీ విభాగానికి 2, అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ విభాగానికి 1 చొప్పున వినతులు అందాయి. అందిన ప్రతి ఫిర్యాదును ప్రత్యక్షంగా పరిశీలించి ప్రాధాన్యత క్రమంలో చర్యలు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. ఫిర్యాదులు స్వీకరించడం వరకే అధికారుల బాధ్యత పరిమితం కాదని, క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన నిర్వహించి సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన అర్జీదారులు మళ్లీ మళ్లీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా పారదర్శకమైన వ్యవస్థను అమలు చేస్తామని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ వారి విశ్వాసాన్ని నిలబెట్టేలా అధికారులు పనిచేయాలని సూచించారు.

## ప్రభుత్వ కళాశాలల్లో ఉచిత భోజన పథకం ప్రారంభం

**కూకట్ పల్లి జూన్ 15(జనంసాక్షి ):**
ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నేటి నుంచి ప్రారంభమైన ఉచిత మధ్యాహ్న భోజన పథకాన్ని కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతించారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు మొయిజ్ మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం చారిత్రాత్మకమని కొనియాడా రు. ఈ కార్యక్రమంలో సలీం, ఆరిఫ్, రవి, అక్బర్, జోగా, తిరుపతి, జకీర్, మౌలానా తదితరులు పాల్గొని ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు."థ్యాంక్యూ రేవంత్ అన్నా" అంటూ విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

# ప్రభుత్వం వృద్ధుల సంక్షేమానికి కట్టుబడి ఉంది

- సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ కమిషనర్ బి. సైలజ
- క్లైమేట్ రెజిలియెంట్ ఏజింగ్‌పై జాతీయ నివేదిక విడుదల




**ముషీరాబాద్, జూన్ 15 (జనం సాక్షి):**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వృద్ధుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, మెయింటెనెన్స్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్స్ అండ్ సీనియర్ సిటిజన్స్ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని, బి. సైలజ చెప్పారు. ఈ మేరకు సోమవారం బాగ్లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణా అవగాహన దినోత్సవం సందర్భంగా హెల్ప్ ఏజ్ ఇండియా ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ కమిషనర్ బి. సైలజ హాజరై మాట్లాడారు. వృద్ధుల ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సీనియర్ సిటిజన్ హోములు, డే-కేర్ కేంద్రాలను విస్తరిస్తూ వృద్ధుల సంరక్షణ మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన ప్యానెల్ చర్చలో వాతావరణ మార్పులు, కమ్యూనిటీ ఆధారిత మద్దతు వ్యవస్థలు, సమగ్ర విధానాల అవసరంపై నిపుణులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. కార్యక్రమంలో "క్లైమేట్ రెజిలియెంట్ ఏజింగ్ – ఎన్స్యూరింగ్ కేర్, డిగ్నిటీ ు ఏజెన్సీ" అనే జాతీయ నివేదికను విడుదల చేశారు. వాతావరణ మార్పుల ప్రభావం వృద్ధులపై, ముఖ్యంగా వెనుకబడిన వర్గాలకు చెందిన వృద్ధులపై ఎలా పడుతోందో ఈ నివేదికలో వివరించారు. వృద్ధులను చేర్చుకునే వాతావరణ చర్యలు, విపత్తు సన్నాహకత, బలమైన సామాజిక రక్షణ వ్యవస్థల అవసరాన్ని నివేదిక తెలిపింది. కార్యక్రమంలో విజయ్ కుమార్, హమీదా బీ, అసిఫ్ ఖురేషి, పద్మజా కరణం, నాగ చంద్రికా దేవి తదితరులు పాల్గొన్నారు.

# మాట నిలబెట్టుకున్న షాద్‌నగర్ ఎమ్మెల్యే

### గంగన్నగూడ బ్రిడ్జి ప్రారంబించిన ఎమ్మెల్యే శంకరయ్య



**కొందుర్గు (జనంసాక్షి) :**
వివిధ గ్రామల ప్రజల దశాబ్దాల రాకపోకల కష్టాలకు శాశ్వత పరిష్కారం లభించింది. రూ.1.25 కోట్ల హెచ్‌ఎండీఏ (నవీణా) నిధులతో నూతనంగా నిర్మించిన గంగన్నగూడ హై లెవెల్ బ్రిడ్జిని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ఘనంగా ప్రారంభించారు. ఈ బ్రిడ్జి అందుబాటులోకి రావడంతో గంగన్నగూడ గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ గ్రామంలో సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. గతంలో వర్షాకాలం వస్తే గంగన్నగూడ గ్రామ ప్రజలు, వాహనదారులు రాకపోకలు సాగించలేక తీవ్ర ఇబ్బందులు పడేవారని గుర్తుచేశారు. ఈ బ్రిడ్జి నిర్మాణం ద్వారా ఆ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. గంగన్నగూడ మీదుగా అనేక గ్రామాలకు ప్రధాన రాకపోకలు సాగుతుంటాయని, ప్రజల అత్యవసర అవసరాలను గుర్తించి అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే ఈ బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రజలకు అంకితం చేశామని ఆయన వివరించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ఎక్కడ సమస్యలు ఉన్నా వాటి పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని, ప్రజా శ్రేయస్సు, నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయమని ఎమ్మెల్యే ప్రకటించారు.ప్రజాప్రతినిధులు, నాయకుల సందడి:ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దామోదర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు తుమ్మలపల్లి జితేందర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. అలాగే సయ్యద్ సాదిక్, అక్రం, కేకే కృష్ణ, వివిధ గ్రామాల సర్పంచులు యాదయ్య (చెరుకుపల్లి), విక్రమ్ రెడ్డి (గంగన్నగూడెం), పెద్దింటి జంగమ్మ (బైరంపల్లి), ఉపసర్పంచ్ కుంట్లోళ్ళ నరేష్, ఎంపీటీసీలు మల్లేష్, అంజిరెడ్డి, మనయ్య పాల్గొన్నారు.కార్యక్రమంలో మాజీ సర్పంచులు కనకమామిడి అంజయ్య (ముట్పూర్), పత్తి శ్రీశైలం (టేకులపల్లి), అమర్నాథ్ రెడ్డి (పులుసుమామిడి), రమేష్ (శ్రీరంగాపూర్), రాజకుమార్ (చిన్న ఎల్కిచెర్ల), ఎస్సెసెల్ అధ్యక్షుడు నరేందర్, బోరిగే యాదయ్య, కావలి యాదయ్య, బండమీది పెంటయ్య, రవి కుమార్, గోపాల్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సీఎం రేవంత్ రెడ్డి కృషి

### వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి



**బొంరాస్ పేట, జూన్ 15 ( జనం సాక్షి):** ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సీఎం రేవంత్ రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని చౌదర్పల్లి జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ,నోటు పుస్తకాలు ముఖ్యఅతిథిగా హాజరై అందజేశారు.మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధి హామీ కౌన్సిల్ సభ్యులు నర్సింలు గౌడ్ హాజరై విద్యార్థులకు అల్పాహారం వడ్డించారు.అనంతరం పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలకు వచ్చే విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం, పాలు, రాగి జావా అందజేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి అక్షయపాత్ర కొడంగల్‌లో ఏర్పాటు చేసి ప్రతిరోజు పాఠశాలలకు చేరవేయడం జరుగుతుందన్నారు.విద్యా వ్యవస్థపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని ఏర్పుమల్ల సర్పంచ్ బందేయ్య పేర్కొన్నారు. ఆయ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మండల విద్యాధికారి హరిలాల్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు వీరేశలింగం, బందేయ్య, ప్రధానోపాధ్యాయులు రవీందర్ గౌడ్,వెంకట్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమేష్ రాథోడ్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎయిర్ ఫోర్స్ విమానం ఏర్పాటు పనులు వేగవంతం

- నాంపల్లి గుట్ట ప్రకృతి, ఆధ్యాత్మికతతో కూడిన కొత్త ఆకర్షణగా మారనుంది
- గుట్టపైకి విడిభాగాలు.. త్వరలో ప్రారంభం కానున్న ఏర్పాటు పనులు



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 15 (జనంసాక్షి):** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దత్తత దేవాలయమైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి కొలువైన నాంపల్లి గుట్ట త్వరలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా మారనుంది. గుట్టపై భారత వైమానిక దళానికి చెందిన విమానాన్ని ఏర్పాటు చేయడానికి చేపట్టిన పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో విమానం విడిభాగాలను ప్రత్యేక వాహనాల ద్వారా గుట్టపైకి సోమవారం తరలించారు. పర్యాటకులను ఆకర్షించే లక్ష్యంతో నాంపల్లి గుట్టపై ఎయిర్ ఫోర్స్ విమానాన్ని ప్రతిష్ఠించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే విమానానికి సంబంధించిన ప్రధాన విడిభాగాలు గుట్టపైకి చేరుకోగా, వాటి ఏర్పాటు పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. విమానం ఏర్పాటు పూర్తయిన తర్వాత నాంపల్లి గుట్టకు వచ్చే సందర్శకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రకృతి సౌందర్యం, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన నాంపల్లి గుట్టకు ఈ విమానం మరో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. విమానం ఏర్పాటు పూర్తయిన అనంతరం ఈ ప్రాంతం ప్రముఖ పర్యాటక కేంద్రంగా మారనుంది.

# ప్రాణం తీసిన సెల్ఫీ సరదా..బాలిక మృతి

**ఇల్లంతకుంట జూన్ 15(జనంసాక్షి) :** సెల్ఫీ సరదా ఓ బాలిక నిండు ప్రాణాన్ని బలిగొంది. ఇల్లంతకుంట మండలం అన్నపూర్ణ రిజర్వాయర్ పంపు హౌస్ వద్ద సెల్ఫీ దిగేందుకు ప్రయత్నించిన ఓ బాలిక.. ఒక్కసారిగా రిజర్వాయర్ పక్కన ఉన్న పెద్ద ట్యాంక్‌లో పడటంతో.. మృతి చెందింది. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇల్లంతకుంట మండలం తిప్పాపూర్ గ్రామంలో ఆదివారం పోచమ్మ బోనాల సందర్భంగా చిన్నకోదురు మండలం రాముని పట్ల గ్రామానికి చెందిన వెంకటాపూర్ కీర్తన (10)తన కుటుంబ సభ్యులతో కలిసి తిప్పాపుర్ వచ్చింది. అయితే బోనాల అనంతరం సోమవారం అన్నపూర్ణ రిజర్వాయర్ ను చూసేందుకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. అక్కడ సెల్ఫీ దిగుతున్న క్రమంలో ఒకసారిగా వెంకటాపూర్ కీర్తన (10) నీటిలో పడి కొట్టు మిట్టాడుతుంది. పక్కన ఉన్నవారు.. నీటి నీటిలోకి దంకి బయటకు తీశారు. వెంటనే హుటా హుటినా ఆసుపత్రికి తరలించిన.. ఆస్పత్రి వర్గాలు బాలిక మృతి చెందినట్లు తెలిపారు. సెల్ఫీ సరదా ఇలా విషాదాన్ని మిగిల్చింది.

# హవన కార్యక్రమంలో పాల్గొనడం నా అదృష్టం

### రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్ రావు



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూన్ 15 (జనంసాక్షి) :** వేములవాడ బ్రాహ్మణ నిత్యాన దాన సత్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రమ పారాయణ కృష్ణ యజుర్వేద హవన కార్యక్రమంలో పాల్గొనడం నా అదృష్టమని రాష్ట్ర ప్రభుత్వ సలహా వారు హర్కార వేణుగోపాలరావు అన్నారు. లోక కళ్యాణార్థం కొరకు వేములవాడ శ్రీ రాజ రాజేశ్వర బ్రాహ్మణ నిత్యాన్న సత్రం ఆధ్వర్యంలో జరుగుతున్న క్రమ పారాయణ కృష్ణ యజుర్వేద హోమ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్ రావు,తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ పరిషత్ సమాఖ్య అధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు మాట్లాడుతూ హవన కార్యక్రమంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని, సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. బ్రాహ్మణ పరిషత్ అభివృద్ధి కొరకు రూ 25 కోట్లు మంజూరు చేశారని వివరించారు. వేద పండితులు ఎంతో నిష్టతో లోక కళ్యాణర్థం కొరకు ఇలాంటికార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అందర్నీ అభినందించారు. ఈ కార్యక్రమంలో కటకం మృత్యుంజయం, ప్రతాప రామకృష్ణ, బ్రాహ్మణ సంఘ నాయకులు, బ్రాహ్మణులు పాల్గొన్నారు.

# జమ్మికుంట మండలంలో టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

- మూడు అక్రమ ఇసుక డంప్‌లు, రెండు ట్రాక్టర్లు సీజ్
- సుమారు 150 ట్రాక్టర్ల లోడుల ఇసుక స్వాధీనం
- అక్రమార్కులను వదిలిపెట్టేది లేదు
- పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం



**జమ్మికుంట, జూన్ 15 (జనంసాక్షి) :**
కరీంనగర్ జిల్లా పరిధిలో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా, నిల్వలపై కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదేశాల మేరకు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిఘా తీవ్రం చేశారు. ఇందులో భాగంగా సోమవారం జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామంలో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ వాసాల సతీష్ ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గ్రామంలో గుట్టుచప్పుడు కాకుండా నిల్వ ఉంచిన మూడు భారీ అక్రమ ఇసుక డంప్‌లను పోలీసులు కనుగొని, సీజ్ చేశారు. అదేవిధంగా ఎలాంటి అనుమతులు లేకుండా విలాసాగర్ పరిసర ప్రాంతాల నుండి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను అక్కడికక్కడే పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు.

ఒక పెద్ద ఇసుక డంప్‌లో సుమారు 100 ట్రాక్టర్ల లోడుల ఇసుకను గుర్తించారు. మిగిలిన రెండు ఇసుక డంప్‌లలో కలిపి మరో 50 ట్రాక్టర్ల లోడుల ఇసుక నిల్వలను సీజ్ చేశారు. మొత్తంగా దాదాపు 150 ట్రాక్టర్ల లోడుల అక్రమ ఇసుకతో పాటు, రవాణాకు ఉపయోగిస్తున్న 2 ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీజ్ చేసిన మొత్తం ఇసుక నిల్వలను, వాహనాలను తదుపరి చట్టపరమైన చర్యలు, సమగ్ర విచారణ నిమిత్తం జమ్మికుంట పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు ఏసీపీ తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులు లేకుండా సహజ వనరులైన ఇసుకను అక్రమంగా తవ్వినా, నిల్వ ఉంచినా, రవాణా చేసినా కఠిన చర్యలు ఉంటాయని సీపీ గౌష్ ఆలం ఈ సందర్భంగా హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా అక్రమ ఇసుక రవాణా పై నిరంతరం నిఘా ఉంటుందని, నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు మైనింగ్ చట్టాల ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.



# ఎన్టిపిసి అధికారులతో ఆర్జీ-3 జీఎం సమీక్ష సమావేశం

**రామగిరి జనంసాక్షి :** సింగరేణి రామగుండం – 3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ సోమవారం సింగరేణి జీఎం కార్యాలయంలో ఎన్టిపిసి జనరల్ మేనేజర్ (ఓఅండ్ఎం) మనీష్ అగర్వాల్‌తో పాటు సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బొగ్గు నాణ్యత, బొగ్గు రవాణా, సరఫరా ప్రక్రియలో సమన్వయం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా జీఎం సుంకర మధుసూదన్ మాట్లాడుతూ, నాణ్యమైన బొగ్గును సకాలంలో రవాణా చేసి ఎన్టిపిసికి అందించేందుకు అవసరమైన సహకారాన్ని అందించాలని కోరారు. బొగ్గు సరఫరా ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు సింగరేణి, ఎన్టిపిసి సంస్థలు పరస్పర సహకారంతో సానుకూలంగా వ్యవహరించాలని సూచించారు. దీనికి స్పందించిన ఎన్టిపిసి అధికారులు, బొగ్గు రవాణా మరియు సరఫరా ప్రక్రియలో తమవంతు సహాయ సహకారాలు అందించి సమన్వయంతో పని చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎస్ఓటుజిఎం ఎం. రామ్మోహన్, ఏరియా ఇంజనీర్ ఏ. ఉదయ భాస్కర్, నాణ్యత అధికారి ఆసిఫ్ యాసిన్, ఎన్టిపిసి అధికారులు హేమంత్ షిండే, ప్రసాద్ మండడి, అటల్ గైక్వాడ్, రాధాకృష్ణ, దస్తగిరి, మహేష్ చమత్ తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసిన ఓయూ ప్రొఫెసర్లు



**సికింద్రాబాద్ (జనంసాక్షి):** ఉస్మానియా యూనివర్సిటీ అధికారులు, ప్రొఫెసర్లు సోమవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిసి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఓయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం ఉద్యోగుల సీపీఎస్, ఓపీఎస్ సమస్యలను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిస్తూ.. ఈ అంశానికి త్వరలోనే సానుకూల పరిష్కారం లభించేలా ప్రభుత్వం కృషి చేస్తోందని, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన పూర్తి సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. నరేష్ రెడ్డి, వీసీ ఓఎస్డీ ప్రొఫెసర్ ఎస్. జితేందర్ కుమార్ నాయక్, ప్రొఫెసర్లు జి. మల్లేశం, పి. చంద్రశేఖర్, సి.హెచ్. శ్రీనివాస్, బి. మంగు, రాజేందర్ నాయక్, డాక్టర్ చలమల్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



# సమయపాలన పాటించని ఉద్యోగులపై మేయర్ ఆగ్రహం

### సకాలంలో విధులకు హాజరు కావాలని ఆదేశం

**కరీంనగర్ అర్బన్, జూన్ 15 (జనంసాక్షి) :** కరీంనగర్ నగరపాలక సంస్థలో కొంతమంది ఉద్యోగులు, అధికారులు విధి నిర్వహణకు సరైన సమయానికి హాజరు కావడం లేదనే సమాచారంతో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో పలువురు ఉద్యోగులు నిర్ణీత సమయానికి హాజరు కాకపోవడాన్ని గమనించిన మేయర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ సేవలో ఉన్న ప్రతి ఉద్యోగి సమయ పాలన పాటించడం విధిగా భావించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని సూచించారు. నగరపాలక సంస్థలో ప్రజలకు సంబంధించిన అనేక సేవలు ప్రతిరోజూ అందించాల్సి ఉంటుందని, ఉద్యోగులు ఆలస్యంగా రావడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని మేయర్ పేర్కొన్నారు. ఇకపై అన్ని శాఖల అధికారులు, సిబ్బంది నిర్ణీత సమయానికి విధులకు హాజరై తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. అనవసరంగా ఆలస్యంగా హాజరయ్యే ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తీసుకునేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని మేయర్ స్పష్టం చేశారు. ప్రజాసేవలో క్రమశిక్షణ, బాధ్యతాయుతంగా వ్యవహరించడం ప్రతి ఉద్యోగి విధి అని ఆయన పేర్కొన్నారు. ఈ తనిఖీలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రైవేటు వద్దు, ప్రభుత్వ బడి ముద్దు

### వెల్జాల్‌కు తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు

- గత ప్రభుత్వం విద్యా వ్యవస్థను ధ్వంసం చేసింది
- రేవంత్ నాయకత్వంలో విద్యారంగం అభివృద్ధి
- పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య లక్ష్యం
- రాష్ట్ర విద్య కమిషన్ సభ్యులు చారకొండ వెంకటేష్



**తలకొండపల్లి, జూన్ 15 (జనంసాక్షి):** ప్రజా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి విద్యారంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి ఆంగ్ల బోధనలతో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని రాష్ట్ర విద్య కమిషన్ సభ్యులు డాక్టర్ చారకొండ వెంకటేష్ పేర్కొన్నారు.
తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక చొరవతో మంజూరు కావడంతో సోమవారం నిర్వహించిన విద్యా సంబరాలకు ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా తీర్చిదిద్ది నాణ్యమైన విద్యను అందించడానికి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పని చేస్తున్నామని తెలిపారు.
టీపీఎస్ పాఠశాల నిర్మాణ అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.16 కోట్లు నిధులు కేటాయించి నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు నాణ్యమైన ఆంగ్ల విద్యను అందించనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ బడుల్లో చదివే పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించినప్పుడే ప్రభుత్వ బడులపై ప్రజలకు నమ్మకం పెరుగుతుందన్నారు. వెల్జాల్‌కు టీపీఎస్ మంజూరు కావడం వల్ల పరిసర ప్రాంతాల విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యను అభ్యసించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ విద్యా సంవత్సరానికే పాఠశాలకు రెండు లేదా మూడు బస్సులను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పాఠశాల అభివృద్ధికి పార్టీలకతీతంగా నాయకులు, విద్యావంతులు ముందుకు వచ్చి సహకరించాలన్నారు. అనంతరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో 500కి పైగా మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థినులను, ప్రధానోపాధ్యాయురాలిని ఘనంగా సన్మానించి మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వానరాశి రాములమ్మ, ఉపసర్పంచ్ శివ విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకటరెడ్డి, ఎంఈఓ చాప్లా నాయక్, ప్రధానోపాధ్యాయులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు పాల్గొన్నారు.

# మా పెండింగ్ జీతాలు వెంటనే ఇవ్వాలి

- జీఓ నెం. 60 ప్రకారం వేతనాలు అమలు చేయాలని కార్మికుల డిమాండ్

**వీపనగండ్ల, జూన్ 16( జనం సాక్షి) :** రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో భాగంగా వీపనగండ్ల మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద గ్రామపంచాయతీ వర్కర్స్ ఒకరోజు ధర్నా నిర్వహించి ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని,ఉద్యోగ భద్రత కల్పించాలని, జీఓ నెం. 51ను రద్దు చేయాలని, వేతనాలను పెంచాలని, జీఓ నెం. 60 ప్రకారం వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రం అందజేశారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ సంఘం మండల అధ్యక్షుడు వెంకటయ్య, ఉపాధ్యక్షుడు రాజబాబు, కార్యదర్శి కమట మహేష్‌తో పాటు రాముడు, గోవిందు, శివయ్య, గంగులు తదితర కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సాగు సమస్యలపై రాష్ట్రవ్యాప్త ధర్నాలు



**ముషీరాబాద్, జూన్ 15 (జనం సాక్షి):** వానాకాలం సాగు ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులు ఎదుర్కొంటున్న సమ స్యల పరిష్కారం కోసం జూన్ 16 నుంచి 22 వరకు రాష్ట్రవ్యాప్తంగా జిల్లా, మండల కేంద్రాల్లో ధర్నాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ ప్రకటించారు. ఈ మేర తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ధర్నాలకు సంబంధించిన పోస్టర్లను రాష్ట్ర కోశాధికారి మూడ్ శోభన్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు లెల్లెల బాలకృష్ణ, ఉడత రవీందర్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తీగల సాగర్ మాట్లాడుతూ, వానాకాలం సాగు పనులు ప్రారంభమైనప్పటికీ రైతులకు అందాల్సిన పెట్టుబడి సాయం అందకపోవడం ఆందోళనకరమన్నారు. యాసంగి, వానాకాలం సీజన్లకు సంబంధించిన రైతు భరోసా నిధులను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని, పెండింగ్‌లో ఉన్న పంటల బోనస్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మార్కెట్‌లో నకిలీ, నాసిరకం విత్తనాల విక్రయాలను అరికట్టడంతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పొటాష్, భాస్వరం, కాంప్లెక్స్ ఎరువుల ధరలను తగ్గించాలని, యూరియా యాప్‌ను రద్దు చేసి రైతులకు సకాలంలో ఎరువులు అందుబాటులో ఉంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అదేవిధంగా రైతు డిస్కాం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, అటవీ హక్కుల చట్టం ప్రకారం అర్హులైన గిరిజన, గిరిజనేతర రైతులకు సాగు హక్కు పత్రాలు ఇవ్వాలని కోరారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రైతులకు కొత్త రుణాలు మంజూరు చేయడంతో పాటు కౌలు రైతులకు రుణార్హత కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగుతుందని పేర్కొన్న తీగల సాగర్, జూన్ 16 నుంచి 22 వరకు జరిగే ఆందోళన కార్యక్రమాల్లో రైతులు, కౌలు రైతులు, పోడు వ్యవసాయదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# ఎరువులను సకాలంలో అందించాలి

### బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి

**బోధన్, జూన్ 15 (జనంసాక్షి) :** ఎరువుల కొరత లేకుండా రైతులకు సకాలంలో అందించేలా పరిష్కారానికి కృషి చేయాలని సోమవారం బోధన్ పట్టణంలోని ఎమ్మార్వో కార్యాలయంలో బీజేపీ బోధన్ ఇంచార్జీ వడ్డీ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్ విఠల్ కు వినతి పత్రం అందించారు. రైతులకు ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకోవాలని, సాగునీటి సౌకర్యాలు మెరుగుపర్చాలని, పంట నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించాలని ఈ సందర్భంగా వడ్డీ మోహన్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇంచార్జి వడ్డీ మోహన్ రెడ్డి, నియోజకవర్గ నాయకులు అడ్లూరి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు కందగట్ల రాంచందర్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ శ్రీధర్, బోధన్ మండల అధ్యక్షులు సిర్ప సుదర్శన్, పట్టణ అధ్యక్షులు పసులోటి గోపికిషన్ తదితరులు పాల్గొన్నారు.



# రాజన్న ఆలయ అభివృద్ధి పనుల పరిశీలన

### 150 కోట్లతో అభివృద్ధి పనులు

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూన్ 15 (జనంసాక్షి) :** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం విస్తరణ, అభివృద్ధి పనులను సోమవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజన్న ఆలయ అభివృద్ధి విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని,రూ 150 కోట్ల నిధులతో పనులు చేపడుతున్నామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో దేవాదాయ శాఖ మంత్రి,ఉమ్మడి జిల్లా మంత్రుల సహకారంతో ఆలయ అభివృద్ధి చేస్తున్నమని, రాజన్న సన్నిధికి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తమన్నారు. దేశంలో ఎక్కడి శివాలయాల్లో లేని విధంగా రాజన్న ఆలయంలో కోడెలను కట్టేసే సంస్కృతి ఉందన్నారు. విటిడిఏ వైస్ చైర్మన్,అధికారులు దేవాదాయ అధికారుల సమన్వయంతో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. రాజన్న ఆలయాన్ని పూర్తి చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి కంకణం కట్టుకున్నారని,ఆలయ అభివృద్ధికి ఎన్ని నిధులు కావాలన్నా సీఎం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రాజన్న భక్తులు ఎన్నో ఏళ్లుగా ఆలయాన్ని విస్తీర్ణం చేయాలని ఎదురుచూస్తున్నారని,ప్రజా ప్రభుత్వంలో అది నెరవేరుతుందన్నారు. ఆగమ శాస్త్రం ప్రకారం శృంగేరి పీఠాధిపతుల సూచనలతో రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నమన్నారు. అనిమిటి మండపా నిర్మాణ పనులు జరుగుతున్నాయని, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో పని చేస్తూ ముందుకు పోతున్నారన్నారు. మహా మండపంలో అనిమిటి మండపం, బ్రాహ్మణ సత్రం,కోటి లింగాలు,ధర్మ గుండం వంటి అన్ని నిర్మాణాలు ఏక కాలంలో జరుగుతున్నాయని,త్వరలోనే రాజన్న ఆలయ అభివృద్ధి పనులు పూర్తి చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తామన్నారు. ఆయన వెంట ఆలయ ఈవో రమాదేవి పాల్గొన్నారు.

# కొండాపూర్ కరీంనగర్ డెయిరీ అధ్యక్షుడిగా వడియాల సుధాకర్ రెడ్డి ఎన్నిక

### డైరెక్టర్లుగా కనగండ్ల లింగయ్య, చీకుట్ల రాజు

**చిగురుమామిడి జూన్ 15(జనంసాక్షి):** మండలంలోని కొండాపూర్ గ్రామ కరీంనగర్ డెయిరీ అధ్యక్షులుగా వడియాల సుధాకర్ రెడ్డిని ఎన్నుకున్నారు. సోమవారం పాలకేంద్రంలో వడియాల రవీందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన జనరల్ బాడీ సమావేశం అనంతరం అధ్యక్షుడితోపాటు డైరెక్టర్లను ఎన్నుకున్నారు. డైరెక్టర్లుగా కనగండ్ల లింగయ్యను, చీకుట్ల రాజును ఎన్నుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి రైతు వ్యవసాయంతో పాటు ఆవులను, గేదెలను పెంచుకొని మరింత ఆర్థికంగా ఎదగాలని కోరారు. పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే ధ్యేయంగా కరీంనగర్ డెయిరీ చైర్మన్ రాజేశ్వర్ రావు సహకారంతో నిరంతరం పనిచేస్తానని చెప్పారు. తనను అధ్యక్షుడిగా ఎన్నుకున్న పాల ఉత్పత్తిదారులకు డైరెక్టర్లకు సుధాకర్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రూట్ సూపర్వైజర్ సీత రవి యాదవ్,కార్యదర్శి రెడ్డి సంపత్, డైరెక్టర్లు చీకుట్ల కుమార్,మాతంగి మైసయ్య,బింగి గంగయ్య, వడియాల రవీందర్ రెడ్డి,గుడాల సంపత్ గౌడ్, కనగండ్ల రాజ కొమురయ్య, గుళ్ళ స్వామి, టెస్టర్ బుర్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పిల్లలకు 100% ఫీజు మినహాయింపు

- ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో రాయితీ కోసం వినతి
- టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి కుడుతాడి బాపురావు డిమాండ్
- ఆర్థిక ఇబ్బందులు తీర్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్‌కు వినతిపత్రం



కరీంనగర్ టౌన్, జూన్ 15 (జనంసాక్షి): కరీంనగర్ జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు జిల్లా పరిధిలోని అన్ని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో 100 శాతం ఫీజు మినహాయింపు కల్పించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) జిల్లా కార్యదర్శి కుడుతాడి బాపురావు కోరారు. ఈ మేరకు సోమవారం టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఆర్థిక, సామాజిక సమస్యలను కలెక్టర్‌కు వివరించిన బాపురావు, వారి పిల్లల విద్యాభారం కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. జర్నలిస్టులు ప్రజాస్వామ్యంలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, వారిలో అధిక శాతం మంది తక్కువ వేతనాలతో లేదా స్థిరమైన ఆదాయం లేకుండా జీవనం సాగిస్తున్నారని తెలిపారు. చాలీచాలని వేతనాలు, ఉద్యోగ భద్రత లేకపోవడం, పెరుగుతున్న జీవన వ్యయం కారణంగా తమ పిల్లల విద్యను కొనసాగించడం కూడా భారంగా మారిందన్నారు. ముఖ్యంగా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో పెరుగుతున్న ఫీజులు జర్నలిస్టు కుటుంబాలకు తీవ్రమైన భారం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.
జర్నలిస్టుల సేవలను గుర్తించి వారి పిల్లలకు అన్ని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పూర్తిస్థాయి ఫీజు రాయితీ కల్పించే విధంగా ప్రభుత్వం ప్రత్యేక జీవో లేదా సర్క్యులర్ జారీ చేయాలని కోరారు. రాబోయే 2026–27 విద్యా సంవత్సరంలోనే ఈ సౌకర్యం అమలులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల కుటుంబాల ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకుంటే విద్యా రంగంలో వారికి గణనీయమైన ఊరట లభిస్తుందని పేర్కొన్నారు.
ఈ అంశంపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు బాపురావు తెలిపారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ పి.ఎస్. రవీంద్ర, టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు గాదె కరుణాకర్ రావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పంతాటి రవీందర్, భూపతి సంతోష్, జిల్లా ఉపాధ్యక్షులు కొమ్ము గణేష్, లక్కం సురేష్, జిల్లా కార్యదర్శులు గుండి కిరణ్ గౌడ్, ఎమ్.డి. ఖాజా, నాయకులు సుదర్శన్ రెడ్డి, అనిల్, హుజురాబాద్ డివిజన్ అధ్యక్షుడు యోహాన్, దీక్షిత్, గౌతమ్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పాస్‌పోర్ట్ పోయినది

**మిరుదొడ్డి గజేందర్, తండ్రి: నారాయణ,** ఇ.నెం: 5-1-169, సంజయ్ నగర్, జనగామ గ్రా ॥ మం॥ జిల్లా : జనగామ తెలంగాణ అను నేను తెలియజేయునది ఏమనగా... నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ (N8331308) జనగామ లోని నా ఇంటి నుండి బస్టాండ్‌కు వెళ్లే మార్గమధ్యలో పోయినది. దీనిపై జనగామ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడమైనది. ఎవరికైనా లభిస్తే దయ చేసి క్రింది నెంబరుకు సమాచారం ఇవ్వగలరు.
**ఫోన్ నెంబర్: 9866691581**

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
16 జూన్ 2026

# అమ్మకు అక్షరమాల గ్రాండ్ సక్సెస్

- పరీక్షకు హాజరైన వారిలో 83.3 శాతం మహిళలు ఉత్తీర్ణత
- పదో తరగతి పరీక్షలు రాసేందుకు అర్హత పొందిన లక్షలాది మంది మహిళలు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** నిరక్షరాస్యత నిర్మూలన, మహిళా సాధికారత లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "అమ్మకు అక్షరమాల" కార్యక్రమం ఘన విజయాన్ని సాధించింది. మహిళా స్వయం సహాయక సంఘాల నిరక్షరాస్య సభ్యులకు అక్షరాస్యతను అందించాలనే సంకల్పంతో ప్రారంభించిన ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా విశేష ఫలితాలను అందించింది. తాజాగా నిర్వహించిన పరీక్షల్లో హాజరైన మహిళల్లో 83.3 శాతం మంది ఉత్తీర్ణత సాధించడం కార్యక్రమం విజయానికి నిదర్శనంగా నిలిచింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7 లక్షల మంది మహిళలకు అక్షరాస్యత బోధన అందించగా, వారిలో 6 లక్షల 12 వేల మంది పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షలు రాసిన వారిలో 5 లక్షల 10 వేల మందికి పైగా మహిళలు ఉత్తీర్ణత సాధించారు. ఈ విజయంతో లక్షలాది మంది మహిళలు ఇకపై పదో తరగతి పరీక్షలు రాసేందుకు అర్హత పొందారు. దీంతో వారి విద్యాభ్యాసానికి కొత్త మార్గాలు తెరుచుకున్నాయి.

ఈ సందర్భంగా పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క స్పందిస్తూ, ఇది కేవలం ప్రభుత్వ కార్యక్రమం విజయం మాత్రమే కాదని, రాష్ట్ర మహిళల సంకల్పం, పట్టుదల, ఆత్మవిశ్వాసానికి నిదర్శనమని అన్నారు. కుటుంబ బాధ్యతలను నిర్వహిస్తూ విద్యను అభ్యసించి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన ప్రతి మహిళ అభినందనీయురాలని పేర్కొన్నారు. అక్షరాస్యత సాధించడం ద్వారా మహిళల్లో ఆత్మవిశ్వాసం పెరగడంతో పాటు కుటుంబాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కూడా ఇది దోహదపడుతుందని మంత్రి తెలిపారు. చదువు లేక ఎన్నో అవకాశాలను కోల్పోయిన మహిళలకు "అమ్మకు అక్షరమాల" కార్యక్రమం కొత్త జీవితాన్ని అందించిందని పేర్కొన్నారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన మహిళలు అక్కడితో చదువును ఆపకుండా పదో తరగతి, ఇంటర్మీడియట్ తదితర ఉన్నత విద్యను కొనసాగించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి సీతక్క ఆదేశించారు. ప్రతి జిల్లాలో ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, ఉత్తీర్ణులైన మహిళలను తదుపరి విద్యా కార్యక్రమాల్లో చేర్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళా సాధికారత దిశగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల్లో "అమ్మకు అక్షరమాల" ఒక మైలురాయిగా నిలిచిందని, అక్షరాస్యత నుంచి ఉన్నత విద్య వరకు మహిళలను ముందుకు నడిపించే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఒక్క మహిళ కూడా నిరక్షరాస్యురాలిగా మిగలకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆమె పేర్కొన్నారు.

## తెలంగాణ వ్యాప్తంగా 'బ్రేక్‌ఫాస్ట్ విత్ మిల్క్' పథకం

### రాజ్‌భవన్ స్కూల్‌లో ప్రారంభించిన మంత్రి పొన్నం



**హైదరాబాద్, జూన్15 (జనంసాక్షి) :** తెలంగాణ వ్యాప్తంగా 'బ్రేక్‌ఫాస్ట్ విత్ మిల్క్' పథకం ప్రారంభమైంది. సోమవారం ఉదయం రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాలలో అల్పాహారం పథకాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేసిన మంత్రి.. వారికి పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యత ప్రమాణాలతో బ్రేక్‌ఫాస్ట్ అందిస్తున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వ విద్యను ప్రోత్సహించే విధంగా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందేలా ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చినట్లు చెప్పారు. వారంలో 6 రోజులు మంచి బ్రేక్‌ఫాస్ట్ పాలు, రాగి జావాను అందిస్తున్నామని.. దాదాపు రూ.800 కోట్ల వ్యయంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. విద్యార్థులను ప్రైవేట్ స్కూళ్ల నుంచి ప్రభుత్వ స్కూళ్లకు పంపించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వెల్లడించారు. ప్రభుత్వ స్కూల్లో చదివితేనే ప్రభుత్వ పథకాలు అందుతాయనే రోజులు రానున్నాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రభుత్వ పథకాలు కావాలి కానీ ప్రభుత్వ ఆసుపత్రులు, స్కూల్ వద్దు అనే భావన ఉందన్నారు. దాన్ని తొలగించేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు రూ.800 కోట్లతో ఈ పథకాన్ని ప్రారంభించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, కలెక్టర్ ప్రియాంక పాల్గొన్నారు.

## గోల్కొండ హత్య కేసు ఛేదించిన పోలీసులు

### ప్రేమ వివాహం చేసుకున్నందుకు మసూద్ హత్య



**హైదరాబాద్, జూన్ 15 (జనంసాక్షి) :** నగరంలోని గోల్కొండలో సంచలనం సృష్టించిన హత్య కేసును పాతబస్తీ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు సహా నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం నిందితులను కోర్టులో హాజరు పరిచారు. వారికి కోర్టు జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. ప్రేమ వివాహమే ఈ హత్యకు ప్రధాన కారణమని పోలీసులు వెల్లడించారు. 2025, జనవరిలో రుక్సార్ బేగంను మసూద్ చాంది ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈ వివాహాన్ని రుక్సార్ సోదరుడు జాహెద్ తీవ్రంగా వ్యతిరేకించాడు. ఈ నేపథ్యంలో వారితో అతడు తరచూ ఘర్షణకు దిగేవాడు. జూన్ 12వ తేదీన సోదరి నివాసానికి తన బంధువులతో కలిసి వెళ్లి మసూద్‌పై జాహెద్ దాడి చేశాడు. ఇనుప రాడ్లు, కత్తులతో బలంగా దాడి చేయడంతో మసూద్ అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే ఈ దాడిని మసూద్ తండ్రి షేక్ ఇస్మాయిల్ అడ్డుకోబోయాడు. దాంతో ఆయన కూడా తీవ్రంగా గాయపడ్డాడు. హత్యపై ఫిర్యాదు అందడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏసీపీ సయ్యద్ ఫియాజ్ పర్యవేక్షణలో నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. దీంతో గోల్కొండలో వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి ఇనుప రాడ్, కత్తిని గోల్కొండ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పాత కక్షలు, ప్రేమ వివాహమే ఈ హత్యకు కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.

## చిన్నారిపై కోతుల మంద దాడి

- గాయపడ్డ చిన్నారి ఆస్పత్రికి తరలింపు

**రాజన్న సిరిసిల్ల, జూన్15 (జనంసాక్షి) :** జిల్లాలో కోతులు బీభత్సం సృష్టించాయి. ఇంటి ముందు ఆడుకుంటున్న మూడేళ్ళ చిన్నారిపై కోతులు దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలో కోతులు బీభత్సం సృష్టించాయి. మండలంలోని బొప్పాపూర్ లో ఇంటి ముందు ఆడుకుంటున్న మూడేళ్ళ చిన్నారి అన్వికపై దాడికి చేశాయి. కోతులు దాడి చేసే సమయంలో చిన్నారి అన్విక కేకలు విని వెంటనే తల్లి కోతులను తరిమికొట్టింది . కోతుల దాడిలో అంవికకు తీవ్ర గాయాలయ్యాయి. చిన్నారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గ్రామంలో కోతులు, కుక్కల బెడదతో భయాందోళనకు గురవుతున్నామని అంటున్నారు గ్రామస్తులు. కోతుల సమస్యపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు గ్రామస్తులు. చిన్నారులు బయట ఆడుకోవాలంటే భయపడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## బ్రహ్మానాయుడికి మూడు రోజుల పోలీసు కస్టడీ

- రంగారెడ్డి జిల్లా కోర్టు అనుమతి



**హైదరాబాద్, జూన్15 (జనంసాక్షి) :** హైదరాబాద్ నగరంలో ప్రభుత్వ భూములు కాజేసే కుట్ర కేసులో అరెస్టయిన వైకాపా మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడికి మూడు రోజుల పోలీసు కస్టడీకి రంగారెడ్డి జిల్లా కోర్టు అనుమతించింది. గండిపేట సమీపంలో ప్రభుత్వ భూమిని కాజేసేందుకు నకిలీ జీవోలు సృష్టించారు. వీటి ఆధారంగా ఈ కేసులో అరెస్టయిన మరికొందరు నిందితులతో ఆర్థిక లావాదేవీలు నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు.. బొల్లా బ్రహ్మానాయుడి పాత్ర ఉన్నట్లు పక్కా ఆధారాలు సేకరించి అరెస్ట్ చేశారు. ఈ కేసులో మరిన్ని వివరాలు రాబట్టేందుకు ఆయన్ను కస్టడీకి ఇవ్వాలని కోరగా.. కోర్టు అనుమతించింది. రేపటి నుంచి మూడు రోజులపాటు బొల్లా బ్రహ్మానాయుడిని కస్టడీకి తీసుకుని పోలీసులు విచారించనున్నారు.

## పాపికొండల పర్యాటకుల భద్రతకు పెద్దపీట

- బోట్ల భద్రతను తనిఖీ చేసిన అధికారులు



**దేవీపట్నం, జూన్15 (జనంసాక్షి) :** పాపికొండలు పర్యాటకుల భద్రత కోసం ఏపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పర్యాటక బోట్లను అధికారులు విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గోదావరిలో తిరిగే బోట్ల భద్రతా ప్రమాణాలను పరిశీలిస్తున్నారు. ఇవాల్టి నుంచి పాపికొండలు విహార యాత్రను తాత్కాలికంగా నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో దేవీపట్నం మండలం గండి పోచమ్మ ఆలయం వద్ద ఇటీవల సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన బోట్లను ఆర్డీవో స్వాతి తనిఖీ చేశారు. పర్యాటకులతో బయల్దేరిన బోటు మధ్యలో నిలిచిపోవడంపై ఆరా తీశారు. గండి పోచమ్మ బోటింగ్ పాయింట్ వద్ద సౌకర్యాలను ఆర్డీవో పరిశీలించారు. బోటు యజమానులు, పర్యాటక శాఖ అధికారులతో ఆర్డీవో సమావేశమయ్యారు. అన్నిబోట్ల ఫిట్‌నెస్‌ను తనిఖీ చేసి సరిగా ఉన్నాకే నదిలో విహారానికి అనుమతివ్వాలని ఆదేశించారు. ప్రతి బోటుకూ ఫిట్‌నెస్ ధ్రువపత్రం తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

## దేశ సమగ్రత, శ్రేయస్సు లక్ష్యంగా జనసేన ఆవిర్భావం

- 12 ఏళ్ల ప్రస్థానంలో అనేక పోరాటాలు..విజయాలు..పరాజయాలు
- ఆచరణాత్మక విధానాలతో పయనం వల్లే పార్టీ నిలబడింది
- మార్పు కోసం ఎవరైనా ప్రయత్నించవచ్చు
- అందుకు కాక్రోచ్ జనతా పార్టీయే ఉదాహరణ
- జాతీయ సమగ్రత కోసం సేన ప్రస్థానం సభలో పవన్ కళ్యాణ్



**న్యూఢిల్లీ, జూన్15 (జనంసాక్షి) :** జనసేన ప్రారంభించినప్పుడు దేశ సమగ్రత, శ్రేయస్సు తప్ప.. తనకు ఏ ఆలోచనా లేదని ఆ పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ అన్నారు. పార్టీ స్థాపించినప్పుడు అధికారం వస్తుందో, రాదో కూడా తెలియదన్నారు. 'జాతీయ సమగ్రత కోసం సేన ప్రస్థానం' పేరిట దిల్లీలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. పార్టీ స్థాపించి 12 ఏళ్లు పూర్తయిందని, ఈ ప్రయాణంలో చాలా పోరాటాలు చేశామని, పరాజయాలు ఎదుర్కొన్నామని చెప్పారు. మారుతున్న సామాజిక, రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా 7 ప్రాథమిక సూత్రాలను వదల్లేదు. నిర్దిష్ట ఆచరణాత్మక విధానంతో 21 ఎమ్మెల్యే స్థానాలు, 3 ఎంపీ స్థానాలను సాధించాం. లక్ష మంది సభ్యత్వంతో ప్రారంభమైన పార్టీకి.. 20 లక్షలకుపైగా సభ్యత్వాలు వచ్చాయి. ఇటీవల కాలంలో అన్ని ప్రాంతాల నుంచి వేల మంది పార్టీలో చేరుతున్నారు. పార్టీ ప్రయోజనాల కంటే.. దేశ సమగ్రతకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నాం. దేశ స్ఫూర్తిని కాపాడుకోవడం ఒక రోజుతో అయ్యే పని కాదు. దేశ స్ఫూర్తిని ప్రతితరం ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. తెలంగాణ ఏర్పాటుకు ఏనాడూ జనసేన అడ్డు చెప్పలేదని పవన్ మరోమారు స్పష్టం చేశారు. 2014లో ఏపీని విభజించిన తీరును చూసి మాత్రమే ఆవేదన వ్యక్తం చేశాం. విభజన విషయంలో కాంగ్రెస్ వ్యవహ రించిన తీరు.. అసంతృప్తిని, అశాంతిని సృష్టించింది. అప్పటి నుంచి ఇప్పటికీ వారి ధోరణి మారలేదు. జనసేన సభకు అనుమతివ్వకుండా అడ్డుకోవడమే అందుకు ఉదాహరణ. దిల్లీ మెడలు వంచుతాం.. తడాఖా చూపిస్తామంటూ చాలామంది పెద్దలు మాటలు చెబుతారు. వాస్తవానికి అలాంటి నేతలు దిల్లీకి రాగానే వెనక్కి తగ్గుతారు. చాలాసార్లు మనకు మనం తక్కువగా అంచనా వేసుకుంటాం. ప్రతి వ్యక్తి కూడా సమాజంలో మార్పు తీసుకురావొచ్చు. ఈ మధ్య కాక్రోచ్ పార్టీ ఎలా పుట్టుకొచ్చిందో చూస్తున్నాం. కాక్రోచ్ పార్టీని చూస్తే.. చలిచీమల పద్యం గుర్తుకొచ్చింది. చలిచీమలు కూడా బలమైన పామును చంపేస్తాయని పవన్ అన్నారు. ఈ సమావేశంలో మొత్తం ఐదు కీలక తీర్మానాలని ఆమోదించారు. పార్టీ సిద్ధాంతాలు, దేశ అభివృద్ధి దృష్టికోణం, ప్రజాస్వామ్య విలువలు, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి లక్ష్యాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో 'వికసిత్ భారత్ ఆకాంక్షల నుంచి విజయాల వైపు' అనే తీర్మానాన్ని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్, ఏపీ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రతిపాదించారు. సంస్కరణలు, సంక్షేమ కార్యక్రమాలపై పార్టీ భవిష్యత్తు దిశను ఈ తీర్మానం వివరించింది. నాలుగో తీర్మానంగా 'జనసేన పుష్కర కాల ప్రస్థానం, త్యాగం, సేవ, ప్రజల నమ్మకం' అనే అంశాన్ని ఆమోదించారు. సామాజిక మార్పు, నైతిక రాజకీయాలు, సమాన అభివృద్ధి లక్ష్యాలతో ప్రారంభమైన జనసేన పార్టీ 12 ఏళ్ల ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్నందుకు నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. మొత్తం ఐదు తీర్మానాల ద్వారా జనసేన పార్టీ తన రాజకీయ సిద్ధాంతాలను, అభివృద్ధి దృక్పథాన్ని, దేశ సమైక్యతపై నిబద్ధతను మరింత స్పష్టంగా ప్రకటించినట్లు సమావేశంలో నాయకులు పేర్కొన్నారు.

## కుండల అమ్మకంలో వివాదం

- ఇద్దరు మహిళలకు గాయాలు

**నార్కట్‌పల్లి (జనంసాక్షి) :** చెరువుగట్టు రామలింగేశ్వర స్వామి దేవాలయ గట్టు పై ఉన్న ఎల్లమ్మ గుడి వద్ద కుండల అమ్మకం, బోనం సమర్పణ విషయంలో తలెత్తిన వివాదం ఘర్షణకు దారితీసింది. ఎల్లమ్మ గుడి వద్ద గత కొన్నేళ్లుగా ఎల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన శాలివాహన కులస్తులు కుండలను అమ్ముకోవడంతో పాటు అమ్మవారికి బోనం సమర్పిస్తూ వస్తున్నారు. ఈ కుండల అమ్మకం, బోనం సమర్పణను వంతుల వారీగా నిర్వహిస్తున్నారు. ఇదే సమయంలో, అదే గ్రామానికి చెందిన ఓ మహిళ వివాహం జరిగినప్పటికీ తిరిగి గ్రామానికే వచ్చి నివాసం ఉంటున్నట్లు తెలుస్తోంది. ఆమెకు తోబుట్టువులు లేకపోవడంతో తనకూ వాటా ఇవ్వాలని గత కొంతకాలంగా కోరుతూ వస్తోంది. ఈ వివాదం క్రమంగా తీవ్రరూపం దాల్చి సోమవారం భారీ ఘర్షణకు దారితీసింది. అమావాస్య సందర్భంగా గట్టు పై కుండల అమ్మకం, బోనం సమర్పణలో నిమగ్నమైన బొడ్డుపల్లి జ్యోతి, బొడ్డుపల్లి భవానీల పై ఆమె కత్తితో దాడి చేసినట్లు సమాచారం. దీంతో వారిద్దరికీ గాయాల య్యా యి. తొలుత గాయాలను సాధారణ గీతలుగా భావించినప్పటికీ, ఒకరికి చేతి పై కత్తి లోతుగా తగలగా, మరొకరికి వేలు ఊడిపో యేంత తీవ్ర గాయం అయినట్లు తెలుస్తోంది.

## వర్షాకాలంలో జాగ్రత్త

- వ్యాధులు ప్రబలే అవకాశముంది
- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా



**హైదరాబాద్ (జనంసాక్షి) :** వ్యాధులు ప్రబలిన తర్వాత చికిత్స అందించడం కంటే అవి వ్యాప్తి చెందకుండా ముందుగానే అరికట్టడం ఆరోగ్యశాఖ ప్రధాన లక్ష్యంగా ఉండాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. ప్రతి జిల్లా యంత్రాంగం ముందస్తు ప్రణాళికతో పనిచేస్తూ, పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ హాస్పిటల్ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని, మెడిసిన్, రోగ నిర్ధారక కిట్లు, ఓఆర్ఎస్, ప్లేట్‌లెట్లు, వైద్య సిబ్బంది, అత్యవసర సేవల్లో ఎలాంటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సాధారణ జ్వరం, డెంగ్యూ, మలేరియా లేదా ఇతర సీజనల్ వ్యాధుల లక్షణాలతో వచ్చే ప్రతి వ్యక్తికి ఆలస్యం లేకుండా పరీక్షలు నిర్వహించి తక్షణ చికిత్స అందించాలని ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల నివారణ, ప్రభుత్వ హాస్పిటళ్ల సంసిద్ధత, ప్రజారోగ్య పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సోమవారం హైదరాబాద్‌లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. మునిసిపల్, పంచాయతీరాజ్ శాఖల సమన్వయంతో దోమల నివారణ చర్యలను మరింత ముమ్మరం చేయాలని, ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న డ్రై డే కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని, నిల్వ నీటి తొలగింపు, లార్వా నిర్మూలన, ఫాగింగ్, ప్రత్యేక ఫీవర్ సర్వేలు నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని సూచించారు. గ్రామాలు, పట్టణాలు, పాఠశాలలు, హాస్టళ్లు, నిర్మాణ ప్రాంతాలు, అధిక ప్రమాద ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

మున్సిపల్, పంచాయతీరాజ్, విద్య, మహిళా శిశు సంక్షేమం, రెవెన్యూ తదితర శాఖలతో సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి పారిశుద్ధ్య కార్యక్రమాలు, తాగునీటి భద్రత, క్షేత్రస్థాయి పర్యవేక్షణను వేగవంతం చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు. ప్రతి జిల్లాలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు పూర్తిస్థాయిలో పనిచేస్తూ, ఎక్కడైనా వ్యాధుల క్లస్టర్లు ఏర్పడితే, వాటిని గుర్తించి వెంటనే స్పందించి వ్యాప్తిని అరికట్టాలని ఆదేశించారు. ప్రతి జిల్లాకు సంబంధించిన వివరాలతో వీక్లీ రిపోర్ట్‌లు తయారు చేసి, ప్రభుత్వానికి సమర్పించాలని పబ్లిక్ హెల్త్ డైరెక్టరేట్‌ను ఆదేశించారు. సీజనల్ కేసులను ఏమాత్రం తేలికగా తీసుకోవద్దని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి కేసును అత్యంత అప్రమత్తంగా పర్యవేక్షిస్తూ, ప్రజారోగ్య పరిరక్షణలో ఎలాంటి రాజీలేకుండా పనిచేయాలని అధికారులకు సూచించారు. ప్రజలు కూడా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవడం, జ్వరం లేదా ఇతర సీజనల్ వ్యాధుల లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ హాస్పిటల్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. సమీక్షలో మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, డాక్టర్ నరేంద్ర కుమార్, జీహెచ్ఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్, డాక్టర్ అమర్‌సింగ్ నాయక్, పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ అడిషనల్ డైరెక్టర్, మలేరియా విభాగం హెడ్ డాక్టర్ పద్మజ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, డయేరియా, టైఫాయిడ్ తదితర సీజనల్ వ్యాధుల ప్రస్తుత పరిస్థితి, జిల్లాల వారీ కేసులు, ప్రభుత్వ హాస్పిటళ్ల సంసిద్ధత, మందులు, వ్యాధి నిర్ధారణ కిట్లు, దోమల నివారణ చర్యలు, ఫీవర్ సర్వేలు, ప్రజల్లో అవగాహన కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి పబ్లిక్ హెల్త్ డైరెక్టర్, డాక్టర్ రవింద్ర నాయక్ మంత్రికి వివరించారు.



## స్కూలు బస్సులను తనిఖీ చేసిన అధికారులు

**హైదరాబాద్, జూన్15 (జనంసాక్షి) :** తెలంగాణలో పాఠశాలలు తెరుచుకున్న నేపథ్యంలో విద్యాసంస్థల బస్సులను రవాణాశాఖ అధికారులు తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఇవాళ వెయ్యికిపైగా స్కూల్ బస్సులను ఆర్టీఏ అధికారులు తనిఖీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన 150కిపైగా బస్సులపై కేసు నమోదు చేశారు. ఫిట్‌నెస్ లేని 35 విద్యాసంస్థల వాహనాలను సీజ్ చేశారు.

## సినీ నటికి వేధింపులు

- క్యాస్టింగ్ ఆర్టిస్ట్‌పై కేసు



**హైదరాబాద్, జూన్15 (జనంసాక్షి) :** సినిమా అవకాశాల పేరుతో ఓ నటిని వేధించడమే కాకుండా, రావాల్సిన పారితోషికం ఇవ్వకుండా మోసం చేసిన క్యాస్టింగ్ ఆర్టిస్ట్ ప్రసాద్‌పై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. 'ఆకాశంలో ఒక తార' సినిమాలో నటింపజేసినందుకు గానూ సదరు నటికి ఇవ్వాల్సిన రూ.90 వేల పారితోషికం, రూ.38 వేల ప్రయాణ ఖర్చులను ఇవ్వకుండా నిందితుడు కాలయాపన చేశాడు. ఈ క్రమంలోనే గత ఫిబ్రవరిలో బంజారాహిల్స్‌కు పిలిపించి, బకాయిలు ఇవ్వకుండా బెదిరించడమే కాకుండా.. బలవంతంగా కారులో ఎక్కించుకుని మరిన్ని అవకాశాలు ఇస్తానంటూ ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. భయంతో అక్కడి నుంచి వెళ్ళిపోయిన బాధితురాలు జరిగిన విషయాన్ని తల్లికి చెప్పగా, ఆమె నిందితుడిని ఫోన్ లో నిలదీసింది. అయితే ఆమెను సైతం నిందితుడు దుర్భాషలాడి బెదిరించడంతో, బాధితురాలి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## నేటి నుంచి టీజీ పాలిసెట్ వెబ్ ఆప్షన్ల నమోదు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** టీజీ పాలిసెట్ చివరి విడత ప్రవేశాల కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైంది. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, టీజీపాలిసెట్-2026 ప్రవేశాల కన్వీనర్ ఎ.శ్రీదేవసేన తెలిపారు. మంగళవారం సర్టిఫికేట్ వెరిఫికేషన్, జూన్ 16, 17 తేదీల్లో వెబ్ ఆప్షన్ల నమోదు, జూన్ 20 లేదా అంతకంటే ముందుగా సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. కౌన్సెలింగ్‌కు సంబంధించిన పూర్తి వివరాలు, హెల్ప్ లైన్ కేంద్రాల జాబితా, అందుబాటులో ఉన్న కోర్సుల వివరాల కోసం అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ https://tgpolycet.nic.inను సందర్శించాలని కన్వీనర్ సూచించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370